నమస్తే తెలంగాణ ఆదివారం

# బతుకమ్మ

10 ఏప్రిల్ 2022



# రామాయణ పరివారం!





దారుఢ్యానికి సామర్థ్యానికి అసలైన కెప్టెన్

కోట్లాది మంది అభిమానుల హృదయాలు దోచుకున్న భారత క్రికెట్ కెప్టెన్లు, దృఢత్వానికి రోజూ గుడ్లు తింటారు.

గుడ్లలో హై క్వాలిటీ ప్రొటీన్ తో పాటు, విటమిన్ ఎ, బి & డి, మినరల్స్, మైక్రో న్యూట్రియంట్స్ సమృద్ధిగా ఉన్నాయి. ఇవన్నీ మీలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, మిమ్మల్ని బలంగా దృఢంగా ఉంచుతాయి.

బలాన్ని, దృఢత్వాన్ని అందించే అసలైన కెప్టెన్ గుడ్డు. ప్రతి రోజు గుడ్డు తినండి.

NECC
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ

మనీ ప్లాంట్

# చేబదులు.. నీళ్లోదులు!

**‘ఓ పదివేలు కావాలి. అర్జెంట్. ఫస్టుకంతా ఇచ్చేస్తా’ అని ఎవరో అడుగుతారు. కాదనలేని మొహమాటం. వెంటనే ట్రాన్స్‌ఫర్ చేస్తాం. తర్వాత ఉలుకూపలుకూ ఉండదు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు కాకపోవచ్చు. కానీ ప్రతి మానవ సంబంధంలో ఆర్థిక కోణం ఇమిడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలి?**

చేబదులు.. అయినవారి మధ్య ఆర్థిక సర్దుబాటు. రాతకోతలు, సాక్షి సంతకాలు ఉండవు. సాధ్యమైనంత త్వరగా తిరిగి ఇవ్వడం కనీస బాధ్యత. ఆ వ్యక్తి ఇవ్వకపోతే.. మనమే గుర్తుచేయాలి, ఎలాగోలా వెనక్కి రాబట్టుకోవాలి. అలా అని, స్నేహబంధాన్ని వదులుకోకూడదు, ఆర్థిక సంబంధానికి మాత్రమే బ్రేకప్ చెప్పాలి.

ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యమే చేబదుళ్లకు ప్రధాన కారణం. ఎంతమొత్తాన్ని చేబదులుగా పరిగణించాలన్నది వారివారి ఆర్థిక స్తోమతను బట్టి ఉంటుంది. ఆ సొమ్ము వెనక్కి రాకపోయినా కూడా.. మన ఆర్థిక పరిస్థితిపై ఏమాత్రం ప్రభావం పడనంత చిన్న మొత్తాలను చేబదుళ్లుగా భావించవచ్చు.

చేబదులు అడుగుతున్న వ్యక్తి ఆత్మీయుడు అయినప్పుడు, తరచూ చేతులు చాస్తున్నప్పుడు.. తనను కూర్చోబెట్టి మాట్లాడాలి. సమస్య మూలాలు తెలుసుకోవాలి. అత్తెసరు సంపాదన, ఆదాయానికి మించిన ఖర్చులు, వ్యసనాలు, వ్యాపార నష్టాలు.. కారణాన్ని గుర్తించి, పరిష్కారం సూచించాలి.




మనం ఇస్తాం. ఎదుటి వ్యక్తి తీసుకుంటాడు. ఆ తర్వాత, ‘నువ్వు నాకు చేబదులు ఇవ్వడం ఏమిటి?’ అంటూ నాలుక మడతపెడుతుంటారు కొందరు. ‘మనవాళ్లతో చెప్పొద్దు ప్లీజ్’ అంటూ ముందు జాగ్రత్త పడుతుంటారు మరికొందరు. ఆ తలనొప్పి ఎందుకు? ఎవరో ఒకరి సమక్షంలోనే డబ్బు ఇవ్వండి. ఆన్‌లైన్ బదిలీ అయితే.. వివరాలు భద్రపరుచుకోండి.

మీకే అనుకోని ఇబ్బందులు ఎదురైతే .. చేబదులును చివరి అస్త్రంగానే ప్రయోగించండి. చిన్నచిన్న ఖర్చుల కోసం బ్యాంకులు తక్షణ రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఒక్క క్లిక్‌తో డబ్బు పడిపోతుంది. లేదంటే, ఏ బంగారమో కుదువపెట్టవచ్చు. ఆఫీసులో శాలరీ అడ్వాన్స్ ఇస్తారేమో కనుక్కోవచ్చు. అన్ని మార్గాలూ మూసుకుపోతే మాత్రం.. బదులుదారే!

అడిగినప్పుడల్లా చేబదులు ఇవ్వలేం. కచ్చితంగా తిరిగిరాదని తెలిసీ పర్సుకు రంధ్రం వేసుకోలేం. అప్పటికే ఓసారి చెయ్యి కాల్చుకున్న అనుభవం ఉండనే ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ‘కష్టం’, ‘సారీ’, ‘కమిట్‌మెంట్స్ ఉన్నాయి’.. అని చెప్పి సున్నితంగా తప్పించుకోవచ్చు.

చేబదులు ఇచ్చేముందు జీవిత భాగస్వామితో చర్చించాలి. తనను ఒప్పించాకే ఏ నిర్ణయమైనా. చాలా సందర్భాల్లో ఇలాంటి చిన్నచిన్న విషయాలే ఆలూమగల మధ్య అగాథాన్ని సృష్టిస్తాయి. చేబదులు అనేది తాత్కాలిక సర్దుబాటు కాబట్టి, వడ్డీ తీసుకోవద్దు.

కొన్ని చేబదుళ్లు ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌కు దారితీస్తాయి. అడిగిన తక్షణం చేతిలో ఎంతోకొంత పెడితే సరి. లేకపోతే, గొడవకు దిగుతారు. చరిత్రంతా తవ్వుతారు. భయపెడతారు. ఆ వలలో పడొద్దు. అంత చనువు ఇవ్వొద్దు.

**చేబదులు ఇచ్చిన ప్రతిసారీ.. మీ డబ్బు మీకు దక్కుతుందన్న భరోసా లేదు. కొన్నిసార్లు శత్రుత్వమూ దక్కవచ్చు. అలా అని, అదంతా చేబదులు తప్పు కాదు. డబ్బు చేసే మాయ!**

# మోకాళ్ళ నొప్పులకు కార్టిలేజ్ (గుజ్జు) అరిగిపోవడమే ముఖ్య కారణము



- కార్టిలేజ్ వృద్ధి చెయ్యడం ఒక్కటే దీనికి పరిస్కారం
- EPIONE లో భారతదేశంలోనే మొట్టమొదటగా అత్యాదునిక Plasma (ప్లాస్మా) చికిత్స
- 5000 కు పైగా విజయవంతంగా చికిత్స పొందిన బాధితులు

### టైమ్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డు

పెయిన్ మేనేజ్ మెంట్ లో అద్భుతమైన వైద్య సేవలను అందిస్తున్న ఎపియాన్ పెయిన్ మేనేజ్ మెంట్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ సుధీర్ దారాకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సేవలను గుర్తించి ఉభయ తెలుగు రాష్ట్రాల పక్షాన టైమ్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డుతో గౌరవించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా డాక్టర్ సుధీర్ దారా అవార్డును అందుకున్నారు.

వయస్సు పెరిగే కొద్దీ మోకాళ్ళ నొప్పులు పెరగడం మానవుని జీవితంలో సర్వసాధారణం. మోకాలి చిప్పల మధ్య ఉన్న కార్టిలేజ్ (గుజ్జు) అరిగి పోవడంతో మోకాళ్ళ నొప్పులు మొదలవుతాయి. రోగి రక్తంలోని ప్లాస్మాను సేకరించి గుజ్జు అరిగిపోయిన చోట అభివృద్ధి చేయడమే ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ. ఈ సరికొత్త, అధునాతన ట్రీట్మెంట్ను ఏపియోన్ పెయిన్ రిలీఫ్ సెంటర్ దేశ ప్రజలకు అందుబాటులో తెచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా నెలకొల్పబడిన ఈ సంస్థ అనతికాలంలోనే 5000 మందికి చికిత్స అందించి వారి జీవిత ప్రయాణం సాఫీగా సాగడానికి సహాయపడింది.

### ఈ మోకీళ్ళ నొప్పి తీవ్రతను ఎలా నివారించగలం?

ఎక్కువసేపు కూర్చోవడం, నిల్చోవడం చేయరాదు. మెట్లెక్కడం, మోకాళ్ళపై కూర్చోవడం మరియు నేలపై కూర్చోవడం నివారించాలి. ఇలా చేస్తే ముందు నుండి ఉన్న మోకీళ్ళ నొప్పి ఇంకా ముదరడాన్ని అరికట్టవచ్చును. తొడ కండరాలను పటిష్ట పరచుటకు రోజూ నడక, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, బరువు తగ్గటం మరియు సరియైన కూర్చొనే అలవాట్లు తీవ్రమైన మోకీళ్ళ నొప్పిని తగ్గించుటలో మిక్కిలి తోడ్పడగలవు. మోకాళ్ల నొప్పితో బాధపడేవాళ్లు ఏ వయస్సు వారైనా ఈ చికిత్స తీసుకోవచ్చు. మోకాళ్ల నొప్పి 45 ఏండ్ల వయసు ఆపై వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తోంది. పెద్ద వయసు వాళ్లలో అధికం. యువకుల్లో అయితే క్రీడలు ఆడేటప్పుడు, ఇతర గాయాలైనప్పుడు కూడా మోకాళ్ల నొప్పి సమస్య రావొచ్చు. అధిక బరువు, స్థూలకాయం సమస్య ఉన్న వాళ్లలో కూడా మోకాళ్ల నొప్పి ఎక్కువ.



### ప్లాస్మా చికిత్స ఎలా పనిచేస్తుంది?

రక్తంలో ఉండే ప్లేట్లెట్ కణాలు చాలా చిన్నవి. రక్తం గడ్డకట్టే ప్రక్రియలో ఇవి కీలక పాత్ర వహిస్తాయి. మోకాలి కీలులో కార్టిలేజ్ దెబ్బతిన్నప్పుడు సాధారణంగా మోకాళ్ల నొప్పులు వస్తాయి. ఇలా దెబ్బతిన్న భాగంలోకి ప్లేట్లెట్లు ఎక్కువగా ఉండే ప్లాస్మాను ఇంజెక్ట్ చేస్తారు. దాంతో కొత్త కణజాలాన్ని ఉత్పత్తి చేయగల కారకాలు ప్రేరేపించబడుతాయి. ఫలితంగా మొత్తం కణజాలం పునరుత్పత్తి చెందుతుంది.

### ఇవి లాభాలు

చికిత్స కేవలం 30 నిమిషాల్లో పూర్తవుతుంది. మోకాళ్ల మార్పిడి చికిత్స లాగా ఇది ఆపరేషన్ కాదు. చిన్న ఇంజక్షన్ ద్వారా చేయబడుతుంది. కాబట్టి నొప్పి ఉండదు. రక్తస్రావం ఉండదు. ఈ చికిత్స పొందిన వాళ్ళు ఎటువంటి ఇబ్బంది లేకుండా చికిత్స అయిన వెంటనే ఇంటికి వెళ్లిపోవచ్చు. దీని వల్ల ఇన్ఫెక్షన్ల బాధ ఉండదు. ఏ ఇతర సైడ్ ఎఫెక్ట్సులూ ఉండవు. సమస్యకు మంచి పరిష్కారం దొరుకుతుంది.

చికిత్స ప్రారంభం నుంచే నొప్పి తగ్గుముఖం పట్టి ఎప్పటిలా పనులు చేసుకోవచ్చు. మోకాలి చికిత్స కోసం ఉన్న చికిత్సల్లో ప్లేట్ లెట్ రిచ్ ప్లాస్మా విధానం కంటే సమర్థవంతమైనది మరోటి ఉందని ఇప్పటి వరకు నిరూపితం కాలేదు. దీనికి బెడ్ రెస్ట్ కూడా అవసరం లేదు. మోకాలి. కీళ్ల సమస్యలను తగ్గించడానికి ఇది సహజమైన సౌకర్యవంతమైన మార్గం ఆధునిక చికిత్సా విధానం అందుబాటులోకి తెచ్చిన EPIONE పెయిన్ మేనేజ్మెంట్ సెంటర్లో మోకాళ్ల, SHOULDER నొప్పులకే కాకుండా నడుంనొప్పి, మైగ్రేన్ తలనొప్పి, స్పాండిలైటిస్, సయాటికా లాంటి అన్ని దీర్ఘకాలిక నొప్పులకు ఆపరేషన్ అవసరం లేకుండా ఆధునిక చికిత్సలు లభిస్తాయి.


**ఇన్సూరెన్స్ సౌకర్యం కలదు**

EPIONE
Center for Pain Relief & Beyond
Pain, Neurology & Regenerative Clinics

**EPIONE CENTER FOR PAIN RELIEF AND BEYOND**
4th Floor, Apurupa PCH, Road Number 2, Banjara Hills, Hyderabad-33
Phone: 875-875-875-1, 84660 44441

NABH ACCREDITED
FDA APPROVED

**DR. SUDHEER DARA**
MBBS MD IAPM
FOUNDER DIRECTOR OF
EPIONE - CENTER FOR PAIN RELIEF AND BEYOND



# బతుకమ్మ

10 ఏప్రిల్ 2022

## లోపలి కమ్మల్లో..





7 మన సంస్కృతి

కరెంట్ మీటర్ 17

21 పలుకుబడులు

అందమైన.. ఆత్మవిశ్వాసం! 26

28 రాశి ఫలాలు

వాస్తు 30

31 హెల్త్ బిట్స్

పుస్తక సమీక్ష 32

33 అల్లరి


## క్యా బాత్‌హై!





ఈ సంచికపై మీ అభిప్రాయాలను మాకు తెలియజేయండి.

పోస్టు ద్వారా: బతుకమ్మ, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
ఈ-మెయిల్ : sunmag@ntnews.com

# అడ్వాన్స్‌డ్ హోమియోపతి పద్ధతితో చక్కని పరిష్కారం.

Master's Homeopathy
We are the Ultimate Solution

## నడుంనొప్పి, మెడనొప్పిని ఎన్నాళ్లు భరిస్తారు?

**మెడనొప్పి:** మెడ, వెన్నుపూసలో మార్పులు రావటం వల్ల నగరాలు ఒత్తిడి పడి ఈ సమస్య తలెత్తుతుంది.
బిగుసుకుపోయినట్లుగా తయారవడం దీని ప్రధాన లక్షణం. మెదడు, వెన్నుపూస నుంచి శరీరానికి సరఫరా అయ్యే ముఖ్యమైన నరాలు మెడ ఎముక ద్వారా సరఫరా అవుతుంటాయి. ఏదైనా కారణం వల్ల ఈ మెడ నరాలపైన ఒత్తిడి పెరిగినపుడు మెడ నొప్పి మొదలవుతుంది. నిర్లక్ష్యం చేస్తే కండరాలు, రక్తనాళాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సర్వైకల్ స్పాండిలోసిస్ సమస్య పురుషులలో తొందరగా, ఎక్కువగా కనిపిస్తుంది.

**నడుం నొప్పి:** నడుము భాగంలో నొప్పి వస్తున్నట్లయితే లుంబార్ స్పాండిలోసిస్ అంటారు. నడుము నొప్పి మూలంగా ఏ పనీ చేసుకోలేకపోతారు. ఉదయం వేళ నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా నడుము నుంచి కాళ్లలోకి విస్తరిస్తుంది. అరుదుగా మూత్రవిసర్జనపై నియంత్రణ కోల్పోవడం జరుగుతుంది. సరియైన భంగిమలో కూర్చోకుండా పని చేసే వారిలోనూ, గంటల తరబడి కూర్చుని పనిచేసే వారిలోనూ ఈ సమస్య వస్తుంది. కొందరిలో వెన్ను చివరి భాగంలో నొప్పి వస్తుంటుంది. దీన్ని సాక్రం పెయిన్(టేల్ పెయిన్) అంటారు. దీనివల్ల కుదురుగా కూర్చోలేకపోతారు.
కూర్చోవడంలో, నిలుచుండే సమయంలో తీవ్రమైన నొప్పి వస్తుంటుంది. హిప్ పెయిన్ ఉంటుంది. చెక్క కుర్చీలపై కూర్చోలేకపోతారు

## హెచ్ఐవి, హెర్పిస్ ఆటకట్టు

హెచ్ఐవి సోకితే మరణం తప్పదనే భావన ఇప్పటికి చాలా మందిలో ఉంది. నిజానికి హోమియోలో హెచ్ఐవి వైరసను కట్టడి చేసే మందులు ఉన్నాయి. హెచ్ఐవి ఎక్కువ విస్తరిస్తుండటానికి కారణం దీని లక్షణాలు కొన్ని ఏళ్ల తరువాత బయటపడటమే. అప్పటి వరకు వారికి హెచ్ఐవి ఉన్న విషయం కూడా తెలియదు. రోగనిరోధక శక్తి తగ్గినపుడు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. విరేచనాలు కావడం, బరువు తగ్గడం, అవకాశవాద వ్యాధులు విజృంభించడం, వాతావరణ మార్పులను తట్టుకోలేకపోవడం, త్వరగా వ్యాధులు వస్తుండటం జరుగుతుంది.

పురుషాంగంపైన చెమట పొక్కుల మాదిరిగా నీటి పొక్కులు కనిపిస్తాయి. నీటిపొక్కులు ఎర్రగా ఉండి దురద ఉంటుంది. నీటిపొక్కులు పగిలి ఎర్రగా పుండు పడుతుంది. ఇటువంటి సమయంలో తగు చికిత్స తీసుకోకపోతే ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. లైంగిక కలయిక ద్వారా సంక్రమించే ఈ వ్యాధిని హెర్పిస్ అని అంటారు..

## సైనసైటిస్, ఆస్తమాలు మళ్లీ బాధించవు

సైనసైటిస్, ఆస్తమా దీర్ఘకాలం వేధించే జబ్బులని చాలా మంది అనుకుంటారు. కానీ హోమియోలో శాశ్వతంగా తగ్గించే వీలుంది. సైనస్లో ఉండే డిఫెన్స్ మెకానిజం చాలా వరకు సూక్ష్మక్రిములు శరీరంలోకి రాకుండా అడ్డుకుంటుంది. కానీ 5 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే పార్టికల్స్ సైనస్లోలో ఆగకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతాయి. వీటిని బయటకు పంపించడానికి శరీరం ప్రయత్నిస్తుంది. ఫలితంగానే తుమ్ములు వస్తుంటాయి. అంతేకాకుండా పెస్టిసైడ్స్ ఉపయోగించిన పదార్థాలు తీసుకోవడం, ప్రిజర్వేటివ్స్ వాడిన ఎ అహారపదార్థాలు తినడం, వాతావరణ కాలుష్యం, ఇంట్లో పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉండటం వంటివి సైనస్ సమస్యకు, ఆస్తమాకు కారణమవుతాయి.

## ఇతర ప్రత్యేక చికిత్సలు

## ఇంకెంతకాలం మోకాళ్ళ నొప్పులతో బాధపడతారు ?

అనుభవజ్ఞులైన **Dr. Ravi Kirane** గారి ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ హోమియోపతి పద్ధతితో ఆపరేషన్ అవసరం లేకుండా చక్కని పరిష్కారం.

### మోకాళ్ళ నొప్పులు



- కీళ్ళ వాపులు • సయాటికా
- డిస్క్ సమస్యలు • సర్వైకల్ లంబార్ స్పాండిలైటిస్
- రుమాటాయిడ్
- గౌట్ ఆర్థ రైటిస్

### డయాబెటిస్





- డయాబెటిక్ న్యూరోపతి
- డయాబెటిక్ నెఫ్రోపతి
- డయాబెటిక్ రెటినోపతి
- ఫుట్ అల్సర్

### చర్మ సమస్యలు




- సోరియాసిస్
- ఎగ్జిమా • బొల్లి
- SLE • దద్దుర్లు
- మొటిమలు
- ఫంగల్ ఇన్ఫెక్షన్

### PCOD




- అధిక బరువు
- థైరాయిడ్
- నెలసరి, హార్మోన్ సమస్యలు
- సంతానలేమి

### లివర్ & గ్యాస్ట్రిక్ సమస్యలు



- హెపటైటిస్ బి,సి
- లివర్ సిర్రోసిస్
- ఫ్యాటీ లివర్
- అల్కహాలిక్ లివర్
- కడుపులో మంట

### శ్వాస సమస్యలు



- అస్తమా • అడినాయిడ్స్
- అలర్జీ • ఫారింజైటిస్
- బ్రాంకైటీస్ • దగ్గు
- సైనసైటిస్ • నిమోనియా





**Dr. Ravi Kirane**
MD, M.Sc (Psych), P.G. (Virology) LONDON
గోల్డ్‌మెడల్ ఫర్ ఎక్సలెన్సీ ఇన్ మెడిసిన్
మాస్టర్ హోమియో పతి

ఆదిలాబాద్,అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, విజయవాడ, కరీంనగర్, విశాఖపట్నం, తిరుపతి, హన్మకొండ, రాజమండ్రి, గుంటూరు,
ఫోన్: 7842 108 108, 040-48106108



# బేబోట్ ఓపెన్ అలర్ట్..



మనం ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఇంటిని దొంగల బారినుంచి కాపాడుకోవడం చాలా ముఖ్యం. అందుకు టెక్నాలజీని ఉపయోగించుకుంటే బేఫికర్‌గా ఉంటుంది. స్మార్ట్‌ఫోనే ఇంటికి రక్షణ కవచంలా నిలుస్తుంది. వైర్ల జంజాటం లేకుండానే.. స్మార్ట్‌గా పనిచేస్తుందీ.. డోర్ సెన్సర్. వైఫైకి కనెక్ట్ చేసి ద్వారానికి బిగిస్తే చాలు. తలుపు తెరిచినా, మూసినా, తెరిచే ఉన్నా వెంటనే యజమాని ఫోన్‌కు సమాచారం వస్తుంది. పరిస్థితిని బట్టి వెంటనే స్పందించవచ్చు. అగ్గిపెట్టె పరిమాణంలోని ఈ పరికరం బ్యాటరీతో పనిచేస్తుంది. ప్రధాన ద్వారానికే కాదు, ఏ గది తలుపుకైనా అమర్చొచ్చు. ఆఫీసులకూ ఉపయోగించవచ్చు. మార్కెట్లో దీని ధర రూ.3,399.



# థర్మాసెల్ ఎల్ఐవీ..

ఒకప్పుడు దోమల్ని పారదోలడానికి బత్తీలు, బిళ్లలు వాడేవారు. ఆ తర్వాత లిక్విడ్ రీఫిల్స్ వచ్చాయి. ప్రస్తుతం టెక్నాలజీ సాయంతో నడిచే వివిధ పరికరాలు దొరుకుతున్నాయి. అందులో ఒకటి.. థర్మాసెల్ ఎల్ఐవీ. స్మార్ట్‌ఫోన్ యాప్‌తో ఇది పనిచేస్తుంది. 20 అడుగుల దూరం వరకూ దోమల బెడద లేకుండా చేస్తుంది. ఎంత ప్రమాదకరమైన దోమలనైనా నాశనం చేస్తుంది. దీన్ని ఇంట్లోనే కాకుండా బాల్కనీ, గార్డెన్‌లో కూడా పెట్టుకోవచ్చు. వాటర్‌ప్రూఫ్, వెదర్‌ప్రూఫ్ కావడం కలిసొచ్చే అంశం. మార్కెట్లో దీని ధర రూ.54,000.




# ఎక్స్‌పోర్ట్ టమాట గుజ్జు!

మనదేశం నుంచి ఎగుమతి అయ్యే ఆహార పదార్థాల గురించి మనకు తెలుసు. అలాగే విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కివీ, క్యాప్సికమ్, డ్రాగన్ ఫ్రూట్ మొదలైనవీ మనకు తెలుసు. కానీ, టమాట ఉత్పత్తులు కూడా విదేశాల నుంచి వస్తున్నాయన్న విషయం మీకు తెలుసా? అది కూడా ఉడికించి తొక్క తీసిన టమాట గుజ్జు ప్యాకెట్లు యూరప్ నుంచి భారతదేశానికి చేరుతున్నాయి. దీనిని నేరుగా పప్పులోనో, రసంలోనో వాడుకోవచ్చు. సాస్, సూప్ లాంటివి కూడా చేసుకోవచ్చు. పది కిలోల టమాట గుజ్జు ధర రూ.6,257.

బ్యాటరీతో నడిచే ఐకన్ స్కూటర్ యువతను ఆకట్టుకుంటున్నది. చాలా తేలికగా ఉంటుంది కాబట్టి, సులువుగా మడత పెట్టేయవచ్చు. ఒక్కసారి చార్జ్ చేస్తే 30 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. చార్జింగ్ ఎంత ఉందన్నది డిస్‌ప్లేలో తెలుస్తుంది. ధర రూ.42,000 నుంచి ప్రారంభం.

# రేజర్ ఐకన్..









మన సంస్కృతి

# కాటికి తోడుగా.. కాటి పాపల పాట!

జానపదం.. పల్లెవాసుల జీవితాల్లో అంతర్భాగం. మనసు లోతుల్లోంచి వచ్చే స్వచ్ఛమైన భావాలకు ప్రతిరూపం. పుట్టినప్పటి నుంచీ గిట్టే వరకూ.. ప్రతి సందర్భంలోనూ ఉత్సాహపరిచే కళా సాధనం. మరణం తర్వాత కూడా కాటికి తోడుగా వచ్చేదే.. కాటి కాపరుల గానం! మృతుల గుణగణాలను కీర్తిస్తూ.. 'అంతిమ యాత్ర'కు ఉద్వేగాన్ని జోడిస్తారు కాటికాపరులు.

శైవాన్ని పాటించే బుడగ జంగాలలో బేడవర్గానికి చెందినవారు కాటి కాపలు. వీరిని 'కాటి కాపరులు' అని కూడా వ్యవహరిస్తారు. తమ కట్టడి/ మిరాశీ గ్రామాల్లో అన్ని కులాలనూ ఆశ్రయిస్తారు. మరణానికి సంబంధించిన కథలు చెబుతూ, గేయాలను ఆలపిస్తారు. కట్టడి గ్రామంలో ఎవరైనా మరణిస్తే, తక్షణం అక్కడికి చేరుకుంటారు. కర్మకాండలు పూర్తయ్యే వరకూ ఉంటారు. మృతుని జీవిత విశేషాలను పాటలుగా పాడతారు. గుణగణాలను కీర్తిస్తారు. ఇంద్రజాల విద్యలనూ ప్రదర్శిస్తారు.



### ఆకట్టుకునే ఆహార్యం

వీరి వేషధారణ గంభీరంగా ఉంటుంది. రంగుల దుస్తులు, మెడలో పెద్ద గంటలు, పూసల దండలు, చంద్రవాల గొలుసు, రుద్రాక్ష మాలలు వేసుకొంటారు. నొసట పసుపు, విభూతితో పెద్ద బొట్టు, కళ్లకు కాటుక పెట్టుకుంటారు. చేతి వేళ్లకు రకరకాల ఉంగరాలు ధరిస్తారు. బుర్ర మీసాలు పెంచుకుంటారు. శివుడు, హరిశ్చంద్రుడు, లోహితాశ్రుడు, పాము చిత్రాలున్న రేకుల కిరీటం ధరిస్తారు. ఒక చేతిలో గంట, మరో చేతిలో 'సపిర' అనే సంగీత వాద్యం పట్టుకొంటారు. ఎడమ వైపు చంకలో జోలె ఉంటుంది. అందులో గారడీకి అవసరమైన ఎముకలు, గచ్చకాయలు, రాళ్లు, చెక్క బొమ్మల్లాంటి వస్తువులు ఉంటాయి.

### ఇంద్రజాల విద్య

వీక్షకులను ఆకట్టుకునే ఇంద్రజాల నైపుణ్యం వీరి సొంతం. వీరి వద్ద గవ్వలు, పసుపు కుంకుమలతో అలంకరించిన 'అమ్మవారి బొమ్మ' ఉంటుంది. తమ చేతిలో ఉన్న ఎముకతో ఆ బొమ్మను తాకిస్తూ.. 'ఓం మహంకాళీ శాంభవీ' అంటూ క్షణంలో మండ్ర గబ్బలు, తేళ్లు, ఎలుకలనూ పుట్టిస్తారు. నోట్లోంచి ఇనుప గోళీలు, మేకులూ తీస్తారు. కనికట్టు విద్యతో ఆశ్చర్య చకితుల్ని చేస్తారు. వీరు దీపావళి తరువాత చెట్ల తీర్థం పోయి, పోచమ్మ బోనాలు చేసుకుంటారు. ఆ తరువాత తమ కుల దైవం గుస్సాయి పండుగ ముగించుకొని, తమ కట్టడి గ్రామాలకు బయల్దేరతారు. తిరిగి శ్రావణమాసంలో ఇళ్లకు వస్తారు. ఏడాదిలో రెండు నెలలు మాత్రమే ఇంటి దగ్గర ఉంటూ, మిగతా సమయమంతా సంచారంలోనే గడుపుతారు. మిరాశీ గ్రామానికి వెళ్లి, గ్రామ పెద్దలను కలుస్తారు. తమ రాక సమాచారాన్ని చెబుతారు. ఆ తర్వాత గ్రామంలో బోనుగను ఊపుకొంటూ పాటలు పాడుతూ ఇంటింటికీ తిరుగుతారు. నాలుగు బాటల కూడలిలో ఇంద్రజాలం ప్రదర్శిస్తారు. ఇందులో ఇద్దరు కళాకారులు ఉంటారు. ఒకరు ప్రధానంగా సంభాషిస్తూ విద్యలు ప్రదర్శిస్తుంటే, మరొకరు 'బోనుగ'ను ఊదుతూ వంత పాడుతుంటారు. బొమ్మలతో దండాలు పెట్టిస్తూ, అవే మాట్లాడుతున్నట్లుగా భ్రమ కలిగిస్తారు. పాములు, తేళ్లు, కప్పలను సృష్టించి ప్రేక్షకులను భయకంపితులను చేస్తారు. శివశంకరుడిని తలచుకొని నోట్లోంచి రాళ్లను, గచ్చకాయలను తీస్తారు. ఊర పిచ్చుకను సృష్టించి, అరిపించి మాయం చేస్తారు. ▪


... అరవింద్ ఆర్య
7997 270 270

## శవయాత్రలోనూ..

తమ మిరాశీ గ్రామంలో ఏ కులం వారు చనిపోయినా, అంతిమ సంస్కారాల్లో పాల్గొంటారు. ఇద్దరు లేక ముగ్గురు పురుషులు ఒక బృందంగా శవం ముందు నడుస్తూ, చనిపోయిన వ్యక్తి గుణగణాలను, గొప్పదనాన్ని రాజులతో పోలుస్తూ పాట కట్టి ఆలపిస్తారు. శివశంకరుడు, హరిశ్చంద్ర మహారాజు, పోశమ్మ తల్లి, వినాయకుడి పాటలూ పాడుతారు. ఒకరు పాడితే, మిగిలిన ఇద్దరు కర్రతో చేసిన గంటను వాయిస్తూ, 'రామ రామా' అంటూ వంత కలుపుతారు. ఇంటి నుంచి శవయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి అంతిమ సంస్కారాలు పూర్తయ్యేదాకా శవం వెంటే ఉంటారు. మారుతున్న కాలంతోపాటే కాటిపాపల కళారూపం కూడా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఏర్పడింది.



కవర్ స్టోరీ



# రామాయణ పరివారం!


రామాయణం అంటే, రాముడు నడిచిన దారి. అయోధ్య నుంచి లంకానగరం వరకూ సాగిన ప్రయాణమే శ్రీమద్రామాయణ మహాకావ్యం. ఆ విలువల యాత్రలో రాముడికి ఎంతోమంది తారసపడ్డారు. నావలో ఒడ్డు దాటించిన వారు, ఎంగిలిపండ్లతో ఆతిథ్యమిచ్చి పుణ్యఫలాలు పొందినవారు, ఎదిరించి నేలకూలినవారు, ఆదరించి అస్త్రాలను ప్రసాదించినవారు, మోహించి ముక్కుచెవులు కోయించుకున్నవారు, ప్రపత్తితో పరమదాసులైనవారు, పాదస్పర్శతో జడత్వాన్ని వీడినవారు, మోహపీడితులై రామబాణానికి గురైనవారు.. కథా గమనంలో భాగంగానూ వాల్మీకి మహర్షి ఎన్నో పాత్రలను పరిచయం చేస్తారు. ఎన్నో సంఘటలను ఉదహరిస్తారు. ఊహించని మలుపులు తిప్పతారు. కొన్ని ఘట్టాల్లో అధర్మం ఆర్భాటం చేస్తుంది. అక్కడక్కడా అసత్యం అహంకరిస్తుంది. అప్పుడప్పుడూ విలువల పతనం పతాక స్థాయికి చేరుతుంది. అంతిమంగా మాత్రం.. ధర్మం గెలుస్తుంది. న్యాయం నిలుస్తుంది.

ఇదే రామకథాసారం, రామాయణ అంతస్సూత్రం. మనో వాల్మీకం.

ఆదికావ్యమనే సరోవరంలో మనం క్షీరనీర న్యాయం తెలిసిన రాయంచలమై విహరిద్దాం.

ఆయా పాత్రలలోని మంచిని క్షీరంలా స్వీకరిద్దాం. చెడును నీరంలా విసర్జిద్దాం!

# వాల్మీకి మహర్షి



ఏ కథను వింటే హృదయం ఆనందంతో నిండిపోతుందో.. ఏ కావ్యాన్ని కంటే సత్య స్వరూపం ఆవిష్కృతమవుతుందో.. ఏ ఇతిహాసాన్ని మళ్లీ మళ్లీ మననం చేసుకుంటే ధర్మం కరతలామలకం అవుతుందో.. అలాంటి అద్భుతమైన కథకు, అలాంటి అజరామరమైన కావ్యానికి, మహోన్నతమైన ఇతిహాసానికి రూపకర్త.. వాల్మీకి మహర్షి. రామాయణ మహాకావ్యాన్ని లోకానికి అందించిన మహనీయుడు. వాల్మీకిని సంస్కృత భాషకు ఆదికవిగా గుర్తిస్తారు. వాల్మీకంలో ఇరవైనాలుగు వేల శ్లోకాలు ఏడు కాండాలుగా ఉన్నాయి. నాలుగు లక్షల ఎనభై వేల పదాలు ఉన్నాయి. ఇది మహాభారత కావ్యంలో దాదాపు పావు వంతు. ప్రసిద్ధ ఆంగ్ల రచన 'ఇలియడ్' కంటే నాలుగు రెట్లు పెద్దది. రామాయణంలోని విషయాలు కనీసం లక్ష సంవత్సరాల ప్రాచీనమైనవని ధార్మికులు విశ్వసిస్తారు.

తాను శ్రీరాముడి సమకాలీనుడినని పేర్కొన్నాడు వాల్మీకి. రామచంద్రుడు వాల్మీకిని అరణ్యవాసంలో కలిసినట్టు, సీతను వనవాసానికి పంపినప్పుడు, ఆమె మహర్షి ఆశ్రమంలోనే ఉన్నట్టు తెలుస్తున్నది. ఆ ఆశ్రమంలోనే సీతమ్మ.. లవ-కుశులకు జన్మనిచ్చినట్టు, వీరిద్దరి విద్యాభ్యాసం వాల్మీకి శిష్యరికంలోనే జరిగినట్టు రామాయణం ద్వారా తెలుస్తున్నది. 'పరివర్తనతో మనిషి మహర్షిలా మారగలడు' అనడానికి నిదర్శనం వాల్మీకి జీవితం.

**వశిష్ఠ మహర్షి:** దశరథుడి పురోహితుడు. ఇక్ష్వాకుల కులగురువు. తన చేతుల మీదుగానే పుత్రకామేష్టి నిర్వహించాడు. విశ్వామిత్రుని యాగ సంరక్షణకు రామలక్ష్మణులను పంపేలా దశరథుడిని ఒప్పించాడు.

**విశ్వామిత్ర మహర్షి:** రామలక్ష్మణుల గురువు. రాముడికి బల, అతిబల అస్త్రాలను ప్రసాదించాడు. తాటకి, మారీచ, సుబాహు వంటి రాక్షసుల సంహారానికి మార్గనిర్దేశం చేశాడు. సీతా స్వయంవరానికి తీసుకెళ్లాడు. అహల్యకు శాప విమోచనం కలిగించాడు.

# శ్రీరామచంద్రుడు



విష్ణుమూర్తి దశావతారాలలో రాముడు ఏడవ అవతారం. లంకాధిపతి రావణుడి బారినుంచి కాపాడటానికి ఎవరో వస్తారని జనం ఎదురు చూస్తున్నారు. దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసుల వల్ల మరణం లేకుండా బ్రహ్మ ఇచ్చిన వరంతో రావణుడు విర్రవీగేవాడు. దాంతో దేవతలు, మునులు విష్ణుమూర్తి చెంతకు వెళ్లి రావణాసురుని బారినుంచి ప్రపంచాన్ని రక్షించమని ప్రార్థించారు. మానవ రూపంలో జన్మించాలనీ, పిల్లల కోసం తపిస్తున్న దశరథుడి ముగ్గురు రాణుల గర్భంలో నాలుగు వేర్వేరు రూపాల్లో అవతరించాలని వేడుకున్నారు. అందుకే కౌసల్యకు రాముడిగా, కైకేయికి భరతుడిగా, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులుగా విష్ణుమూర్తి మానవ రూపంలో అవతరించాడు. అంటే.. దైవం మానుష రూపంలో జన్మించాడు.

రామాయణ మహాకావ్యంలోని ఏడు కాండాలలో రాముని జననం నుంచి.. సరయూ నదిలో రాముడు, అతని సోదరుల అవతార పరిసమాప్తి వరకూ రాముని పాత్ర ప్రయాణం ఉంటుంది. అరణ్యవాసంలో ఉన్న సీతను రావణుడు తీసుకుపోవడంతో, ఆమెను వెతుక్కుంటూ వెళ్తూ సామాన్యుడిలా అన్ని బాధల్నీ అనుభవించాడు. అంటే.. మనిషిగానే పుట్టాడు, మనిషిగానే కష్ట సుఖాలు అనుభవించాడు. ఒక అన్నగా.. తమ్ముళ్లపై అపారమైన ప్రేమను కురిపించాడు రాముడు. తల్లులు వేరైనా.. ఏనాడూ తమ్ముళ్లతో చిన్నగొడవా పడలేదు. శ్రీరాముణ్ని చూసి నేర్చుకోవాల్సిన లక్షణం.. స్థితప్రజ్ఞత. సంతోషానికి పొంగిపోకుండా, బాధకు కుంగిపోకుండా స్థిరంగా ఉన్నాడు. సాయం చిన్నదో.. పెద్దదో, చేసిన ఉపకారానికి కృతజ్ఞతా భావంతో జటాయువు పక్షికి అంత్యక్రియలు నిర్వహిస్తాడు. శత్రువు సోదరుడైన విభీషణుడు శరణు కోరి వస్తే.. ఆశ్రయం కల్పిస్తాడు. శరణు ప్రసాదిస్తాడు. బద్ధ శత్రువులైనా.. సాయం అడిగితే కాదనకూడదని ఈ సందర్భంలో ప్రకటితమవుతుంది. కాబట్టే వాల్మీకి మహర్షి శ్రీరాముడిని.. రామో లోకాభిరామః ప్రియంవదః, నిత్యం ప్రశాంతాత్మా, సానుక్రోశః అని కొనియాడాడు.

## లక్ష్మణుడు



ఆదిశేషుడి అవతారం లక్ష్మణుడు. మరో పేరు సౌమిత్రి (సుమిత్ర కొడుకు). దశరథుడి ఇంట్లో కౌసల్యకు రాముడు, సుమిత్రకు లక్ష్మణుడు జన్మించారు. బాల్యం నుంచీ రామ లక్ష్మణులు ఒకరిని విడిచి ఒకరు ఉండేవారు కాదు. రాక్షస సంహారం కోసం విశ్వామిత్రుని వెంట వెళ్లినా, సీతా స్వయం వరంలో శివధనుస్సును చేపట్టినా.. రామన్న వెన్నంటే ఉన్నాడు లక్ష్మణుడు. స్వయంవరంలో రామునికి సీతమ్మ చేతిని అందిస్తే, లక్ష్మణుడికి ఆమె చెల్లెలు ఊర్మిళను ఇచ్చి వివాహం చేశారు. అలా రామునికి లక్ష్మణుడు తమ్ముడే కాదు.. తోడల్లుడు కూడా! లక్ష్మణుడు.. రామునితో జననం, రాముడితో పాటే అరణ్యవాసం. రావణ సంహారం, వన వాసం ముగిసి రామరాజ్యం మొదలైన తరువాత కూడా, లక్ష్మణుడు రాముని సేవకుడిగానే ఉండిపోయాడు. నిరం తరం తన వెన్నంటి నిలిచి, తన ఆజ్ఞలను పాటించిన లక్ష్మణుడి రుణం ఎలాగైనా తీర్చుకోవాలని అనుకున్నాడట రాముడు. అందుకే కృష్ణావతారంలో, లక్ష్మణుడు బలరాము డిగా జన్మించాడు. లక్ష్మణుడు సోదర ప్రేమకు నిలువెత్తు నిదర్శనం, సద్గుణ సంపన్నుడు, ధైర్యశాలి.

### మాండవి-శ్రుతకీర్తి

జనకుడి తమ్ముడు కుశధ్వజుడు. ఇతనికి ముగ్గురు కూతుళ్లు. ఊర్మిళను లక్ష్మణుడికి, మాండవిని భరతుడికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నుడికి ఇచ్చి పెండ్లిచేస్తారు. వీరి పాత్రలు రేఖామాత్రమే అయినా, వ్యక్తిత్వాలు ఆదర్శవంతమైనవి.

### కబంధుడు

కబంధుడి రూపం దూరం నుంచి చూడటానికి మాంసాహారం తినే చెట్టులా భయంకరంగా ఉంటుంది. లక్ష్మణుడు ఈ రాక్షసుడి చేతిలో చిక్కుకుంటాడు. ఆ సమయంలో రాముడు కబంధుడిని సంహరిస్తాడు.

## హనుమంతుడు



భారతీయులకు హనుమంతుడు ఆరాధనీయుడు. 'అ' కార, 'ఉ' కార, 'మ' కారాల కలయికే.. 'హనుమ' అనీ, హను మనామం ప్రణవ స్వరూపమనీ పేర్కొంటారు. హనుమం తుడు సప్త చిరంజీవులలో ఒకడు, శివాంశ సంభూతుడు. ఒక రోజు సీతాదేవి సింధూరం పెట్టుకోవడం చూసిన హనుమం తుడు.. 'దాని ఉపయోగం ఏమిటి?' అని సీతాదేవిని అడుగు తాడు. అప్పుడు సీతమ్మ.. 'శ్రీరాముడి దీర్ఘాయుష్షు కోసం ఇలా చేస్తున్నాను' అని జవాబు ఇచ్చింది. ఆ క్షణంలో రామ దూత.. 'చిటికెడు సింధూరమే ఇంతచేస్తే.. ఒళ్లంతా సింధూరం పెట్టుకొంటే.. రామ ప్రభువు ఆయుష్షు ఇంకా బాగుంటుంది' అని భావించి, తన ఒళ్లంతా సింధూరాన్ని రాసుకొని, రాముడి ఆయుష్షు కోసం ప్రార్థిస్తాడు. రాముడిపైన ఉన్న భక్తిని చూసి సీతాదేవి ఒక ముత్యాలహారాన్ని హనుమంతుడికి కానుకగా ఇవ్వగా.. 'శ్రీరాముడు లేనిది ఏదీ నాకు వద్దు' అని తిరస్కరి స్తాడు. 'మరి నీ శరీరంలో శ్రీరాముడు ఉన్నాడా?' అని ప్రశ్నిం చగా.. హనుమ తన హృదయాన్ని చీల్చి, అందులో సీతారా ములను చూపిస్తాడు. తన భక్తిని చాటుకుంటాడు.

రామాయణంలో 'కిష్కింధకాండ'లో హనుమంతుడి పాత్ర ప్రవేశిస్తుంది. శ్రీరాముడి అవతార సమాప్తి వరకూ రాముడి సేవకుడిగానే హనుమంతుడు మనకు కనిపిస్తాడు. 'నీవు ఎవరివి?' అని ఎవరైనా అడిగితే, హనుమంతుడు తన గురించి తాను చెప్పుకొనే మొదటి మాట.. 'నేను కోసలేంద్రుడి దాసుడిని' అనే. ఇది హనుమంతుడి నుంచి మనం నేర్చుకోవా ల్సిన వినయగుణం. హనుమంతుడు బలానికి ప్రతీక. అష్ట సిద్ధులనూ కలిగి ఉంటాడు. అయినప్పటికీ నిజాయతీ, వినయం, విధేయతల్లో ఎలాంటి మార్పూ లేకుండా అత్యంత సాధారణంగా కనిపిస్తాడు. రాముడి సేవకుడిననే ప్రకటించు కుంటాడు. శ్రీరామునికి, సుగ్రీవునికి మధ్య సంధి కుదర్చ డంలో హనుమంతుడు ప్రత్యేక పాత్ర పోషించాడు. హనుమం తుడి చక్కటి మాటతీరు అందుకు ఉపకరించింది. అలాగే అశోకవనంలో సీతమ్మతో జాగ్రత్తగా మాట్లాడాడు. ఇలాంటి మాటతీరును ఈ రోజుల్లో మనం అలవర్చుకుంటే.. మానవ సంబంధాలు మరింత మెరుగవుతాయి.


## శబరి



రామాయణంలో శ్రీరాముడి భక్తురాలు శబరి. రాముని దర్శనం కోసం జీవితాంతం భక్తితో వేచి ఉండి, చివరికి రామ దర్శనం పొందిన ధన్యజీవి. శబరి ఒక గిరిజన మహిళ. తన గురువులకు సేవ చేసుకుంటూ ఆశ్రమంలో ఉండేది. ఈమెను 'శ్రమణీం ధర్మ నిపుణాం' అని వర్ణిస్తాడు వాల్మీకి. 'శ్రమణి' అంటే సన్యాస జీవితంలో ఉన్న స్త్రీ. ధర్మం విషయంలో కూడా ఆమెకు సంపూర్ణమైన అవగాహన ఉంది. శబరి.. మాతంగాశ్రమాన్ని చిమ్మి అలుకు చల్లడంలోనే, ఆమె కోరికలు గుండెల్లో చల్లబడ్డాయి. అక్కడ ముగ్గులు పెట్టడంలోనే ఆమె తల ముగ్గుబుట్టలా మారిపోయింది. పూజకు పూలు సేకరించడంలోనే ఆమె కనుచూపు సన్నగిల్లింది. ఆహారానికి పండ్లు ఏరడంలోనే, ఆమె నోటిపండ్లన్నీ రాలిపోయాయి. మడి బట్టలు పిండటంలోనే శరీరమంతా ముడుతలు పడిపోయింది.

ఏదైనా పదార్థం తినేముందు దేవుడికి పెడతారు. ఆ తర్వాతే ఆరగిస్తారు. ఇదొక ఆచారం. దేవుడికి అర్పించాక తింటేనే అది ప్రసాదం అవుతుంది. అందుకనే పిల్లలు తెలియక ఎక్కడ తింటారోనని ఎంగిలి చెయ్యొద్దని అంటారు. అయితే, దేవుడైన రాముడు ఒకే ఒక్కరి ఎంగిలి తిన్నాడు. అది శబరి ఎంగిలి! తన చూపు మందగించడం వల్ల పళ్లను చూసి, అందులో మంచివి, పండినవి, పండనివి అని వేరుచేయడం ఆమెకు సాధ్యపడదు. అందువల్ల రాముడు వచ్చినప్పుడు.. తాను కాస్త రుచి చూసి, మంచిమంచి పళ్లను రాముడు, లక్ష్మణుడికి అందిస్తుంది. రామాయణంలో వాల్మీకి శబరిని ఒక రేఖాచిత్రంగా మాత్రమే చూపించాడు. అయినా, పాఠకులు ఆ పాత్ర దగ్గర ఆగి ఆలోచిస్తే చాలు.. అనిర్వచనీయమైన అనుభూతి ఏదో వారి హృదయాన్ని అలముకొంటుంది.

## సీతాదేవి



మహావిష్ణువు భార్య లక్ష్మీదేవి. లోక కల్యాణం కోసం స్వామి వారు భూమిపై రకరకాల అవతారాలను ఎత్తారు. అయ్యవారితోపాటు అమ్మవారు కూడా. రామాయణంలో సీతగా, మహాభారతంలో రుక్మిణిగా, కలియుగంలో పద్మావతిగా వివిధ అవతరాలను ఎత్తింది. సీతమ్మను.. జానకి, మైథిలి, వైదేహి, రమ అనే పేర్లతోనూ పిలుస్తారు. మిథిలాపుర నాయకుడైన జనక మహారాజు యాగం కోసం భూమిని దున్నుతుండగా నాగలికి ఒక పెట్టె అడ్డుపడింది. తెరిచి చూడగా అందులో ఒక పసిపాప. నాగటిచాలులో లభించినందుకు ఆమెకు 'సీత' అని నామకరణం చేశాడు జనక మహారాజు (నాగటిచాలును 'సీత' అని పిలుస్తారు). తల్లి గర్భం నుంచి జన్మించలేదు కాబట్టి 'అయోనిజ' అయ్యింది. సీతమ్మకు ఆధ్యాత్మిక తల్లి భూదేవి కాగా.. జనకుడు, అతని భార్య సునయన దత్తత స్వీకరించి, పెంచి పోషించిన తల్లిదండ్రులు.

జనకుడికి నాగటిచాలులో సీత దొరకడం (జననం).. స్వయంవరంలో శ్రీరాముడితో వివాహం.. రాముడితో కలిసి అరణ్య వాసానికి వెళ్లడం.. అక్కడ రావణుడు ఆమెను అపహరించడం.. రామరావణ యుద్ధం.. సీత అగ్ని ప్రవేశం.. అయోధ్యలో నివాసం.. మళ్లీ వనవాసం.. లవకుశులకు జన్మనివ్వడం.. తిరిగి భూమిలో అంతర్ధానం కావడం.. ఇలా రామాయణంలోని ప్రతి మలుపులో సీత పాత్ర మహోన్నతమైంది. క్షమ, దయ, ధైర్యం, వివేకం, ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన వ్యక్తిత్వం ఆమెది. సీత పతిప్రేమనే పరమార్థంగా భావించింది. ఆయన సాహచర్యం కోసం అనేక కష్టాలు అనుభవించింది. సహధర్మచారిణిగా అన్ని సందర్భాల్లోనూ భర్తతో సహకరించింది. ఆయన ప్రభుధర్మ పాలన కోసం అగ్నిప్రవేశం చేసింది. సీత జీవితం.. ఆదర్శమయం.

**వాలి:** సుగ్రీవునితోపాటు పరిచయం అవుతాడు. సుగ్రీవునితో యుద్ధంలో.. రామబాణానికి కూలిపోతాడు.

**నలుడు-నీలుడు:** నలుడు విశ్వకర్మ కుమారుడు. రామసేతువును నిర్మించాడు. నీలుడు అగ్ని కుమారుడు. వానర సైన్యానికి నాయకుడు. రామరావణ యుద్ధంలో ఇద్దరిదీ కీలక పాత్రే.

## గుహుడు



రామాయణంలో గుహుడు ఒక నిషాద రాజు. శ్రీరాముడి భక్తుడు. గుహుని పరిచయం అయోధ్యకాండ 50వ సర్గతో మొదలవుతుంది. సీతారామ లక్ష్మణుల రాక.. వారికి ఆతిథ్యం ఇవ్వడం.. పడవలో గంగా నదిని దాటించడం.. రాముణ్ని తిరిగి తీసుకెళ్లేందుకు భరతుడు రావడం.. అతనికి ఆతిథ్యం ఇవ్వడం.. అతణ్ని సైన్యంతో సహా వివిధ పడవల్లో గంగానదిని దాటించడం.. చివరగా, గుహుడి ప్రస్తావన రావణ వధానంతరం యుద్ధకాండ చివర్లో 128వ సర్గలో కనిపిస్తుంది. తన క్షేమ సమాచారాన్ని గుహుడికి తెలుపమని శ్రీరాముడు హనుమంతుడికి చెబుతాడు. ఆర్ద్రతతో ఇచ్చే ఆతిథ్యం, భక్తి భావంతో చేసే ఉపకారం.. ఎవరి హృదయాన్ని అయినా ఆకర్షిస్తాయి. అందులోనూ మహాత్ముల హృదయాల్ని మరీ వశం చేసుకొంటాయి. రాముడు తన జీవితంలో గుహుని ఆతిథ్యాన్ని మరువలేదు. అందుకే అయోధ్యకు ఆయన తిరిగి వెళ్తున్నప్పుడు, భరద్వాజ ఆశ్రమం నుంచి హనుమంతుని పంపాడు. గుహునికి తన క్షేమసమాచారం చెప్పించాడు. అతడు తన ఆత్మసఖుడని చెప్పుకొన్నాడు. గుహుడు ఆటవికుడే కావచ్చు. అయినా అతనికి మంచి హృదయం ఉంది. జీవితంలో కొన్ని విలువలున్నాయి. అన్నిటికీ మించి ఆతిథ్యానికీ, ఉపకారానికీ ఉండవలసిన ఉత్తమ మనస్తత్వం ఉంది. అందుచేతనే.. అతనికి రాముడి హృదయంలో స్థానం దొరికింది.

## శూర్పణఖ



శ్రీరాముడి కీర్తిప్రతిష్ఠలు ఇనుమడించేలా, రామావతార లక్ష్యాన్ని సాధించడంలో రామాయణంలో మూడు స్త్రీ పాత్రలు ప్రేరణగా నిలిచాయి. వారిలో ప్రథమ స్థానం కైకేయిది. ఆమెను ప్రేరేపించిన మంథరది ద్వితీయ స్థానం. ఇక మూడో వ్యక్తి శూర్పణఖ. ఈమె రావణాసురుడి చెల్లెలు. కేకసి, విశ్రావసు కుమార్తె. రావణ, కుంభకర్ణ, విభీషణ, ఖర, దూషణులకు సోదరి. మారీచుడు, సుబాహులకు మేనకోడలు. అంటే.. తాటకి ఈమెకు అమ్మమ్మ. విద్యుజ్జిహ్వుడనే రాక్షసుడు ఈమెను వివాహం చేసుకున్నాడు. ఇతను కాలకేయ వంశానికి చెందినవాడు. రావణాసురుడు లోకాలన్నిటినీ జయించే ఉత్సాహంలో ఒకసారి కాలకేయులతో పోరాడుతూ, పొరపాటున విద్యుజ్జిహ్వుడినీ వధించాడు. అంటే.. శూర్పణఖ వైధవ్యానికి అన్న రావణుడే కారణమయ్యాడు. భర్త మరణంతో దుఃఖితురాలైన శూర్పణఖను రావణుడు 'తెలియక తప్పు జరిగిపోయింది' అని చెప్పి ఓదార్చాడు. మనసు కుదుటపడటానికి ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు అనే అనుచరులను తోడిచ్చి దండకారణ్యంలో విహరించమని పంపించాడు. అప్పటినుంచి ఒంటరైన ఆమె.. లంకకు, దండకారణ్యానికి మధ్య తిరుగుతూ కాలం వెళ్లదీసేది. రామాయణం అరణ్యకాండలో శూర్పణఖ పాత్ర కనిపిస్తుంది. అనంతరం వాల్మీకి రామాయణంలో ఈవిడ ప్రస్తావన లేదు. కానీ, వివిధ వ్యాఖ్యానాలలో రావణుడి అనంతరం విభీషణుడి రాజ్యంలో కొంతకాలం నివసించి, ఆ తర్వాత మరణించిందని పేర్కొన్నారు. సంయమనం పాటించకపోతే, ఎంతటివారైనా పతనం కాక తప్పదని శూర్పణఖ పాత్ర ద్వారా మరోసారి స్పష్టం అవుతుంది.

## జటాయువు



స్వామికార్యం అనేసరికి ప్రతిప్రాణీ తన శక్తి మేర కృషి చేసిన గాథలను అద్భుతంగా వర్ణించింది మహాకావ్యం. ఉడుత.. వారధి కోసం, సంపాతి.. లంకకు మార్గం కోసం, అతని సోదరుడు జటాయువు.. సీతమ్మ ఆనవాలు కోసం, వానరసైన్యం.. రావణుని వధించి ధర్మస్థాపన కోసం.. ఇలా చెప్పుకొంటూ పోతే, ఎన్నో జీవరాశులు శ్రీరాముడికి తోడ్పాటుగా నిలిచాయి. అందులో ఒక ఉదాత్తమైన ప్రాణి.. జటాయువు. ఈ జటాయువు అరణ్యకాండలో వచ్చే ఒక పాత్ర (గద్ద). ఇతను అనూరుడు (సూర్యభగవానుడి రథసారథి), శ్యేని కుమారుడు. సంపాతి ఇతని సోదరుడు. దశరథుడి స్నేహితుడు. రావణుడు సీతను అపహరించడానికంటే ముందే, సీతారామ లక్ష్మణులను జటాయువు కలుసుకొంటాడు. తనను తాను పరిచయం చేసుకొని, రామలక్ష్మణులు ఏదైనా పనిమీద బయటికి వెళ్లినప్పుడు, తాను సీతమ్మకు రక్షణగా ఉంటానని చెబుతాడు. రావణుడు సీతమ్మను అపహరించుకొని వెళ్తున్నప్పుడు నిలువరించడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు. రావణుడితో యుద్ధం చేసి తీవ్రంగా గాయపడుతాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ రాముడు వచ్చాక, జరిగిన విషయం తెలిపి మరణిస్తాడు. జటాయువుకు రాముడే స్వయంగా అంత్యక్రియలు జరిపిస్తాడు. జటాయువు పాత్ర అచ్చపు మైత్రికి ఆదర్శంగా నిలుస్తుంది.

## రావణాసురుడు



బ్రహ్మ మానసపుత్రుడైన పులస్త్యుని కుమారుడు విశ్రావసు బ్రహ్మ (బ్రాహ్మణుడు), దైత్య రాకుమారి కైకసి (రాక్షస స్త్రీ) కుమారుడే రావణాసురుడు. రావణాసురుడి తండ్రి వైపు నుంచి తాత పులస్త్యుడు. ఇతని తండ్రి బ్రహ్మ. రావణాసురుని తల్లి వైపు నుంచి.. తాత మల్యావుడు, అమ్మమ్మ తాటకి. మామ మారీచుడు. రావణాసురుడికి ఆరుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. భార్య మండోదరి. వీరికి ఏడుగురు కొడుకులు. దశకంఠుడు (పదిమంది జ్ఞానులతో సమానమైన జ్ఞానం కలవాడు), దశముఖుడు, దశగ్రీవుడు ఇతని ఇతర పేర్లు. రావణాసురుడు కైలాస పర్వతాన్ని తన రెండు చేతులతో పెకిలిస్తున్నప్పుడు పరమశివుడు అతని చేతివేళ్లను కాలితో తొక్కుతాడు. అప్పుడు దశకంఠుడు బిగ్గరగా అరవడంతో ఇతనికి రావణుడు (అరుపు = రావణ) అనే పేరు వచ్చింది. రావణుడు పుట్టినప్పుడు రక్తం వర్షంగా కురిసిందట. గద్దలు అరిచాయట. దేవతలు కూడా భయపడ్డారట. రావణుని జన్మ శాప కారణంగా జరిగిందనీ, హిరణ్యకశిపుని వధించడంతో.. 'కపటంతో స్తంభం నుంచి వచ్చి ఇరవై గోళ్లతో నన్ను చంపితివి, ఇదా పౌరుషం?' అని ఆక్షేపించాడట. దాంతో విష్ణుమూర్తి.. 'మరో జన్మలో నీకు ఇరవై బాహువులు, పది శిరస్సులను ఇచ్చి, నేను సామాన్యుడినై సంహరిస్తాను' అన్నాడట.


రామాయణంలో అరణ్యకాండ, సుందరకాండ, యుద్ధకాండలలో రావణాసురుడి పాత్ర కనిపిస్తుంది. అరణ్యకాండలో.. వాసుకి పాలిస్తున్న పాతాళలోకానికి వెళ్లి తక్షకుని భార్యను అపహరించి తన భార్యగా చేసుకొంటాడు. కైలాసపర్వతం వైపు వెళ్లి తన సోదరుడైన కుబేరుడిని యుద్ధంలో జయించి పుష్పక విమానాన్ని కాంచన లంకకు తెచ్చుకొంటాడు. స్వర్గానికి వెళ్లి నందన వనాన్ని ధ్వంసం చేస్తాడు. సూర్యచంద్రులను రెండు చేతులతో గట్టిగా పట్టుకొని వారి గమనాన్ని నిరోధిస్తాడు. పూర్తి కావస్తున్న యజ్ఞయాగాదులను ధ్వంసం చేయడమంటే రావణుడికి అత్యంత ప్రీతి. యజ్ఞాలలో ఇచ్చే సోమరసాన్ని ఇంద్రుడు సంగ్రహించకుండా తానే స్వీకరించి, యజ్ఞఫలాన్ని నాశనం చేస్తాడు. సీతను అపహరిస్తాడు. సుందరకాండలో.. అశోకవనంలో సీతను ఉంచుతాడు. యుద్ధకాండలో.. రాముడి చేతిలో రావణాసురుడు మరణిస్తాడు.

రావణుడు... వేదవేదాంగాలను ఆపోశన పట్టిన మహాపండితుడు. నిత్య పూజా దురంధరుడు. తపస్వి, గొప్ప రాజనీతిజ్ఞుడు. సంగీత సాహిత్యాలలోనూ ప్రతిభావంతుడు.. ఇన్ని సుగుణాలు ఉన్నప్పటికీ, అతని పతనానికి ప్రధాన కారణం మాత్రం.. 'పరస్త్రీ వ్యామోహం'. పాలకుండలో విషపు చుక్కలా, ఒక్క దుర్గుణం వేయి సుగుణాలను కప్పేస్తుంది. ఏ దేశమైనా, ఏ కాలమైనా ఈ సందేశం అందరికీ వర్తిస్తుంది.

## మేఘనాదుడు

రావణాసురుడు-మండోదరి దంపతుల పెద్ద కొడుకు. జన్మించినప్పుడు అరిచిన అరుపు, మేఘం ఉరిమిన పిడుగు శబ్దంలా ఉండటం వల్ల 'మేఘనాదుడు' అని నామకరణం చేశారు. స్వర్గానికి వెళ్లి ఇంద్రుడిని జయించినందున 'ఇంద్రజిత్తు' అయ్యాడు. ఈ సందర్భంగా బ్రహ్మ అనుగ్రహం పొంది బ్రహ్మాస్త్రాన్ని సంపాదించాడు. యుద్ధ సమయంలో ఆకాశంలోకి వెళ్లి మేఘాలలో యుద్ధాలు చెయ్యగలగడం ఇంద్రజిత్తు నైపుణ్యం. ఆదిశేషుని కుమార్తె సులోచన (ప్రమీల– నాగకన్య)ను వివాహం చేసుకొన్నాడు.

ఇంద్రజిత్తు జన్మించే సమయంలో రావణుడు తన ఆదేశంతో, అన్ని గ్రహాలను ఉత్తమమైన స్థానాలలో ఉంచాడు. అలా.. ఉండీ ఉండీ సరిగ్గా ఇంద్రజిత్తు జన్మించే సమయంలో.. శని తన రెండు కాళ్లనూ ముందు స్థానంలోకి చాపాడు. దాంతో ఇంద్రజిత్తు జన్మించిన సమయంలో శని స్థానం దోష భూయిష్ఠంగా మారింది. దీంతో ఆగ్రహించిన రావణుడు, అప్పటికప్పుడు శని రెండు కాళ్లనూ నరికివేస్తాడు. ఎంతో ప్రతిభావంతుడైన ఇంద్రజిత్తు, శని స్థానం దోషం కావడంతోపాటు అధర్మాన్ని ఆశ్రయించడం వల్ల యుద్ధంలో అకాల మరణం పొందాడు. పలు గ్రంథాలలో పేర్కొన్న ఏడు యజ్ఞయాగాదులను చేసిన ఏకైక యోధుడు.. ఇంద్రజిత్తు. అవి అగ్నిష్టోమ, అశ్వమేధ, బహుసువర్ణక, గోమేధ, రాజసూయ, వైష్ణవ, మహేశ్వర. ఇంద్రజిత్తు అత్యంత శక్తిమంతమైన వైష్ణవాస్త్రం, బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రాలను కలిగి ఉండే మహాయోధుడు. రామరావణ యుద్ధంలో పాల్గొన్న వానరుల్లో సగం వానరులను ఒక్కరోజులోనే సంహరించాడు. ఇంద్రజిత్తు 'అతి మహారథి'. అంటే.. ఎనభై ఆరు లక్షల నలభైవేల మందితో ఒకేసారి యుద్ధం చేయగలడు. 14 సంవత్సరాలు నిద్రలేని వ్యక్తి ద్వారా మాత్రమే తన మరణమనీ, పైగా ఆ 14 సంవత్సరాలు ఆ వ్యక్తి బ్రహ్మచారి జీవితం జీవించాలనీ ఇంద్రజిత్తు వరాన్ని పొందాడు. అలా 14 సంవత్సరాలు బ్రహ్మచర్యం పాటిస్తూ, నిద్రపోకుండా సీతారాముల సేవలో ఉన్న లక్ష్మణుడి చేతులో ఇంద్రజిత్తు మరణించాడు. రావణాసురుడి పెద్దకుమారుడిగా జననం, ఇంద్రుడితో యుద్ధం, బ్రహ్మ నుంచి, శివుడి నుంచి వివిధ అస్త్రాలు, వరాలు పొందడం.. రామరావణ యుద్ధంలో కీలక పాత్ర పోషించి, చివరికి లక్ష్మణుడి చేతిలో మరణించటంతో ఇంద్రజిత్తు పాత్ర ముగుస్తుంది. మహా పరాక్రమ సంపన్నుడైన ఇంద్రజిత్తు తన శక్తియుక్తుల్ని ధర్మం కోసం కాకుండా, అధర్మం కోసం ఉపయోగించాడు. చివరికి ఇలా మరణించాడు.




## లవుడు-కుశుడు



శ్రీరాముడు, సీతకు కలిగిన కవల పిల్లల్లో లవుడు మొదటి వాడు. అతని సోదరుడు కుశుడు. లవుడు తల్లిలా గోధుమ వర్ణంలో ఉంటే, కుశుడు తండ్రిలా శ్యామ వర్ణంలో ఉంటాడు. లవుడు తన పేరుతో 'లవపురి' నగరాన్ని స్థాపించినట్లు చెబుతారు. అదే ప్రస్తుత లాహోర్ నగరం. వాల్మీకి మహర్షి ఆశ్రమంలో జననం, వారి శిష్యరికంలో పలు విద్యలలో శిక్షణ పొందడం, రామకథను గానం చేయడం, సీత భూ గర్భ ప్రవేశ సమయంలో రాముడికి లవకుశులు తన పిల్లలే అని తెలవడం, రాముడి అనంతరం రాజ్య పాలన చేయడం.. ఈ విధంగా రామాయణంలో వీరి పాత్ర ఉంటుంది. రామరాజ్యంలో వచ్చిన అపవాదు కారణంగా, అయోధ్య రాజ్యం నుంచి సీతను రాముడు బహిష్కరిస్తాడు. తామసా నది ఒడ్డున ఉన్న వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఆమె ఆశ్రయం పొందుతుంది. అక్కడే లవుడు, కుశుడు జన్మిస్తారు. వారికి వాల్మీకి మహర్షి విలువిద్య, సైనిక నైపుణ్యాలపై శిక్షణనిస్తాడు. రామకథను కూడా నేర్పిస్తాడు. రాముడి అనంతరం లవుడు, కుశుడు రాజ్యాన్ని పరిపాలిస్తారు. వారు లవపురి, కసూర్ నగరాలను స్థాపిస్తారు. రఘురాముడు అతని కుమారులైన లవుడినీ, కుశుడినీ శ్రావస్తి, కుశావతి రాజ్యాలకు రాజులుగా చేస్తాడు.

మహారాజు బిడ్డలే అయినప్పటికీ లవకుశులు, వాల్మీకి ఆశ్రమంలో సామాన్యులుగా ఉండి, గురువుకు సేవలు చేస్తూ విద్యలను అభ్యసించారు. వీరు రామకథను గానం చేసే సమయంలో శ్రీరాముడు తమ తండ్రి అని వారికి తెలియదు. ఘనమైన వంశ చరిత్ర ఉన్నప్పటికీ అణకువ, వివేకం, పెద్దలపట్ల గౌరవభావం లాంటి ఎన్నో మంచి విలువలను కలిగి ఉన్నారు.


## మయుడు



మయుడు రాక్షసుల రాజు. ఇతనికి మయాసురుడు అని కూడా పేరు. లంకాధిపతి అయిన రావణుని భార్య మండోదరి.. మయుని కుమార్తె. అంటే, మయుడు రావణబ్రహ్మకు మామ అవుతాడు. మయుడు ఇంద్రునికి అమరావతి పట్టణాన్ని, కుబేరునికి అలకాపురిని నిర్మించి ఇచ్చాడు. మయుడి తండ్రి కశ్యపుడు (పరశురాముడు ఇతనికి భూమినంతా దానం చేస్తాడు. ఇతనికి అరిష్టనేమి అనే పేరు కూడా ఉంది), తల్లి పేరు దను/దితి. మయుడి భార్య హేమ. వీరి పిల్లలు.. మాయావి, దుందుభి, మండోదరి.

భారతీయ శాస్త్రాలలో వాస్తు ప్రాచీనమైనది, ప్రసిద్ధమైనది కూడా. ఈ శాస్త్రానికి కర్తలుగా పేర్కొన్న వారిలో విశ్వకర్మ, మయుడు ముఖ్యమైన వారు. వీరేకాకుండా బృహస్పతి, శుక్రుడు, వశిష్ఠుడు, నగ్నజిత్తు, గర్గుడు మొదలైన శాస్త్రకర్తలు పలువురు ఉన్నారు. భారతీయ విగ్రహ శిల్పానికి, దేవాలయ శిల్పానికి ఆద్యుడు మయుడు. శిల్పాకృతులలో అద్భుతమైనదిగా చెప్పబడే నటరాజ విగ్రహ శిల్పం మయుడు సృష్టించినదే. రామాయణంలో మండోదరి తండ్రిగా మయుడు కనిపిస్తాడు. ఇతను మయరాష్ట్ర అనే పట్టణాన్ని నిర్మించి, తన రాజధానిగా చేసుకొన్నాడు. మయరాష్ట్రనే ఇప్పుడు మీరట్ అని పిలుస్తారు. స్వర్ణ నగరం/ లంకాపురి/ స్వర్ణ లంకను నిర్మించింది కూడా మయుడే. మహాభారతంలో ధర్మరాజుకు ఇంద్రప్రస్థంలో ఒక అద్భుతమైన భవనాన్ని నిర్మించి ఇచ్చాడు. అదే మయసభగా పేరొందింది.

## భూదేవి



భూదేవిని 'భూమాత' అని కూడా అంటారు. భువనేశ్వరి, అవని, పృథ్వీ, వారాహి, ధరిత్రి, ధాత్రి, ధరణి, వసుధ, వసుంధర, వైష్ణవి, కశ్యపి, ఉర్వి, ఇరా, మహి, వసుమతి, హేమ వంటి వివిధ పేర్లతోనూ పిలుస్తారు. భూదేవి సీత తల్లి. బ్రహ్మ పురాణం, విష్ణు పురాణం వంటి గ్రంథాల ప్రకారం నరకాసురుడు భూదేవి కొడుకు. నవగ్రహాలలో ఒకడైన అంగారకుడు కూడా భూదేవి కొడుకే. ఈమె సీతకు తల్లి మాత్రమే కాకుండా.. విష్ణువు అవతారమైన వరాహస్వామి భార్య, లక్ష్మీదేవికి మరో రూపంగానూ భావిస్తారు. అదేవిధంగా శ్రీరంగనాథుని భార్య ఆండాళ్ భూదేవి అవతారమని విశ్వసిస్తారు. యజ్ఞం కోసం జనకుడు నేలను దున్నుతుండగా, నాగటిచాలులో సీత దొరికింది. చివరికి రామచంద్రుడికి లవకుశులను అప్పగించి సీత, భూమాతలో ఐక్యం అవుతుంది. ఈ రెండు సందర్భాలలోనూ భూదేవి మనకు రామాయణంలో కనిపిస్తుంది. సీతాదేవి జనన మరణాలు.. మనిషి తల్లి గర్భంలో జన్మించి, మరణించిన తర్వాత భూగర్భంలో కలిసిపోవడం అనేదానికి ప్రతీకగా కనిపిస్తాయి.

## శ్రవణ కుమారుడు



తల్లిదండ్రుల పట్ల ఎంతటి అంకితభావాన్ని కలిగి ఉండాలో చెప్పే మహోన్నత వ్యక్తిత్వం గల పాత్ర శ్రవణ కుమారుడు. ఇతని తండ్రి శంతనవుడు, తల్లి జ్ఞానవతి. 'వినికిడి' అంటే.. శ్రవణ ప్రధానమైన అస్త్రవిద్యతో అనగా 'శబ్దభేది'తో కొట్టబడిన మునికుమారుని కరుణామయ గాథ శ్రవణమై.. ముని కుమారుని పేరు శ్రవణుడుగా, శ్రావణుడుగా మారిందని భావించవచ్చు. ఏదేమైనా శ్రవణుని చరిత్ర, తల్లిదండ్రుల పట్ల భక్తికి ప్రతీకగా లోకంలో నిలిచిపోయింది. తల్లిదండ్రుల సేవలో తరించిన ఉత్తములైన కుమారులు భారతీయ సాహిత్యంలో చాలా మంది కనిపిస్తారు. వృద్ధులైన తల్లిదండ్రులను కావడిలో కూర్చోబెట్టి, స్వయంగా మోస్తూ తీర్థయాత్రలకు తిప్పిన శ్రవణ కుమారుడి కథను రామాయణం వివరించింది. తండ్రి ఆనతి మేరకు రాజ్యాధికారాన్ని వదులుకొని శ్రీరాముడు అడవుల బాటపట్టిన విషయమూ వర్ణించి చెప్పింది. తల్లి దాస్య విముక్తికోసం బ్రహ్మ ప్రయత్నం చేసి, దేవతలను ఓడించి, అమృతాన్ని సాధించిన గరుత్మంతుడి కథను భాగవతం ప్రకటించింది. యయాతికి తన యవ్వనాన్ని సమర్పించిన కొడుకు పూరుడి కథనూ చెప్పింది. 'తల్లిదండ్రుల సేవ మినహా నాకు తెలిసినదేదీ లేదు' అని వినయంగా పలికిన ధర్మవ్యాధుడి కథను భారతం పరిచయం చేసింది. తండ్రి నిమిత్తమై భీషణమైన ప్రతిజ్ఞ చేసి, అపూర్వ త్యాగానికి పాల్పడిన భీష్ముడి కథనూ చిత్రించింది. తల్లి దైన్యస్థితికి తల్లడిల్లి సమస్త రాజవంశ నాశనానికి పూనుకున్న పరశురాముడు, తల్లి కోరిందని ఆత్మలింగం సాధించడానికై పడరాని పాట్లుపడిన రావణాసురుడు, క్షణమాత్రం ఏమరుపాటు లేకుండా తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాచుకున్న ప్రవరాఖ్యుడు, సన్యాసదీక్షలో ఉన్నా తల్లికి ఇచ్చిన మాటకోసం స్వయంగా అమ్మ ఆర్యాంబకు అంత్యక్రియలు నిర్వహించిన ఆదిశంకరులు.. ఇలా జన్మనిచ్చిన వారికోసం పరితపించిన కుమారుల గాథలు సాహిత్యంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. చరిత్రలోనూ ఆ తరహా ఆదర్శమూర్తుల ఉదంతాలకు కొదవలేదు.

వాల్మీకి రామాయణంలో శ్రీరాముడి జననానికి ముందే దశరథుని జీవితంలో సంభవించిన విచిత్ర విషాద సంఘటన శ్రవణ కుమారుని వృత్తాంతం. రాముడు వనవాసానికి వెళ్లిన తర్వాత దశరథుడే ఈ వృత్తాంతాన్ని కౌసల్యకు చెప్పుకొంటాడు. రామాయణంలో నామమాత్రంగా కనిపించిన శ్రవణ కుమారుని వృత్తాంతం అనంతర కాలంలో చిగురులు తొడిగి అద్భుతమైన ఇతివృత్తమై, ఎందరో మహాపురుషులకు ఆదర్శప్రాయమైంది.

## ప్రహస్తుడు




శక్తిమంతుడైన రాక్షస యోధుడు ప్రహస్తుడు.. రావణుని సేనాధిపతి. తరువాత మహాభారతంలో పురోచనుడిగా దుర్యోధనుని నమ్మకమైన సహాయకుడిగా, లాక్షా గృహ సంఘటనకు కారణమైనవాడిగా పునర్జన్మ పొందాడు. ప్రహస్తుడు నీలుడి చేతిలో మరణిస్తాడు. కొన్ని గ్రంథాలలో లక్ష్మణుడి చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడని ఉన్నది. రావణుడి ఏడుగురు కొడుకులలో ప్రహస్తుడు ఒకడు.

లంకానగరపు నాలుగు ప్రముఖ ద్వారాలు, నలుగురి అధీనంలో ఉంటాయి. తూర్పు ద్వారం ప్రహస్తుడి ఆధీనంలో, దక్షిణ ద్వారం మహోదరుడు, మహాపార్శ్వుని అధీనంలో, పడమర ద్వారం ఇంద్రజిత్తు అధీనంలో, ఉత్తర ద్వారం రావణుడి అధీనంలో ఉంటాయి.

రామాయణంలో ప్రహస్తుడి పాత్ర యుద్ధకాండలో వస్తుంది. ఎంతోమంది వానరులను సంహరించాక, ప్రహస్తుడు నీలుడి చేతిలో మరణిస్తాడు. అకంపనుడు కూడా మరణించాడని తెలిసిన రావణుడు, ప్రహస్తుని పిలిచి.. 'యుద్ధానికి ముందుకు వెళదామా వద్దా!' అని అడుగుతాడు. దానికి ప్రహస్తుడు.. 'అప్పుడే సీతను రాముడికి అప్పగించమని చెప్పినప్పుడు మీరు కుదరదని చెప్పారు. ఇక యుద్ధమే జరుగుతున్నప్పుడు వెనకడుగు ఎందుకు? మీకోసం నా ప్రాణాలైనా ఇస్తాను' అని యుద్ధానికి బయల్దేరతాడు.

ధర్మాన్ని ఆశ్రయించాలి, ధర్మాన్ని ఆచరించాలి. సీతమ్మను అప్పగించాలని ప్రహస్తుడు రావణుడితో ధర్మం చెప్పినా, దానిని ఆచరించడంలో విఫలమయ్యాడు. రోగానికి మందు తెలిసినప్పటికీ, దానిని వాడకపోతే ప్రయోజనం ఏమీ లేనట్లుగానే.. ధర్మ విచక్షణ ఉన్నా దానిని ఆచరించకపోతే ప్రయోజనం ఏమీ లభించదు.


**.. వీళ్లే కాదు, పది దిక్కులకూ రథాన్ని నడిపిన దశరథుడు.. ఆయన సతీమణులు కౌసల్య, సుమిత్ర, కైకేయి.. అన్నచాటు తమ్ముళ్లు భరత శత్రుఘ్నులు, బ్రహ్మ మాన సపుత్రిక అహల్య.. దుర్బుద్ధి మంథర.. పంచకన్యలలో ఒకరైన తార.. రావణుడి ధర్మపత్ని మండోదరి.. మాయల మారీచుడు.. సప్త చిరంజీవులలో ఒకడైన విభీషణుడు.. వివేకి జాంబవంతుడు.. ఎలా బతకాలో చెప్పేవి కొన్ని, ఎలా మసలుకోవాలో నేర్పించేవి కొన్ని, సామెతలుగా మారినవి కొన్ని, సత్యధర్మాలకు ఉదాహరణలుగా నిలిచినవి కొన్ని.. రామాయణంలోని ప్రతిపాత్రా అక్షయపాత్రే! కాబట్టే, రామకథ విలువల రాచబాటగా మారింది. రాముడు అందరివాడు అయ్యాడు!**




**ఆధారం:** రామాయణ పరివారం
**రచన:** బుర్రా వెంకటేశం ఐ.ఏ.ఎస్
**పేజీలు:** 162, వెల: రూ.250
**ప్రతులకు:** విశ్వ సాహితి ట్రస్ట్,
**ఫోన్:** 9963 539 139


# అక్షర సృష్టికర్తలు!

ఆ ఇద్దరూ అక్షర ప్రేమికులు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఉపయోగిస్తున్న అనేక 'కంప్యూటర్ ఫాంట్స్'కు సృష్టికర్తలు. నిరంతరం అక్షరమాల మధ్యే సేదతీరుతారు. వాటికి సొబగులద్ది.. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తారు. కంప్యూటరీకరించి అందరికీ అందుబాటులోకి తెస్తారు. వారే.. తమిరి రమణ, జి.పురుషోత్త్ కుమార్. అను నుంచి అపూర్వ వరకు అనేక కొత్త ఫాంట్స్‌ను వాడుకలోకి తీసుకొచ్చిన ఆ ఇద్దరు మిత్రుల ప్రయాణం వారి మాటల్లోనే..







## గోడపై పోస్టర్లుచూసి!

**నాకు** జన్మనిచ్చింది ఆంధ్ర. ఊపిరిపోసింది తమిళనాడు. నీడనిచ్చింది తెలంగాణ. మాది పశ్చిమగోదారి జిల్లా ఆచంట. బాల్యం నుంచే గోడలపై, పోస్టర్లపై కనిపించే అక్షరాల శైలిని నిశితంగా పరిశీలిస్తూ, అచ్చంగా అలాగే రాసేందుకు ప్రయత్నించేవాణ్ని. నా అక్షరాలను చూసి మా టీచర్లు ప్రశంసించే వారు. ఓరోజు గోడపైన 'ప్రేమ్‌నగర్', 'మోసగాళ్లకు మోసగాళ్లు' సినిమా పోస్టర్లను చూసి, వాటిని అచ్చుగుద్దినట్టు పేపర్‌పై రాశాను. అప్పుడే.. నేను కూడా సినిమాలకు టైటిల్స్ రాయగలనని అనిపించింది.




తమిరి రమణ

**అన్నయ్య ప్రోత్సాహంతో..**

మా కజిన్, గురు సమానులు లంక భాస్కర్, ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్ ఈశ్వర్ గారి వద్ద పనిచేసేవాడు. ఆయనే నన్ను 1980లో మద్రాసుకు రమ్మన్నారు. ఈశ్వర్ గారికి నన్ను పరిచయం చేసి, ఓ అవకాశం ఇప్పించారు. అన్నయ్య సూచనలతో 'ఆకలి రాజ్యం' టైటిల్ కోసం పనిచేశాను. అదే నా ప్రయాణానికి తొలిమెట్టు. అలా ఈశ్వర్ గారి దగ్గర పనిచేస్తూ ఎన్నో సినిమాలకు టైటిళ్లు అందించాను. 'ఖైదీ' టైటిల్ అప్పట్లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. నాకూ మంచి పేరు తీసుకొచ్చింది. బాపు-రమణలతోపాటు పలువురు దిగ్గజాల ప్రశంసలు అందుకొన్నాను. 40 ఏండ్లుగా అక్షరాలతోనే ప్రయాణిస్తున్నా. 'ఆకలి రాజ్యం'తో మొదలుపెట్టి.. నిన్నటి 'రాధే శ్యామ్' వరకూ వందల సినిమాలకు టైటిళ్లు అందించాను. పురుషోత్త్ పరిచయంతో కంప్యూటర్ ఫాంట్స్ సృష్టికర్తగా మారాను. 'రమణ బ్రష్' కలం పేరుతో లెటరింగ్ చేస్తున్నాను. ప్రస్తుతం వినియోగిస్తున్న తెలుగు (అనూ ఫాంట్స్)లో 60 శాతం వరకు నేను రాసిన అక్షరాలే! ▪

## తెలుగు వాళ్లకోసం..!

**మాది** హైదరాబాద్‌లోని దోమలగూడ. ఏదైనా సాధించాలనే తపనే.. డీటీపీ ఆపరేటర్‌గా ఉన్న నన్ను, ఫాంట్స్ సృష్టికర్తగా మార్చింది. అప్పట్లో అన్నీ ఇంగ్లిష్ ఫాంట్లే ఉండేవి. మనవాళ్ల కోసం తెలుగులోనూ అందించాలని సంకల్పించాను. మొదటి సారిగా మా నాన్న చేతిరాతతో తెలుగు ఫాంట్ రూపొందించాను. దానికి మంచి స్పందన రావడంతో ఫాంట్స్‌పై మరింత ఆసక్తి కలిగింది. చేతిరాత బాగుండేవారి కోసం అన్వేషించాం. ఈ క్రమంలో అనేక ఫాంట్స్‌ను రూపొందించాం. అనూ ఫాంట్స్‌లో 'రమణ' పేరు చూసి, ఒకరోజు వెళ్లి కలిశాను. వారి అక్షరాలను కంప్యూటరీకరిద్దామని ఒప్పించాను. అలా మా ఇద్దరి ప్రయాణం మొదలైంది. ఇప్పటివరకూ అనేక ఫాంట్స్‌కు ప్రాణంపోశాం. 'పీవీ నరసింహారావు', 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం' పేరుతో ఫాంట్స్ తయారు చేశాం. మన భాషను నిలబెట్టుకోవడానికి సాంకేతిక రంగంలో మరిన్ని తెలుగు ఫాంట్స్ రావాల్సిన అవసరం ఉన్నది. ▪



జి.పురుషోత్త్ కుమార్




... ఇడుమాల కిరణ్ కుమార్

# కరెంట్ మీటర్



**మీ జీకే.. ఓకేనా?**



1
కొరియర్ డెలివరీ సంస్థ ఫెడెక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమితుడైన భారత సంతతి వ్యక్తి?

2
94వ అకాడమీ అవార్డ్స్ (ఆస్కార్)లో ఉత్తమ చిత్రంగా ఎంపికైన సినిమా?



5
ఔట్ స్టాండింగ్ కాంక్రీట్ స్ట్రక్చర్ – 2021 విభాగంలో తెలంగాణకు చెందిన ఏ నిర్మాణానికి ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ జాతీయ పురస్కారం దక్కింది?



6
తమిళనాడుకు చెందిన ఏ సంప్రదాయ సంగీత వాయిద్యానికి ఇటీవల భౌగోళిక గుర్తింపు (జాగ్రఫికల్ ఇండికేషన్– జీఐ) లభించింది?



3
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్చి నెల మన్ కీ బాత్‌లో జల సంరక్షణ గురించి మాట్లాడుతూ ఉదాహరణగా పేర్కొన్న తెలంగాణకు చెందిన మెట్లబావి ఏది?






7
అత్యుత్తమ గణిత పరిశోధనలకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక ఏబెల్ బహుమతిని ఈ ఏడాది ఎవరికి ప్రకటించారు?




4
ఒడిశా స్థానిక సంస్థల ఎన్నికలలో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన తొలి ముస్లిం మహిళ ఎవరు?

10
ప్రపంచ రాజధానుల్లోనే అత్యంత కలుషితమైనదిగా వార్తల్లో నిలిచిన నగరం ఏది?



9
చిన్నవయసులోనే టెన్నిస్ నుంచి పూర్తిగా విరమించు కుంటున్నట్లు ప్రకటించిన ఆస్ట్రేలియాకు చెందిన అగ్రశ్రేణి క్రీడాకారిణి ఎవరు?

8




అంతర్జాతీయ అనిశ్చితిని సాకుగా చూపి భారత్‌లో తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన సోషల్ మార్కెటింగ్ సంస్థ?

**జవాబులు**

1. రాజేశ్వర్ (రాజ్) సుబ్రమణియం
2. కొడా (చైల్డ్ ఆఫ్ డఫ్ అడల్ట్స్)
3. హైదరాబాద్‌లోని బన్సీలాల్‌పేట మెట్లబావి (ఇటీవల పునరుద్ధరించారు)
4. గుల్మకి దలావ్‌జీ హబీబ్ (భద్రక్ మున్సిపల్ చైర్మన్‌గా.. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు)
5. కరీంనగర్ తీగల వంతెన
6. నర్సింగపేటై నాదస్వరం
7. డెన్నిస్ పార్నెల్ సలివాన్ (అమెరికా)
8. షాపీ
9. ఆష్లీ బార్టీ
10. ఢిల్లీ

కాశ్మీర పాలకుడైన శూరసేనుడు తన నలుగురు మంత్రులతో సమావేశం నిర్వహిస్తుండగా, ఆకాశం నుంచి ఒక మామిడి పండు జారిపడుతుంది. అది సంతాన దాయకమైన పండు. నలుగురు మంత్రులతో కలిసి ఆ మామిడిపండును శూరసేనుడు భుజించగా, వారికి ఐదుగురు కుమారులు కలుగుతారు. వారందరి పేర్లలోని మొదటి అక్షరాలను కలిపి.. వారిని అందరూ 'వరప్రసాదు'లని పిలుస్తుంటారు.

కాశీ మజిలీ కథలు 2



# దేవతా వస్త్రాలు

వరప్రసాదులు పెరిగి పెద్దవారయ్యారు. తమ తండ్రులలాగే వారు ఐదుగురు కూడా ప్రాణస్నేహితులు. సమవయస్కులైన వారికి ఒకే సమయంలో విద్యాభ్యాసం పూర్తయింది. గురుకులం నుంచి రాజధానికి చేరుకున్న కొద్దిరోజులకు, ఒకనాటి సాయంకాలం ఐదుగురూ ఒకచోట కలుసుకున్నారు. మంత్రి కుమారుడైన రాముడు ముందుగా..

''మిత్రులారా! మనం అనేక విద్యలు నేర్చాం. ప్రాయానికి మించిన పాండిత్యాన్ని గడించాం. అయితే దేశాటన చేసినప్పుడు కానీ మన విద్యాపాటవం తేటతెల్లం కాదని నా అభిప్రాయం'' అన్నాడు.

అందుకు రాజకుమారుడైన వసంతుడు..


''మంచి మాట చెప్పావు మిత్రమా! వెంటనే మనం దేశాటనం చేయాల్సిందే! ఈ తరుణం దాటిపోతే, మెడకు లంకెలు తగిలించుకున్న తరువాత అడుగు తీసి బయటపెట్టలేం'' అని ఆమోదించాడు.

బ్రాహ్మణ కుమారుడైన ప్రవరుడు..

''నూతిలో కప్పల్లాగా దేశాన్ని తిరిగి చూడనివాడు.. పండితుడైనా మూర్ఖుడేనంటారు'' అన్నాడు ఊతమిచ్చినట్లుగా.

ఈ ప్రతిపాదనకు వైశ్య కుమారుడైన సాంబుడు కొంత వెనుదీశాడు. కానీ, కళాదుని కుమారుడైన దండుడు సర్ది చెప్పాడు.

''దేశాటనం చేసి, అనుభవం గడించిన వాళ్లెందరో ఉన్నారు. మనం ఏడాది గడువు లోపల తిరిగివస్తామని రాసిపెట్టి వెళదాం. మిత్రమా! నీ పెళ్లిని ఒక్క ఏడాది వాయిదా వేయమని మీ వాళ్లకు లేఖ రాయి. ఏమో! దేశాటనలో మనకు ఎటువంటి కన్యలు ఎదురుపడతారో చెప్పలేం. మన హృదయాలను ఎవరైనా దోచుకుపోయినా ఫరవా లేదు. ఇక మన ఆయువులకు మృత్యు భయం లేకుండా వాటిని నేను దాచిపెట్టగలను'' అన్నాడు.



ఐదుగురు మిత్రులకూ ఒప్పందం కుదిరింది. రెండురోజుల తరువాత నాటి రాత్రి, వేర్వేరుగా అశ్వాలను అధిరోహించి.. పశ్చిమ దిక్కుగా ప్రయాణం సాగించారు. రాళ్లతో నిండిన గుట్టలు దాటి, దట్టమైన అడవులను దాటి వారంతా ఐదు రోజుల పాటు నిర్విరామంగా ప్రయాణించారు. ఆరోనాటి మధ్యాహ్నానికి అడవి పలచబడింది. వ్యవసాయ భూములు కానవచ్చాయి.

''అదుగో.. అక్కడేదో నగరం ఉన్నట్లుంది'' అని సాంబుడు అల్లంతదూరానికి వేలుపెట్టి చూపించాడు.

అందరూ ముందుకు సాగారు. కొంతదూరం వెళ్లిన తరువాత ప్రవరుడు..

''మిత్రులారా! ఒకసారి గుర్రాలను ఆపండి'' అన్నాడు.

అందరూ ఆగిన తరువాత.. ''ఇది నిజంగా నగరమే అయితే మనుషులు కనిపించాలి. ఇక్కడ వ్యవసాయం చేస్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మనుషుల అలికిడి మాత్రం లేదు. ఇదేమి మాయ?'' అని సందేహం వెలిబుచ్చాడు.

''మాయా నగరమైతే మనకేమి? మన ఆయువులను నేను రహస్యంగా దాచిన విషయం మరిచి పోయారా? మరేం భయం లేదు. పోయి ఆ వింత ఏమిటో చూద్దాం'' అన్నాడు దండుడు.

అందరూ సరేనంటూ గుర్రాలను అదిలించారు. ఆ మిట్టమధ్యాహ్నం అర్ధరాత్రిలా ఆ నగరమంతా నిశ్శబ్దంగా ఉంది. ఇళ్ల తలుపులన్నీ మూసి ఉన్నాయి. మరికొంత దూరం వెళ్లేసరికి ఒక వీధిలో కొందరు మనుషులు అరుగుల మీద నిద్రిస్తూ కనిపించారు.

వసంతుడు ఆ వింత చూసి వెరగు పడుతూ..

''మిత్రులారా! ఇదేదో నిశాచరుల రాజ్యంలా ఉంది'' అన్నాడు. ఇంతలో అక్కడికి కొందరు రాజభటులు వచ్చారు.

''ఎవరు మీరు? ఇక్కడికి ఎందుకు వచ్చారు? ఈ అర్ధరాత్రి సమయంలో నిర్భయంగా సంచరిస్తున్నారేంటి?'' అంటూ గద్దించారు.

రాముడు ఒక్కసారి ఆకాశంలో సూర్యుని వంక చూసి..

''ఇది అర్ధరాత్రా? పట్టపగలు కాదా? మీ మాటలు ఇంత విపరీతంగా ఉండటానికి కారణమేమిటి?'' అని ప్రశ్నించాడు.

''ఇది పగలు అన్నవారిని శిక్షించమని రాజుగారి శాసనం. మొదటి తప్పు కనుక వదిలేస్తున్నాం. పోయి ఎక్కడైనా నిద్రపోండి. చీకటిపడి నగరం నిద్రలేచాక మిగిలిన విషయాలు మాట్లాడుకోవచ్చు'' అన్నారు వారు.

''సరే.. ఈ పూటకి మేం నిద్రపోవడానికి సత్రమేదైనా చూపించండి'' అడిగాడు సాంబుడు.

''పరదేశీయులకు సాయం చేయడానికి రాజాజ్ఞ లేదు'' అంటూ రాజభటులు వెళ్లిపోయారు.

ఆ మధ్యాహ్నమంతా వరప్రసాదులు ఒక అరుగుమీద గడిపారు. సాయంకాలమైంది. కోడి కూతతో ఊరు మేలుకున్నట్లు మొగసాలమీద గడియారం మోతతో నగరమంతా మేలుకుంది. ఉదయాన్నే అందరూ ఎలాగైతే కాలకృత్యాలు తీర్చుకుని, తమతమ పనులకు ఉపక్రమిస్తారో అలాగే.. నగర జనులందరూ ప్రవర్తించసాగారు.

వరప్రసాదులు నిద్రపోతున్న అరుగు మీది తలుపులు తెరుచుకుని, ఆ ఇంటి యజమాని కొద్దిగా ఆలస్యంగా వచ్చాడు. వీరిని పలకరించి వివరాలడిగాడు.

అప్పుడు ప్రవరుడు.. ''అయ్యా! మీ నగరజనులంతా ఇలా నిశాచరులు కావడానికి కారణం ఏమిటో తెలియలేదు. దయచేసి మాకు తెలియచేయవలసింది'' అని అడిగాడు.

ఆ ఇంటి యజమాని వారైదుగురినీ లోనికి తీసుకువెళ్లి, యథోచితంగా అతిథి సత్కారాలు చేశాడు. ఆ తర్వాత ఒక రహస్య స్థలానికి తీసుకుపోయి, ఆ నగర వృత్తాంతాన్ని చెప్పాడు.

* * *

''అయ్యా! ఇది లాటదేశం. ఈ రాజ్యాన్నేలేది కానీనుడు. మా రాజుకు దుష్టబుద్ధి, సుబుద్ధి అని ఇద్దరు మంత్రులున్నారు. వారి ఆలోచనల ప్రకారం రాజ్యాన్ని ఏలుతూ ఉన్న కానీన మహారాజు, సుమారు పది సంవత్సరాల క్రితం ఒక మహాసభ నిర్వహించాడు.

ఆ సభలో రాజు.. 'అమాత్యులారా! నా మనసులో ఇప్పుడో మహాసంకల్పం కలిగింది. మీరు పూర్తిగా విని మంచిచెడులు చెప్పండి. భూమి పుట్టింది మొదలు నేటివరకూ దీనిని పాలించిన రాజులందరూ ఒక్కరీతిగానే వ్యవహరించారు. వారికంటే ముందు తరాలవారు ఏం చేశారో వీళ్లు కూడా అవే పద్ధతులను గుడ్డిగా అనుసరించారు. మేం కాస్త కొత్తగా ఆలోచించ దలుచుకున్నాం. దీనిమూలంగా మాకు, మనదేశానికి గొప్ప కీర్తి వస్తుంది. ఇంతకూ మా ఆలోచన ఏమిటంటే.. నిద్రాహారాల వేళలను బట్టి మనవారు కాలాన్ని పగలు, రాత్రిగా విభజించారు. నిద్రించేది రాత్రి అని, విహరించేది పగలని నిర్ధారించారు. దానికి బదులుగా పగటి పనులు రాత్రిపూట, రాత్రి సమయంలో చేయాల్సిన పనులను పగటిపూట చేయాలని మేం నిర్ణయించాం. ఇకమీదట మా రాజ్యంలో ఎవ్వరూ ఆకాశంలో సూర్యుడు ఉండే సమయాన్ని పగలు అని పిలవకూడదు. జాము పొద్దెక్కేదాకా కాదు.. అసలు సూర్యుడు ఉండగా ఎవ్వడూ నిద్ర లేవడానికి వీలులేదు. చంద్రుడు ఉండగా నిద్రపోయేందుకు వీల్లేదు. తినడం, తాగడం, పనీపాటా.. అన్నీ రాత్రివేళల్లోనే! పగటిపూట ఇవన్నీ నిషేధిస్తున్నాం. పగటిపూట పనిచేసేవారు కఠినదండనకు గురవుతారని నేడే రాజ్యమంతా దండోరా వేయిస్తాం' అన్నాడు.

ప్రభువులు, అధికారుల మెరమెచ్చుల కోసం వారు చెప్పినట్లల్లా తోకలు ఆడించడం, వాళ్ల తలతిక్కలకు తగ్గట్టుగా తందనాలు పలకడం ఏ

రాజ్యంలో అయినా మామూలే. మా రాజ్యం కూడా మినహాయింపు కాదు.

'స్వర్గానికి ప్రతిస్వర్గాన్ని సృష్టించిన విశ్వామిత్రునికి వలె మీ కీర్తి అజరామరం అవుతుంది మహారాజా!' అన్నాడు మంత్రులలో ఒకడైన దుష్టబుద్ధి.

సుబుద్ధి కొంచెం మంచి ఆలోచన చెప్పబోయాడు.

'మనుషులను మనం చెప్పినట్లు వినేలా చేయవచ్చు. బెదిరించి కొందరిని, తాగుడు, జూదం లాంటి విలాసాలకు అనువుగా ఉంటుందని మభ్యపెట్టి మరికొందరిని మన దారిలోకి తేవచ్చు. కానీ, రాజ్యంలోని పశుపక్ష్యాదులు మాత్రం అలాంటివి కావు. అవి ప్రకృతి ధర్మాలను మీరి నడుచుకోవు. మీలాంటివారిని ఆదర్శంగా తీసుకుంటే రేప్పొద్దున వేరొక రాజు పాదాలతో కాకుండా చేతులతో నడవమంటాడు. ఇంకొకడు కళ్లతో విని, చెవులతో చూడమంటాడు. ఇది సరైన విధానం కాదు' అని తేట తెల్లంగా చెప్పాడు.

కానీ, సుబుద్ధి మాటలకు విలువ లేకుండా పోయింది. కానీన మహారాజుగారి బుర్రలో పుట్టిన వెర్రిమొర్రి ఆలోచన చూశారుగా.. మా రాజ్యాన్ని ఏ గతికి తెచ్చిందో. రాజుగారి కఠిన శిక్షలకు భయపడి మేమంతా ప్రకృతికి వ్యతిరేకంగా నడుచుకుంటున్నాం..'' అంటూ ఆ ఇంటి యజమాని తమ రాజ్యపు కథను వినిపించాడు.

* * *

వరప్రసాదులు ఐదుగురూ ఆ రాత్రంతా తమలో తాము చాలాసేపు మాట్లాడుకున్నారు. ఆ రాజ్య ప్రజలకు మేలు చేసి, రాజుకు బుద్ధి చెప్పిన తరువాత కానీ అక్కడినుంచి కదలకూడదని నిశ్చయించుకున్నారు.

మరునాడు రాత్రికి కానీన మహారాజు కొలువుకు వెళ్లారు.

''రాజేంద్రా! మాది కాశ్మీర దేశం. మా పుణ్యం కొద్దీ మిమ్మల్ని చూడగలిగాం. ఇక మా సంగతి.. విచిత్రమైన వస్త్రాలు నేయడంలో మాకు సాటి ఎవరూ లేరు. భూమండలమంతా మా పేరు మారుమోగుతూ ఉంటుంది. బహుశా మీరు వినే ఉంటారు'' అన్నాడు వసంతుడు.

వారెవరో నిజానికి తెలియకపోయినా.. తెలుసన్నట్లు గంభీరంగా తలాడించాడు కానీనుడు.

''రాజా! మేము ఆరుమాసాలకు ఒక ధోవతి, ఉత్తరీయం, పాగా వస్త్రాన్ని మాత్రమే నేస్తూ ఉంటాం. మేము నేసేవి మామూలు వస్త్రాలు కావు. దేవతా వస్త్రాలు. మేము నేసిన వస్త్రాలను ధరించి ఊరంతా ఊరేగి, ఆ రాత్రికి భార్యతో గడిపితే ఆ దంపతులకు దేవసమానుడైన పుత్రుడు జన్మిస్తాడు. అయితే అవి దేవతావస్త్రాలని మనవి చేశాం కదా! జారులకు, చోరులకు, అబద్ధం చెప్పే వారికి ఆ వస్త్రాలు కనబడవు. అటువంటి వస్త్రాలను మీకోసం నేసి ఇవ్వాలని మా కోరిక'' అన్నాడు ప్రవరుడు.

దేవతా వస్త్రాలనగానే రాజుకు ఆశ పుట్టింది.

''వెంటనే పని మొదలుపెట్టండి'' అన్నాడు.

''మహారాజా! మాకోసం ఓ భవంతిని కేటాయించండి. నేతపని పూర్తికాగానే మాకు యాభైవేల మాడలు దక్షిణగా ఇవ్వాలి. పని జరుగుతున్నకాలం మీరు ప్రత్యక్షంగా ఆ వస్త్రాలను చూడకూడదు'' అన్నాడు సాంబుడు.

మహారాజు సంశయిస్తూనే
ఆ వస్త్రాలను అందుకున్నాడు.
కంటికి కనిపించని వాటిని
'కనిపించట్లేదు' అని చెప్పడానికి
వెనకాడాడు. అంతఃపురానికి వెళ్లి,
మామూలు వస్త్రాలను విడిచి
దేవతావస్త్రాలను ధరించాడు.
మహారాణి వారిస్తున్నా వినకుండా
ఊరేగింపునకు బయలుదేరాడు.
జరగవలసిన ఘోరమంతా జరగనే
జరిగింది. రాజ్యపౌరుల మధ్య
రాజుకు భంగపాటు ఎదురైంది.
పూర్తి నిజం తెలుసుకున్న తరువాత
మహారాజు ఆగ్రహోదగ్రుడ
య్యాడు. వరప్రసాదులను పట్టి
బంధించి తీసుకురమ్మని
భటులను పంపించాడు.

వారి షరతులన్నింటికీ కానీనుడు ఒప్పుకొన్నాడు.

''రాత్రింబవళ్లనే తిరగేసిన మాకు.. దేవతా వస్త్రాలను కట్టుకుని, దేవసమానుడైన పుత్రుణ్ని పొందిన కీర్తి దక్కవద్దా? ఈ మాత్రపు చిల్లర ఖర్చుకు వెనుదీస్తామా?'' అన్నాడు.

రాజు కోసం దేవతా వస్త్రాలను నేసే పని అప్పగించడం పూర్తయింది. వరప్రసాదులు అడిగినట్లుగానే ఓ భవంతిని కేటాయించారు. రాట్నాలు, మగ్గాలు అన్నీ భవంతిలో సమకూర్చారు. ప్రతి రోజూ రాత్రిపూట ఆ భవంతినుంచి మగ్గం ఆడుతున్న చప్పుడు వినిపించేది. కానీ, నూలు లేకుండా వట్టి మగ్గమే చప్పుడు చేస్తున్నదనే విషయం చాలామందికి తెలియదు.

కొంతకాలానికి పని ఎంతవరకూ వచ్చిందో తెలుసుకురమ్మని ఇద్దరు మంత్రులను పంపించాడు కానీనుడు. వచ్చిన మంత్రులను సాదరంగా ఆహ్వానించారు వరప్రసాదులు. తమ పనిని బహువిధాలుగా వర్ణించసాగారు.

''అయ్యా! ఈ నూలు పట్టుకుని చూడండి. ఎంత మెత్తగా ఉందో గమనించారు కదా!'' అని ఒక ఖాళీ కండెను మంత్రుల చేతిలో పెట్టాడు సాంబుడు.

వచ్చిన వారికి మతిపోయింది. నోరు తెరిచి ఏదో చెప్పబోయారు. కానీ, జారత్వం, చోరత్వం, అబద్ధాలు చెప్పే అలవాటు ఉన్నవాళ్లకు ఆ వస్త్రాలు కనిపించవని ముందుగా చెప్పిన సంగతి గుర్తుకు వచ్చింది.

''చాలా బాగున్నది. చాలా బాగున్నది'' అంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు.

రాజు వద్దకు వెళ్లి.. ''అటువంటి నూలు మా జన్మలో చూడలేదు. ఆ సొగసును మేం వర్ణించలేం. నిజంగా అది భూలోకానికి చెందినది కాదు మహారాజా!'' అని వింతలు వింతలుగా చెప్పుకొచ్చారు.

నిజమేననుకున్నాడు కానీనుడు. బుద్ధి పుట్టినప్పుడల్లా ఎవరినో ఒకరిని.. ''దేవతా వస్త్రాలు నేసే పని ఎంతవరకూ వచ్చిందో చూసిరండి'' అని పంపుతూనే ఉన్నాడు. వెళ్లినవాళ్లు ఖాళీ రాట్నాలను, మగ్గాలను చూసివచ్చి, కనబడలేదంటే పరువు పోతుందని.. ''అబ్బో అబ్బో.. వస్త్రాలు గొప్పగా ఉన్నాయి..'' అని చెబుతూ, కొద్దిసేపు నటించి వెళ్లిపోతూ ఉండేవాళ్లు.

ఆరునెలల గడువు పూర్తయింది.

రాజుగారికి దేవతావస్త్రాలను సమర్పించే రోజు రానే వచ్చింది. ముందస్తుగా యాభైవేల మాడల దక్షిణతో కూడిన పళ్లేన్ని ప్రవరుడు రాజునుంచి అందుకున్నాడు. ఎర్రని పట్టువస్త్రంతో కప్పి ఉంచిన పళ్లెంలో దేవతావస్త్రాలను వసంతుడు రాజుకు అందజేశాడు.

''రాజా! వీటిని ధరించి, మీరు దేవతా సమానులు కావాలని మా ఆశ. పవిత్రమైన ఈ వస్త్రాలను మీ ఏకాంత మందిరానికి వెళ్లి ధరించండి. అనంతరం మదగజాన్ని అధిరోహించి నగరవీధులలో ఊరేగండి. మీ కీర్తిప్రతిష్ఠలు వీటివల్ల రెట్టింపు కాగలవు'' అన్నాడు.

మహారాజు సంశయిస్తూనే ఆ వస్త్రాలను అందుకున్నాడు. కంటికి కనిపించని వాటిని 'కనిపించట్లేదు' అని చెప్పడానికి వెనకాడాడు. అంతఃపురానికి వెళ్లి, మామూలు వస్త్రాలను విడిచి దేవతావస్త్రాలను ధరించాడు. మహారాణి వారిస్తున్నా వినకుండా ఊరేగింపునకు బయలుదేరాడు.

జరగవలసిన ఘోరమంతా జరగనే జరిగింది. రాజ్యపౌరుల మధ్య రాజుకు భంగపాటు ఎదురైంది. పూర్తి నిజం తెలుసుకున్న తరువాత మహారాజు ఆగ్రహోదగ్రుడయ్యాడు. వరప్రసాదులను పట్టి బంధించి తీసుకురమ్మని భటులను పంపించాడు.

కానీ, అప్పటికే ఆ ఐదుగురూ రాజ్యపు పొలిమేరలు దాటి వెళ్లిపోయారు. వారు నివసించిన భవంతిలోని గోడలపై ఒక లేఖ దర్శనమిచ్చింది. దాంట్లో ఇలా ఉంది..

కానీన మహారాజుకు..

దుష్టబుద్ధితో నీవు లోకవిరుద్ధమైన మార్పులను చేశావు. ప్రజలను కష్టాల పాలు చేశావు. నీచేత ఈ పనులన్నీ మాన్పించడానికి దేవేంద్రుని దూతలుగా మేం వచ్చాం. ఈ విశ్వంలోని జీవులందరితోపాటు మానవుడు కూడా ప్రకృతి ధర్మాలకు అనుగుణమైన స్వేచ్ఛతో ఆనందంగా జీవించవచ్చు. ధర్మాన్ని పాడుచేస్తే మహమ్మారులు చుట్టుముడతాయి. కడగళ్లు వచ్చిపడతాయి. ఇకమీదనైనా నీ బుద్ధి మార్చుకో. నీ విపరీత శాసనాన్ని వెంటనే విరమించుకో. లేదంటే మరోసారి వచ్చి, నిన్ను రాజ్యభ్రష్టుణ్ని చేయాల్సి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త!


– ఇది వరప్రసాదుల హెచ్చరిక!! ■

* * *

**(వచ్చేవారం.. పంజరంలో రామచిలుక)**

అనుసృజన

**నేతి సూర్యనారాయణ శర్మ**



# ఉన్నొక్క మెతుకు గంజిల పడ్డట్టాయె

**జానపదుల** జీవన విధానంలోంచి పుట్టిన సామెత ఇది. మనిషి, వస్తువు, జంతువు ఏదైనా కావచ్చు.. ఉన్నట్టుండి దూరమైతే ఆ బాధను మాటల్లో వర్ణించలేం. తెలంగాణ జీవన విధానంలో గంజికి చాలా ప్రాధాన్యం ఉంది. ఇప్పటికీ గంజివార్చే కుటుంబాలు అనేకం. వేడివేడి గంజిలో మెతుకు పడితే దానిని తీయలేం, అప్పటికప్పుడు తాగనూలేం. కుటుంబంలో చిట్టచివరి వ్యక్తి కూడా దూరమైనప్పుడు, అత్యంత ఇష్టమైన వస్తువో, జంతువో కనుమరుగైనప్పుడు గుండె నిండా బాధతో.. 'ఉన్నొక్క మెతుకు గంజిల పడ్డట్టాయె' అంటుంటారు. వచ్చిన అవకాశం చేజారినప్పుడు కూడా ఈ సామెతను ఉపయోగిస్తారు

మన సామెతలు

... డప్పు రవి

**తల్లిదండ్రుల** మంచి చెడులను వారి పిల్లలు కూడా వారసత్వంగా కొనసాగిస్తున్న సందర్భంలో వాడే సామెత ఇది. ఏ విత్తనం నాటితే, ఆ చెట్టు పురుడు పోసుకున్నట్లే.. తల్లిదండ్రుల అలవాట్లు పిల్లలకు కూడా వస్తాయని అంటారు. తల్లిదండ్రులు దుర్మార్గులు అయితే, పిల్లలు కూడా అదే బాటలో నడుస్తూ.. సమాజానికి కీడు తలపెడుతున్నప్పుడు ఈ సామెతను ప్రయోగిస్తారు. 'ఆవు పొలంలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా?', 'పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో కానీ పోదు' వంటి సామెతలూ ఇలాంటివే. అందుకే తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకూ మంచి పనులే చేయాలని, పిల్లలకు చిన్నతనం నుంచే మంచి చెడులు వివరించాలని హితవు పలుకుతుంటారు పెద్దలు.

# ఇత్తోటి పెడితె సెట్టోటి ఐతదా!



పలుకుబడులు

# పంచాయితీల పుల్లరి కట్టాలె




బొమ్మలు: మృత్యుంజయ్

పదబంధం

**తెలంగాణ** గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ 'పుల్లరి' అనే మాట వాడుకలో ఉంది. నిజాం కాలంలో పుల్లరి రుసుమును అధికారికంగా వసూలు చేసేవారు. బొగ్గు ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో 'కోపులు' అనే నిషేధిత ప్రాంతాలు ఉండేవి. అక్కడ ఆవులు, బర్లు, ఇతర జీవాలు మేపడానికి ఏడాదికి ఎంతోకొంత నగదు 'పుల్లరి' పేరిట చెల్లించేవారు. అయితే, ఇప్పుడా పదం ఎక్కువగా పెద్దల పంచాయతీలో వినిపిస్తుంటుంది. ఒకే కులానికి చెందిన రెండు వర్గాల వారికి గొడవలు వచ్చినప్పుడు.. దానిని పరిష్కరించే పెద్దలకు ఇరు పక్షాలూ 'పుల్లరి' చెల్లించాల్సి ఉంటుంది. అది ఎంత అన్నది పెద్దలే నిర్ణయిస్తారు. వాదోపవాదాలు విన్న తర్వాత ఒక తీర్మానం చేస్తారు. దానికి ఇరు పక్షాలూ కట్టుబడి ఉండాలి. అలా వచ్చిన పుల్లరి రుసుమును పంచాయితీ కుదిర్చిన పెద్దలు పంచుకుంటారు. కొందరేమో 'కుల కట్టడి' కింద జమ చేస్తారు.

## అర్థ వివరణ



1 **పుల్లశీలుడు =** అలసట (పొద్దుపొడిచిన దగ్గర్నుంచి.. పొద్దుగూంకేదాక పత్తి ఏరిన.. పానమంతా పుల్లశీలినట్టయింది)

2 **న్యాకు =** తెలివి / జ్ఞానం (వానికి మస్తు న్యాకు ఉంటదిరా. ఎవరి దగ్గరైనా బతుకుతడు)

3 **మునుం =** వరస (మునుంబట్టి మిరికాయ కోత మెదలువెడితే.. మాపటేళ్లకు మునుం వెళ్లింది)

4 **గుడ్డెలుగు పాదాలు =** ఎలుగుబంటి పాదాలు (అరికాలు మధ్యలో కూడా సందు లేకుండా మొత్తం భూమికి తాకే పాదాలు. వాడివి 'గుడ్డెలుగు పాదాలు')

5 **5. ఉబ్బాగుతలే =** ఏదీ దాచుకోక పోవడం (మొన్న పిల్లను సూసొచ్చిండో లేదో.. యెమ్మట్నే అందరికీ చెబుతుండు.. వీడికస్సలు ఉబ్బాగుతలే)

> 'నమస్తే తెలంగాణ,
> ముల్కనూరు ప్రజాగ్రంథాలయం'
> సంయుక్తంగా నిర్వహించిన
> 'కథల పోటీ-2021'లో ద్వితీయ బహుమతి
> రూ.25 వేలు పొందిన కథ.

# మోదుగు పువ్వు!


...పి.చంద్రశేఖర్ (చందు తులసి)
9985583022

ఆ రోజు ఇక నేను ఎలాగైనా సరే.. చనిపోవాల్సిందేనని నిర్ణయించుకున్నాను. నిజం.. 'ఇక నేను బతకడం దండగ' అనిపించింది. అందుకే ఈ నిర్ణయం! ఈ ప్రపంచంలో ఉన్న దారులన్నీ మూసుకొని పోయి.. బతకడం కంటే చావడం మేలు అనుకునే క్షణం.. జీవితంలో ఎంతమందికి వస్తుందో తెలీదు కానీ, ఒంటరి ఆడపిల్లనైన నాకు ఇరవై ఏళ్లు నిండకుండానే వచ్చింది.

* * *

నాపేరు సైది. దేవరకొండ తాలూకాలో అడివికి దగ్గర ఉన్న మారుమూల లంబాడా తండా మాది. నేను పుట్టక ముందే మా అమ్మ – నాయినకు నలుగురు ఆడ పిల్లలు పుట్టినరట. మగ పిల్లగాడు కావాలని వరుసగా కంటనే పోయినరు. నాకు ఊహ తెలిసేటప్పటికే పెద్ద అక్కకు పెండ్లి అయిపోయింది. పెద్ద అక్క తర్వాత పుట్టిన ఇద్దరు పిల్లలు పురిట్లోనే పోయినరట. నాలుగో అక్కను.. అందంగా ఉందని పుట్టిన ఏడాదికే, ఎవరో హైదరాబాద్‌లో ఉండేటోళ్లు కొనుక్కొని పోయినరట. పిల్లలను కనడమే తప్ప సాకలేని నాయిన ఐదువేలకు బిడ్డను అమ్మినడు. ఆ తర్వాత రెండేళ్లకు నేను పుట్టిన్నంట. ఇయ్యన్నీ మా అమ్మ చెప్పిన ముచ్చట్లు.

మా దేవరకొండ లంబాడా తండాల్లో కొడుకు పుడితే బాగా సంబరం చేసుకుంటరు. పదేళ్లు సాకితే ఏ ఆసామి దగ్గర జీతానికి పెట్టినా డబ్బులు వస్తాయని. అదే ఆడపిల్ల పుడితే ఎవలకో ఒకలకు అమ్ముతరు. మా తండాలో కొంతమంది ఏజెంట్లు ఉంటరు. పురిట్ల పాప నుంచి, నలబై ఏండ్ల నడికారు మనిషి దాంక ఎవరినైనా అమ్మి పెడతారు. చానామంది ఆడబిడ్డలు పుట్టేది మా తండా



మట్టిల.. కానీ, కలిసేది మాత్రం ఏ బొంబాయి, పూనా మట్టిలోనో!

ఇరవై ముప్పై ఏళ్ల కిందట మా తండాలు ఇప్పటిలా ఉండేయి కాదు. ఎంత పిలిచినా చుక్క వాన వచ్చేది కాదు. కానీ, పిలవకుండానే కరువు వచ్చేది. అప్పట్లో వరుసగా ఏటా కరువులే. తాగడానికే గుక్కెడు నీళ్లు దొరికేయి కాదు. బుక్కెడు బువ్వ దొరక్క.. కళ్లు లోపలికి గుంజుకపోయి, బొక్కలు తేలిపోయి.. మడుసులు నడిచే అస్థిపంజరాల మాదిరి ఉండేవారు. తల్లికే తిండి లేకపోతే ఇంగ పసిపిల్లలకు పాలు ఏడికెల్లి వస్తయి. పిల్లలను సంపుకొని బొందల గడ్డ సమాధి చేసే కంటే.. అమ్ముకోవడం మేలు అనుకునేటోళ్లు. కన్నపేగును కూడా దూరం చేసుకునేంత కటిక పేదరికం ఆ రోజుల్లో ఉండేది.

నేను మా నాయిన పోలికతోని నల్లగా పుట్టిన. కాకి నలుపు. అందుకే నన్ను ఎవలూ కొనుక్కోలేదు. నా వల్ల డబ్బులు రాలేదని నాయినకు కోపం. నా పోలిక ఆయనదే ఐనా కాలీ చ్వారీ (నల్ల పోరీ) అని తిట్టేవాడు. రోజూ సాయంత్రం తాగి వచ్చి అమ్మను, నన్ను బాగా కొట్టేవాడు. నన్ను 'ఎట్లైనా వెళ్లిపో' అని.. 'ఏ చెరువులోనో దూకి సచ్చిపో' అని గొడ్డును బాదినట్టు బాదేవాడు. అన్ని చిత్రహింసలు పడ్డ రోజు కూడా నేను చచ్చిపోవాలని అనుకోలేదు. కానీ, ఈరోజు అలాంటి పరిస్థితి వచ్చింది.



* * *

చిన్నపుడు అమ్మతోపాటే అడివిలోకి పోయేదాన్ని. పొయిలకు కట్టెలో, తునికి పండ్లో.. ఏవి దొరికితే అవి తెచ్చుకునేటోళ్లం. అమ్మ మోదుగు చెట్టును చూపించి ఒక ముచ్చట చెప్పేది.

మోదుగు విత్తనం నేల మీద పడితే చాలు. యాభై ఏండ్ల పాటు వర్షాలు కురవకపోయినా సరే.. ఆ గింజ తట్టుకొని నిలబడతదంట. వానలు పడి తడి తగలగానే, మళ్లీ మొలక వస్తుందట. మెల్లగ మొక్కై పెరిగి, పెద్ద చెట్టై.. వేయి పూలై విరబూస్తుందట. మనిషి కూడా తన కష్టకాలంలో పానం నిలుపుకోవాలని.. ఆపదలు తట్టుకొని నిలబడాలని చెప్పేది.

మా తండా పక్కన పెద్ద తండాల స్కూలు ఉంది. అది ఆడపిల్లల స్కూలు, హాస్టల్ కూడా ఉంది. ఆ సార్లు మా తండాలో పిల్లల సర్వే కోసం వచ్చినపుడు నన్ను హాస్టల్ల జాయిన్ చేయమని అమ్మకు చెప్పినరు. అట్ల తిండి కోసం నేను హాస్టల్ల జాయిన్ అయిన. మా అమ్మను వదిలిపెట్టి ఉండలేను కానీ.. హాస్టల్లో నాయిన ఉండడు, కొట్టడు కద. అందుకని హాస్టల్‌కి పోయిన. బడి నడిచినన్ని రోజులు బానే ఉండేది. కానీ, దసరాకు, ఎండాకాలానికి సెలవులు వచ్చినయంటే గుబులు. ఇంటికి పోవాలంటే రంది.

ఇంటికి పోతే నాయిన కొడుతడు. సంపుతడేమో అన్న భయం. అందుకే మా ఇంటికి పోయినా.. రాత్రి నాయినకు కనపడకుండా మా అమ్మమ్మ ఇంటికో, వేరే వాళ్ల ఇంటిదగ్గరో పడుకునేదాన్ని. అట్ల స్కూలు, హాస్టల్ తెరిచేదాక మిడుకు మిడుకుమంటూ బతికేదాన్ని.

ఓరోజు అటువంటి సెలవుల్లోనే.. నాయిన అడివిలో పాము కరిచి చనిపోయిండు. పాము కాటుకు ముఖం నల్లగా మారిన నాయినను చూసి.. నాకు మాట రాలేదు. జనం కోసమైనా ఏడ్వడానికి ఎంత తన్నుకున్నా దుఃఖం రాలేదు. నాయిన చనిపోయిన బాధకంటే.. ఇక నన్ను కొట్టడన్న సంగతే సంతోషంగా అనిపించింది.

నా చదువు గురించి చెప్పాలంటే అదో పెద్ద కథ. బాగ చదువుకోవాలని మా టీచర్లు చెప్పే ముచ్చట బాగా నచ్చేది. నేను బాగ చదువుకొని ఉద్యోగం సంపాదించి.. పుట్టెడు కష్టాలు పడిన మా అమ్మను సుఖంగా చూసుకోవాలని అనుకునేదాన్ని. కానీ, ఎంత ప్రయత్నించినా మా భాషకు.. టీచర్లు మాట్లాడే భాషకు చాలా తేడా ఉండేది. ఆ సదువు, మా భాష ఒక్కటి కాదు. నానా తిప్పలు పడి తెలుగు భాష పూర్తిగా నేర్చుకునే సరికి.. పిడుగులాగ ఇంగ్లిష్ భాష వచ్చింది. పొట్ట కోసినా ఇంగ్లిష్ పలకడం రాకపోయేది. మా సార్లు కొట్టికొట్టి చేతులు కాయలు కాసినయి కానీ.. ఇంగ్లిషు భాష మాత్రం రాలేదు. అసలు ఏమన్న అర్థమైతే కద.. చెప్పడానికి.

ఏడో తరగతిల ముందో ఎనకో చూసి పరీక్ష రాసి నెట్టుకొచ్చిన. కానీ, పదో తరగతిల మాత్రం ఫెయిలై పోయిన. ఇప్పుడు హాస్టల్ నుంచి ఎల్లిపోవాలె. మల్ల తండాకు పోవాలె. సప్లిమెంటరీ పరీక్ష రాసి పాసు కావాలె. పాసైతేనే ఇంటర్. లేదంటే అంతే.. అన్ని సబ్జెక్టులు పాసైన కానీ అది ఇంగ్లిష్ కాబట్టి ఫెయిలైన.

''అన్నీ పాసైన.. ఒకటే కద సారు ఫెయిలైంది. నన్ను పైక్లాసుకు పంపించండి సారూ!'' అని మా సార్లను బతిమాలిన.

''అట్ల కుదరదు'' అని చెప్పినరు. ఏం చేయాల్నో అర్థం కాలేదు. ఈ ఇంగ్లిష్ పాడు కానూ.. ఈ ఇంగ్లిష్ నాశనం కాను.. ఇంగ్లిష్ కాబట్టి నా బతుకు అన్యాయం ఐపోయిందని తిట్టుకున్న. నా ఇనుప సందుక పెట్టె నెత్తిన పెట్టుకొని.. వలవలా ఏడ్చుకుంట మా తండాకు పోయిన. ఒకటే దుఃఖం. అంత బాధలో కూడా నేను చచ్చిపోదాం అనుకోలేదు. కానీ.. నేను ఇప్పుడు చేసిన తప్పు నాకు చావు తప్ప ఇంకో మార్గం లేకుండా చేసింది.

* * *

పదో తరగతి ఫెయిలై తండాకు వచ్చిన. మా అమ్మకు తెలిసినా ఏమీ అనలేదు. అసలు పాస్, ఫెయిల్ ఏందో కూడా తనకు అర్థం కాలేదు. నేను 'ఏ పని చేయాలా?' అని ఆలోచిస్తున్నపుడు.. మా తండాలో సారా యాపారం చేసే వసురాం మా ఇంటికి వచ్చినడు. ఆయన మా తండాలో సారా కాచి.. దేవరకొండ టౌనుకు దొంగతనంగా తీసుకొని పోయి యాపారం చేస్తడు. లోపల సారా పాకెట్లు, పైన కూరగాయలు పోసి సైకిల్ మీద తీసుకుపోయేటోడు. కానీ, ఒకసారి పోలీసులకు దొరికిపోయిండు. అట్ల వసురాం మీద నిఘా పెరిగింది. అందుకని దేవరకొండలో సారా దుకాణం కాడికి.. నేను స్కూలుకు పోయే అమ్మాయిలాగా, బ్యాగులో సారా ప్యాకెట్లు తీసుకుని పోయి ఇవ్వాలి. స్టూడెంట్ కాబట్టి పోలీసులు అనుమానించరని వసురాం తాత ఉపాయం. ఉదయం పది, సాయంత్రం పది లీటర్లు.. సీక్రెట్‌గా చేరవేస్తే రోజుకు వంద రూపాయలు ఇస్తనన్నడు. నాకది బానే అనిపించింది. కాలేజీ బ్యాగులో సారా ప్యాకెట్లు పెట్టుకొని, వసురాం తాత ఇచ్చిన సైకిల్ మీద పోయేదాన్ని. కాలేజీ అమ్మాయి అనుకొని ఎవరూ అనుమానించేవాళ్లు కాదు.

ఆరు నెలలు బానే గడిచింది. కాలం ఎప్పుడూ మన చేతుల్లో ఉండదు కద. ఎవరో ఎక్సైజ్ పోలీసులకు ఉప్పందించారు. నన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని స్టేషన్‌లో పెట్టారు. రెండు రోజులైనా వసురాం తాత కానీ, ఎవ్వరు కానీ జామీను ఇవ్వడానికి రాలేదు. పోలీసులు నేనే సొంతంగా సారా కాసి యాపారం చేస్తున్న అనుకొని పది వేలు లంచం అడిగినరు. రోజుకు వంద రూపాయల కూలీ చేసే నా దగ్గర పదివేలు ఎక్కడియి. కాళ్లావేళ్లా పడి మొక్కినా వదిలిపెట్టలేదు. ఆడపిల్లనని కూడా చూడకుండా కొట్టినరు. అప్పుడే ఆ స్టేషన్‌లోనే ఉండే కానిస్టేబుల్ సార్ పరశురాములు నా మీద కనికరం చూపించాడు. రెండు వేలు ఎస్సై చేతుల్లో పెట్టి నన్ను ఇంటికి పంపించాడు. పరశురాములు సార్‌కు రెండు చేతులతో కాళ్లు మొక్కి ఇంటికి చేరుకున్న.

ఇక నేనే సొంతంగా సారా కాయడం, అమ్మడం మొదలు పెట్టాను. పోలీసు కానిస్టేబుల్ పరశురాములు కూడా పరిచయం ఉండటంతో నెలనెలా పోలీసోళ్లకు మామూళ్లు ఇచ్చేదాన్ని. పరశురాములు సార్‌కు నా సారా అంటే ఇష్టం. ఘాటుగా, తాగంగనే మత్తుగా ఉంటదని నా సారా కోసం తండాకు వచ్చేవాడు. కొంత కాలానికి.. ''సారా కోసం కాదు.. నీకోసమే'' అని మనసులో మాట బైట పెట్టాడు. అట్ల మెల్లగా ఇద్దరి మధ్య సావాసం పెరిగింది. అన్నిరకాలుగా దగ్గరైపోయినం. మా అమ్మకానీ, తండా వాళ్లు కానీ.. వచ్చేది పోలీసు కాబట్టి ఎదురు చెప్పలేక పోయారు. పైగా నాతో పోలీస్ స్టేషన్‌లో పనుల కోసం పైరవీ చేయించుకునే వారు.

కొన్నాళ్లకు ఓరోజు నాలో ఇంకో ప్రాణం పెరుగుతున్న సంగతి అర్థమైంది. నేరుగా పోలీస్ స్టేషన్‌కు పోయి పరుశురాములుకి ఆ సంగతి చెప్పాను. సంతోషపడతాడు అనుకుంటే.. ఏమీ మాట్లాడకుండా ఆసుపత్రికి తీసుకొని పోయాడు. ''కడుపు తీసేస్కో!'' అన్నడు. నేను ఒప్పుకోలేదు. పెళ్లి చేసుకోమన్నాను.

''సారాయి అమ్ముకొనే బజారు దానివి నువ్వు. నీలాంటి వాళ్లు పదిమందితో పోతాను. వాళ్లందరిని పెళ్లి చేసుకుంటానా లం..'' అన్నాడు. ''నాకెప్పుడో పెళ్లయ్యింది. నాకు భార్య, పిల్లలు ఉన్నారు'' అని అప్పుడు బయట పెట్టాడు. నేను మొండికేసేసరికి అక్కడనే అందరి ముందూ కొట్టాడు.

''ఎక్కువ మాట్లాడితే సారా కేసులో మళ్లీ జైల్లో పెడతా'' అని బెదిరించి, భయపెట్టి మా తండాకు పంపించాడు. ఎంత మోసం చేసిండు. వీణ్ని నమ్మి ఎంతపని చేసిన. అదిగో అప్పుడే నాకు జీవితం మీద విరక్తి పుట్టింది. కన్నకష్టాలు పడి పెంచింది అమ్మ. ఏ ముఖం పెట్టుకొని అమ్మకు మొఖం చూపించను. నేను చేసిన తప్పు తెలిస్తే అమ్మ బతుకుతుందా..? అందుకే ఇంటికి పోయే ధైర్యం చేయలేదు. థూ.. నేను బతకడం దండగ. అందుకే చచ్చిపోవాలని అనుకున్నాను. ఇంకాసేపట్లో నేను చచ్చిపోబోతున్నాను.

* * *

ఎలా చచ్చి పోవడం.. బాయిలో దూకనా..? చెట్టుకు ఉరి పెట్టుకోవడమా..? ఆ క్షణంలో నేను

ఏ చెట్టుకైనా ఉరేసుకుందామని చూశాను. దూరంగా పెద్ద మోదుగు చెట్టు కనిపించింది. కొమ్మల నిండా నిప్పుల పూలు పూసినట్లు.. తళతళా మెరిసిపోతున్న మోదుగు చెట్టును చూస్తే ఏదో గుర్తుకు వచ్చింది. అదేంటో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాను. అప్పుడు తటాలున మెరుపు మెరిసినట్లు.. అమ్మ చిన్నప్పుడు చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి.

ఏం చేస్తున్నానో గుర్తులేదు. నేను చచ్చిపోవడం ఒకటే నాకు కావాల్సిందని.. పిచ్చి పట్టినట్లు, దయ్యం ఆవహించినట్లు అనిపించింది.

తండా పక్కనే ఉన్న అడివిలోకి నడుచుకుంటూ పోయాను. ఏ చెట్టుకైనా ఉరేసుకుందామని చూశాను. దూరంగా పెద్ద మోదుగు చెట్టు కనిపించింది. కొమ్మల నిండా నిప్పుల పూలు పూసినట్లు.. తళతళా మెరిసిపోతున్న మోదుగు చెట్టును చూస్తే ఏదో గుర్తుకు వచ్చింది. అదేంటో గుర్తు చేసుకోవడా నికి ప్రయత్నించాను. అప్పుడు తటాలున మెరుపు మెరిసినట్లు.. అమ్మ చిన్నప్పుడు చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి.

'ఎన్ని కష్టాలు వచ్చినా మోదుగు చెట్టులాగా తట్టుకొని నిలబడాలె బిడ్డా! వానలు వచ్చేదాక ఎదురు చూడాలె. చినుకు పడినంక మొక్కై ఎదగాలె. పెద్ద మానై.. వెయ్యి పూలు పూయాలె'.. అమ్మ చెప్పిన మాటలు మళ్ల మళ్ల యాదికొచ్చినయి. అప్పుడు ఆలోచించిన.. అసలు మోసం చేసింది వాడు. నమ్మడం నా తప్పు కాదు కదా. నేనెందుకు చావాలి? మోసం చేసినందుకు వాడుకదా చావాలి. పుట్టెడు కష్టాలు పడి సాకింది అమ్మ. ఆమె కోసమైనా బతకాలి అనుకొని సక్కగ ఇంటి దారి పట్టిన. ఇంటికొచ్చిన నాకు ఊహించని దెబ్బ. ఏం జరిగిందో ఏమో.. అమ్మ చనిపోయింది. నా కోసం ఉదయం నుంచి వెతుకుతున్నరట. ఐదుగురు బిడ్డలను కన్నా సాదుకొనే అదృష్టం దొరకని తల్లి. ఒక్కదాన్ని నన్ను కంటికి రెప్పలా పెంచుకున్న అమ్మ వెళ్లిపోయింది. ఏం జరుగుతున్నదో అర్థం కాలేదు. కుప్పకూలి పోయాను. అక్క, బావ వాళ్లు, తండా మనుషులు మిగిలిన పనులు పూర్తి చేసి వెళ్లిపోయారు.

* * *

అమ్మ పోయిన తర్వాత ఒంటరినయ్యాను. నేను పోలీసోడి మడిసిగా ఉన్నంత కాలం అంతా బాగున్నరు. ఎప్పుడైతే వాడితో చెడిపోయిందని తెలిసిందో.. అందరూ మారిపోయారు. నన్ను చూసే చూపు.. పిలిచే పిలుపూ మారిపోయింది. కొన్ని కొండ చిలువలు అర్ధరాత్రుళ్లు వచ్చి చుట్టుకోవడానికి తడకలు తీసేవాళ్లు. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి రాత్రుళ్లు అడివిలోకి పారిపోయేదాన్ని. అడవిలో పాములు, మృగాల కన్న తండా మనుషులే ఎక్కవ భయపెట్టేవాళ్లు.


ఎదిగీ ఎదగని వయసు. సరైన తిండి లేక నా ఒళ్లు పిండాన్ని మోయలేక పోయింది. పోలీసోడి పాపం.. రక్తం ముద్దలుగా వెళ్లిపోయింది. చానా రక్తం పోవడంతో ఆరునెలలు మంచంలో పడిపోయాను. తిండిపెట్టిన నాథుడు లేడు. అప్పడప్పుడు గవర్నమెంటు స్కూలు దగ్గర పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టే యాళ్లకు పోయి, వాళ్ల దగ్గర అన్నం అడుక్కొనేదాన్ని. అట్ల ఆరునెలలు నరక యాతన పడి మెల్లగా కోలుకున్నాను.

బతకడానికి సారా యాపారం కాకుండా ఏదైనా కష్టపడి పని చేయాలని అనుకున్నాను. అప్పుడే మా తండాలో అంగన్వాడీ సెంటర్ మొదలైంది. తండాలో పదో తరగతి చదివిన ఆడపిల్లను నేను ఒక్కదాన్నే ఉన్నాను. నాకు బతకడా నికి కూడా ఏమీ ఆధారం లేదని తండా పెద్దలు ఒక మార్గం చూపించారు.


అలా మెల్లగా నా జీవితం అంగన్‌వాడీ టీచర్‌గా మారింది. మా తండాలోనే ఖాళీ జాగాను బాగు చేసి, చిన్న పాక వేయించాను. నేనే పార తీసుకొని రాళ్లు రప్పలు తొలగించి.. పిల్లలకోసం ఆటస్థలం సిద్ధం చేశాను. చుట్టూ కంచె పాతాను. లోపల బంతి, చామంతి ఇలా చాలా పూలమొక్కలు పెంచాను. పిల్లలను తీసుకురావడం ఆడించడం, పాడించడం. ఇప్పుడు పిల్లలే నా లోకం. ఆ పిల్లలే నా పిల్లలు. అలా మెల్లగా నా గతాన్ని కుబుసంలా వదిలించుకొని కొత్త మనిషిగా తయారయ్యాను. జనాలు కూడా పాత సైదిని మర్చిపోయారు.

ఎన్ని కష్టాలు, ఎన్ని కన్నీళ్లు.. ఎక్కడో పురిట్లో ఆడపిల్లగా చనిపోవాల్సిన నేను. మా నాయిన కొట్టిన దెబ్బలకు ఏ బాయిలోనో దూకి సావాల్సిన నేను.. ప్రేమ పేరుతో మోసపోయిన నేను.. ఏ పేదరికమో, ఏ ఆకలితోనో.. ఏ మగపురుగులో కరిచి ఏనాడో మట్టిలో కలిసిపోవాల్సిన నేను.. అన్నిటినీ తట్టుకొని మోదుగు చెట్టులా నిలబడ్డాను. మోదుగు పువ్వులా నవ్వుతూ తండాలో పిల్లలకు తల్లిగా మారాను. ఒకనాడు గుడుంబా యాపారం చేసిన సైది.. ఇప్పుడు 'సైదమ్మ టీచర్' అయ్యింది. ■


## పి.చంద్రశేఖర్ (చందు తులసి)



చంద్రశేఖర్ స్వస్థలం సూర్యాపేట జిల్లాలోని బండమీది చందుపట్ల. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. జీవిత సహచరి 'తులసి' పేరుతో కలిపి 'చందు తులసి' కలం పేరుతో కథలు రాస్తుంటారు. సినిమా రంగంలోనూ రచయితగా పనిచేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల జీవితాలే ఈయన కథలకు ప్రధాన ఇతివృత్తాలు. 2015లో తొలికథ 'ఊరవతల ఊడలమర్రి' మంచి గుర్తింపు తీసుకొచ్చింది. 'నమస్తే తెలంగాణ బతుకమ్మ' సంచికలో వచ్చిన 'పాలపిట్టల పాట' కథ నేషనల్ బుక్‌ట్రస్ట్ యువ కథా సంకలనానికి ఎంపికైంది. వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమైంది. 'బతుకమ్మ పుట్టింది' కథ 'గుర్రాల లక్ష్మీ ప్రసాద్ అవార్డు' గెలుచుకున్నది. 'నీళ్ల బిందె', 'బుక్కెడు బువ్వ', 'తల్లి గారిల్లు' కథలు పలు కథా సంకలనాలకు ఎంపికయ్యాయి. గతంలో 'గడి', 'తక్కెడ' కథలకు నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం కథల పోటీల్లో బహుమతులు అందుకొన్నారు.




ఐదేండ్ల క్రితం.. మధ్యప్రదేశ్‌లోని ఒక రైల్వేస్టేషన్.
పెచ్చులూడి, పిచ్చిమొక్కలు మొలిచి, పాకురు పట్టి ఉండేది.
ప్లాట్‌ఫామ్‌లో పేడకంపు. గోడలనిండా పిచ్చిరాతలు.
ఈగలు, దోమలు, కీటకాలతో కిటకిటలాడేది!
ప్రయాణికులు పట్టుమని పది నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి.
ఓ యువకుడి చొరవ ఆ సమస్యను పరిష్కరించింది.



# అదిరెను స్టేషన్ స్టయిలే!







భవిష్యత్‌లో రైల్వేస్టేషన్లు చెత్త కేంద్రాలుగా మారతాయని భయపడ్డాడు ఇండోర్‌కు చెందిన నీలేశ్. ఒంటిచేత్తో రైల్వే ప్లాట్‌ఫామ్స్ సుందరీకరించాలనే ఆలోచన వచ్చింది అతనికి. స్నేహితుడితో చర్చించాడు. ఇద్దరూ రైల్వే అధికారులను కలిసి సుందరీకరణ ప్రతిపాదన చేశారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రోత్సహించే విధంగా త్రీడీ పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దేందుకు అనుమతి సంపాదించారు.

**ఐదుగురితో మొదలై..**

నీలేశ్ సివిల్ ఇంజినీర్. 'సత్రంగి క్రియేషన్స్' అనే సంస్థ ద్వారా భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నాడు. నీలేశ్ ఐడియా నచ్చడంతో అధికారులు ఐదు స్టేషన్ల కాంట్రాక్టు చేతిలో పెట్టారు. ఒకే ఒక్క షరతు.. రైల్వే నుంచి ఎలాంటి నిధులూ సమకూర్చరు. సొంతంగా ఖర్చు చేయాల్సిందే. అయినా వెనకడుగు వేయలేదు నీలేశ్. తనతోపాటే చదువుకున్న ఐదుగురు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులను పోగుచేసి పనులు ప్రారంభించాడు. చాలా తక్కువ బడ్జెట్‌తో రైల్వే స్టేషన్‌ను అందంగా మార్చాడు. దీంతో అధికారులు ఫిదా అయ్యారు. ఐదుగురితో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పుడు 145 మంది కళాకారులు ఉన్నారు.




**48 స్టేషన్ల సుందరీకరణ**

మొదటి ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో నీలేశ్‌పై రైల్వేశాఖకు పూర్తి నమ్మకం ఏర్పడింది. వార్తాపత్రికలు, టీవీ చానెల్స్ ద్వారా విస్తృత ప్రచారం జరగడంతో రెండో ప్రాజెక్ట్ వెతుక్కుంటూ వచ్చింది. అదే నీమచ్ రైల్వే స్టేషన్ సుందరీకరణ. నీమచ్ పట్టణం కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) ప్రధాన కేంద్రం కావడం విశేషం. సీఆర్‌పీఎఫ్ అధికారులు వెంటనే రూ.2.5 లక్షలు మంజూరుచేశారు. దీంతో రైల్వే శాఖలో నీలేశ్ బృందం త్రీడీ పెయింటింగ్స్ గురించి తెలిసిపోయింది. అలా వాళ్లు ఇప్పటివరకు 48 స్టేషన్లకు సొబగులద్దారు.

**పనికి గుర్తింపుగా..**

రైల్వేల సుందరీకరణ కోసం నీలేశ్ తన కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకున్నాడు. త్రీడీ పెయింటింగ్ ద్వారా స్థానిక దృశ్యాలను పరిచయం చేయడానికి రైలు బండ్లను మంచి మాధ్యమంగా భావించాడు. ఒక్కో స్టేషన్‌లో ఒక్కో విధమైన స్థానిక కుడ్య చిత్రాలను వేస్తున్నారు. నీమచ్ స్టేషన్‌లో నందన బ్లాక్ ప్రింటింగ్, ఇండోర్‌లో రాణి అహల్యాబాయి పెయింటింగ్, చిత్తోర్‌గఢ్‌లో రాణాప్రతాప్, ఘూమర్ జానపద నృత్యం, జల్గావ్‌లో అజంతా ఎల్లోరా పెయింటింగ్‌ను జోడించారు. నార్వే ఆర్ట్ కౌన్సిల్ నీలేశ్ బృందం వేస్తున్న త్రీడీ పెయింటింగ్స్‌ను గుర్తించింది. రైల్వే మంత్రిత్వ శాఖ కూడా నేరుగా ఒక ప్రాజెక్ట్ ఇచ్చింది. ■



# అందమైన.. ఆత్మవిశ్వాసం!

ఊబకాయం, బొల్లి మచ్చలు, డౌన్ సిండ్రోమ్.. సవాలక్ష సమస్యలు ఉండవచ్చు. అయితేనేం, క్యాట్‌వాక్‌లు మేమూ చేయగలమని అంటున్నారు కొత్తతరం మోడళ్లు. వీళ్ల ప్రభావంతోనే అందాల లోకానికి కమ్మిన పొరలు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. ఆ ఉత్సాహానికి కార్పొరేట్ల ప్రోత్సాహమూ తోడవుతున్నది. నిన్నటివరకూ క్యాట్‌వాక్ అంటే సౌందర్య ప్రదర్శన. ఇప్పుడు ఆత్మవిశ్వాస వ్యక్తీకరణ.


## ఎల్లీ గోల్డ్‌స్టెయిన్



బ్రిటిష్ మోడల్ ఎల్లీ గోల్డ్‌స్టెయిన్ కూడా డౌన్స్ సిండ్రోమ్ బాధితురాలే. గూచీ బ్యూటీ క్యాంపెయిన్‌లో వైకల్యం ఉన్న మొదటి మోడల్‌గా ప్రపంచ ఖ్యాతి పొందింది. 2017లో పర్సనల్ కేర్ బ్రాండ్ 'డవ్' కోసం బ్లైండ్ యూట్యూబ్ స్టార్ మోలీ బర్క్‌తో కలిసి ప్రచారం చేసింది. ఇప్పుడు గూచీ బ్యూటీ సంస్థలో మోడల్‌గా రాణిస్తున్నది.



## వర్షిత తటవర్తి



విశాఖకు చెందిన వర్షిత తటవర్తి ప్లస్ సైజ్ మోడలింగ్‌లో హవా కొనసాగిస్తున్నది. డిజైనింగ్ కంపెనీ సబ్యసాచి మోడల్‌గా గుర్తింపు తెచ్చుకున్నది. వివాదాస్పద మంగళసూత్ర యాడ్‌తో మరింత ప్రాచుర్యం పొందింది. చిన్ననాటి నుంచి సినిమాలు, మోడలింగ్‌పై ఆశపెట్టుకున్న వర్షిత.. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నది.

## సోఫియా జిరౌ

ఫ్యాషన్ ప్రపంచంలోనే 'విక్టోరియా సీక్రెట్' ఓ తిరుగులేని బ్రాండ్. అంతపెద్ద కంపెనీ ప్యూర్టోరికోకు చెందిన డౌన్ సిండ్రోమ్ బాధితురాలు సోఫియా జిరౌను మోడల్‌గా ఎంపిక చేసుకుంది. మోడలింగ్ ప్రపంచంలో ఇదొక పెద్ద సంచలనం. ఎలాంటి బిడియం లేకుండా ర్యాంప్‌పై హొయలు పోతూ.. తన కలల ప్రపంచాన్ని నిజం చేసుకున్నది సోఫియా.



## ప్రణవ్ బక్షి

19 ఏండ్ల భారతీయ మోడల్ ప్రణవ్ బక్షి.. ఆటిజం ఉన్న మొట్టమొదటి పురుష మోడల్‌గా చరిత్ర సృష్టించాడు. ఇన్నాళ్లూ తన రుగ్మతే తన శత్రువని అనుకున్న ప్రణవ్.. ఆ రుగ్మతతోనే మోడలింగ్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకొన్నాడు. యూఎస్ పోలో, బెనటన్, ఎఫ్‌బీబీ సంస్థల బ్రాండ్లకు బక్షి రాయబారి. టెడ్ఎక్స్ వేదికపై రెండుసార్లు ఉపన్యసించి ఎంతో మందికి స్ఫూర్తినిచ్చాడు.

## విన్నీ హార్లో



జమైకన్- కెనడియన్ ఫ్యాషన్ మోడల్ విన్నీ హార్లోకు చిన్ననాటి నుంచే బొల్లి వ్యాధి. అయినా, నిండైన ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తూ.. తానేమిటో నిరూపించుకున్నది. అనేక బ్రాండ్స్‌కు మోడల్‌గా వ్యవహరించింది. ల్యూకోడెర్మా (బొల్లి) బాధితులను అందరితో సమానంగా చూడాలని పోరాడుతున్నది. బొల్లి మచ్చలతో కూడిన ఆమె బొమ్మలు మార్కెట్‌లోకి వచ్చాయి.

## ప్రీషియస్ లీ

నల్లజాతీయురాలైన ప్రీషియస్ లీ ప్రపంచంలోనే మొట్టమొదటి 'బ్లాక్ ప్లస్ సైజ్ మోడల్'. లావుగా ఉన్నా ర్యాంప్‌లను షేక్ చేస్తున్నది లీ. ఇప్పటికే అనేక బ్రాండ్లకు మోడల్‌గా ఉన్నది. వర్ధమాన బ్లాక్ మోడల్స్‌కు తనే ఆదర్శం.





ఐఐటీ అబ్బాయి దొరకడం ఐఐటీ అమ్మాయి అదృష్టం. ఇద్దరికీ ఒకే లక్ష్యం కావడం, ఇద్దరూ ఆంత్రప్రెన్యూర్‌షిప్ స్వాప్నికులు కావడం ఇంకా ఇంకా అదృష్టం. ఓ కంపెనీలో కొలీగ్స్‌గా పరిచయమైన ఇద్దరూ డ్యూటీనే కాదు జీవితాన్నీ పంచుకుందామని అనుకున్నారు. ఒక్కటైన తర్వాత కొత్త ప్రయాణం మొదలుపెట్టారు. తాజాగా 'యూనికార్న్ క్లబ్'లో చేరారు.

# యూనికార్న్ జోడీ

రుచి కల్రా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో కెమికల్ ఇంజినీరింగ్ చదివింది. తర్వాత, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేసింది. వెను వెంటనే ఎవాల్యూసెర్వ్ అనే కంపెనీలో సీనియర్ బిజినెస్ అనలిస్ట్ ఉద్యోగం వరించింది. ఏడాదిన్నర పాటు కొలువు చేసిన తర్వాత మెకెన్సీ అండ్ కంపెనీకి మారింది. అక్కడే రుచి జీవితం మలుపు తిరిగింది. ఐఐటీలో తన కంటే రెండేండ్ల సీనియర్ అయిన ఆశిశ్ మహోపాత్ర పరిచయమయ్యాడు. ఇద్దరి ఆలోచనలూ, ఆశలు ఒక్కటే.. కెరీర్ పరుగులో, టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో ఒకరికొకరు పోటీపడ్డారు. ఈ పోటీలో స్పర్ధలు రాలేదు. ప్రేమ చిగురించింది. పెండ్లయింది. ఆ తర్వాత ఎక్కువ సంపాదన ఉన్న మగవాడు భార్యను ఇంటికే పరిమితం చేయడం చాలా కుటుంబాల్లో కనిపించే ప్రేమ. కానీ, ఆశిశ్ అలా కాదు. రుచిని ప్రోత్సహించాడు. ఉద్యోగం చేస్తూనే ఇద్దరూ సొంత బిజినెస్ కోసం కలలుకన్నారు. స్టార్టప్ స్థాపించాలనే ఆలోచనతో ఉద్యోగాలు వదులు కున్నారు.

**సక్సెస్ అంటే యూనికార్న్.. అనే అర్థం స్థిరపడిపోతున్నది. కానీ, భార్యా భర్తలు నడిపే స్టార్టప్స్ రెండూ యూనికార్న్ క్లబ్ లో చేరడం ఇదే మొదలు. ఈ విజయంతో రుచి కల్రా, ఆశిశ్ మహోపాత్ర సరిజోడని నిరూపించుకున్నారు. 'మనదైన ప్రపంచాన్ని నిర్మించుకుందామని తొలి రోజుల్లో కలలుగనేవాళ్లం. ఇప్పుడు అది నిజమైంది' అంటారు ఆ దంపతులు.**

### కొత్త కంపెనీ..

ఆశిశ్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి 'ఆఫ్‌బిజినెస్' అనే కంపెనీని స్టార్ట్ చేశాడు. ఇది తయారీ రంగానికి కావాల్సిన ముడి సరుకుల్ని అందించే స్టార్టప్. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన సిమెంట్, ఇనుము, రసాయనాలు, ధాన్యం, లోహాలు, పాలిమర్స్, టెక్స్‌టైల్స్ మొదలైనవాటిని ఆర్డర్ చేస్తే.. సకాలంలో డెలివరీ చేస్తుంది. ఆర్డర్లే కాదు చెల్లింపులు కూడా ఆన్‌లైన్‌లో చేసే అవకాశం ఉండటంతో మార్కెట్ బాగానే ఆదరించింది. గుర్‌గావ్ కేంద్రంగా ఉన్న ఈ కంపెనీలో 1000 మంది వరకూ పని చేస్తున్నారు. కొంతమంది కీలక ఉద్యోగులకు వాటాలిచ్చారు.

### చిన్న సంస్థలకు సహకారం

రుచి కల్రా కూడా సొంతంగా 'ఆక్సీజో ఫైనాన్షియల్ సర్వీస్' అనే స్టార్టప్‌ను స్థాపించింది. ఆక్సిజన్, ఓజోన్ అనే పదాలను జోడిస్తూ 'ఆక్సీజో' అనే పేరు పెట్టింది. చిన్న చిన్న వ్యాపారాలకు 'ఆక్సీజో' ప్రాణవాయువుతో సమానమైన డబ్బును సాయం చేస్తుంది కాబట్టి ఆ పేరును ఎంచుకుంది. ఇందులో వెంచర్ క్యాపిటలిస్టులు భారీగా పెట్టుబడులుపెట్టారు. ఏడాది క్రితం.. ఆఫ్‌బిజినెస్‌లో సాఫ్ట్ బ్యాంక్‌తో పాటు మరికొన్ని కంపెనీలు ఇన్వెస్ట్ చేయడంతో.. ఆపరేషన్స్ పెరిగాయి. దీంతో డిసెంబరు నాటికి ఆఫ్ బిజినెస్ మార్కెట్ విలువ 5 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ మధ్యనే ఆక్సీజో కూడా భారీ పెట్టుబడులను ఆకర్షించింది. ఆ పెట్టుబడులతో కంపెనీ మార్కెట్ విలువ బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో రెండు స్టార్టప్‌లు యూనికార్న్ క్లబ్‌లో చేరాయి. భారతదేశంలో భార్యా, భర్తలు స్థాపించిన స్టార్టప్స్ చాలానే ఉన్నాయి. చాలానే విజయవంతం అయ్యాయి. కానీ, వాటిల్లో ఇలా రెండూ యూనికార్న్ క్లబ్‌లో చేరిన స్టార్టప్స్ మాత్రం లేవు. అలాంటి డబుల్ సక్సెస్ సాధించిన జోడీ... రుచి కల్రా, ఆశిశ్ మహోపాత్ర ఒక్కటే! ■



# రాశి ఫలాలు

10.4.2022 నుంచి 16.4.2022 వరకు


**గుడి ఉమామహేశ్వరశర్మ సిద్ధాంతి**
ఎం.ఎస్సీ., నిర్మల్ పంచాంగకర్త
నల్లకుంట, హైదరాబాద్., సెల్: 9885096295
ఈ మెయిల్ : nirmalsiddhanthi@yahoo.co.in




## మేషం



ప్రారంభించిన పనులు అనుకున్న సమయంలో పూర్త వుతాయి. వ్యాపార లావాదేవీలు సంతృప్తికరంగా ఉంటాయి. నలుగురికి సాయం చేస్తారు. ఉద్యోగులు అధికారుల అండదండలు పొందుతారు. కుటుంబ పెద్దల సహకారం లభిస్తుంది. వివాహాది శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆధ్యాత్మిక ప్రవచనా లకు హాజరవుతారు. భక్తి పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటారు. అనవసరమైన ఆలోచనలను పక్కన పెట్టి, పనులపై మనసు నిలుపుతారు. పెట్టుబడులకు ప్రతిఫలాలను పొందుతారు. ఆస్తుల మూలంగా ఆదాయం పెరుగుతుంది. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. విద్యార్థులకు ఈ వారం కలిసి వస్తుంది.

## వృషభం



దినచర్యలో మార్పుల వల్ల మేలు కలుగుతుంది. తీర్థ యాత్రలు, విహారయాత్రలు చేపడతారు. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. కొత్త ఉద్యోగంలో చేరతారు. అధికారుల సహకారం లభిస్తుంది. భూములు, వాహనాల వల్ల పనులు నెరవేరుతాయి. వ్యవసాయ దారులకు కలిసివస్తుంది. ఉద్యోగంలో పదోన్నతికి అవకాశం. కుటుంబంతో సంతోషంగా కాలం గడుపుతారు. అయితే, అనవసరమైన చర్చలు ముందుకు రావచ్చు. ఆత్మీయుల సహ కారంతో శుభకార్య ప్రయత్నాలు ముందుకుసాగుతాయి. నిలిచిపోయిన పనుల్లో కదలిక వస్తుంది. ఉత్సాహంతో ఉంటారు. ఆరోగ్యంపై శ్రద్ధ నిలుపుతారు. కొత్త అవకాశాలు వస్తాయి. ఖర్చులు పెరిగినప్పటికీ, అందుకు తగ్గ ఆదాయమూ ఉంటుంది.

## మిథునం



కుటుంబసభ్యులతో చర్చించి నిర్ణయాలు తీసుకుం టారు. వృథా ఖర్చులు ఉంటాయి. అయితే రావలసిన డబ్బు సమయానికి చేతికి అందడంతో ఊరట లభి స్తుంది. ప్రయాణాల వల్ల కార్యసాఫల్యం ఉంటుంది. మానసికంగా స్థిరంగా ఉంటారు. ఉత్సాహంతో పనులు చేస్తారు. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. వ్యాపారం నిరాటంకంగా కొనసాగుతుంది. భాగస్వాముల మధ్య మంచి అవగాహన ఏర్పడుతుంది. కొత్త వ్యాపారంపై మనసు నిలు పుతారు. న్యాయ సమస్యలను అధిగమిస్తారు. వ్యవసాయదారులకు అను కూల సమయం. భూలావాదేవీలు సజావుగా సాగుతాయి. బంధుమిత్రు లతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఆత్మీయులతో పనులు నెరవేరు తాయి. అనవసర వాదనలకు దూరంగా ఉండండి.

## కర్కాటకం



పాత బాకీలు వసూలు అవుతాయి. బంధుమిత్రుల రాకతో ఇంట్లో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. ఖర్చులు పెరుగుతాయి. ఉత్సాహంతో ఉంటారు. ఆరోగ్యము నిలకడగా ఉంటుంది. అనవ సరమైన విషయాలపై మనసు నిలపకుండా పనులు పూర్తిచేస్తారు. విద్యార్థులకు కష్టే ఫలి అన్న చందంగా ఉంటుంది. వివాహాది శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆస్తుల విషయంలో పురోగతి ఉంటుంది. తీర్థయాత్రలు, విహారయాత్రలను చేపడతారు. ప్రయాణాలు అనుకూలిస్తాయి. ఇంటికి కావలసిన వస్తు వులు కొనుగోలు చేస్తారు. కళాకారులకు కొత్త అవకాశాలు వస్తాయి.

## సింహం



శుభకార్యాలు చేస్తారు. ప్రారంభించిన పనులు అను కూలిస్తాయి. స్నేహితులు, ఆత్మీయులతో పనులు నెరవే రుతాయి. ఆదాయం స్థిరంగా ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. ఆఫీసులో అధికారుల అండ దండలు లభిస్తాయి. అయితే తోటివారితో మనస్పర్థలు ఉండవచ్చు. నలుగురిలో మంచిపేరును పొందుతారు. పెట్టుబడులకు అనుకూల సమయం. రావలసిన సొమ్ము చేతికి అందుతుంది. కుటుంబంతో సంతోషంగా ఉంటారు. విద్యార్థులు రాణిస్తారు. సాహితీవేత్తలకు, సంగీతకారులకు మంచి సమయం. గృహ నిర్మాణాది కార్యక్రమాలను చేపడతారు. విందులకు హాజరవుతారు. కోర్టు కేసులలో సత్ఫలితాలు ఉంటాయి.

## కన్య



ఊహించని ఖర్చులతో ఇబ్బందులు ఎదురు కావచ్చు. స్నేహితులు, బంధువుల మూలంగా పనులు నెరవేరు తాయి. విద్యార్థులు శ్రమించాల్సిన సమయం. సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరవుతారు. వ్యాపార భాగస్వాముల మధ్య అవగాహన పెరుగు తుంది. అనుకూల నిర్ణయాలను తీసుకుంటారు. కొత్త దుస్తులు, వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆదాయంలో అస్థిరత ఉండవచ్చు. ముందుచూపుతో పనులు నిర్వర్తిస్తారు. దూరపు ప్రయాణాలు వాయిదా వేసుకుంటారు. అనవసర ఆలోచనలను పక్కన పెట్టి, కార్య నిర్వహణపై మనసు నిలపాలి. గౌరవ మర్యాదలు లభి స్తాయి. స్థిరాస్తి వల్ల ఆదాయం కలిసి వస్తుంది. పారిశ్రామికవేత్తలకు కార్మికుల సహకారం లభిస్తుంది. న్యాయసమస్యలను అధిగమిస్తారు.

## తుల



ప్రారంభించిన పనులు అనుకున్న సమయంలో పూర్తిచే స్తారు. కుటుంబంలో అందరి సహకారం లభిస్తుంది. అయితే అనుకోని ఖర్చుల వల్ల కొన్ని పనుల్లో జాప్యం జరుగుతుంది. ఖర్చుల నియంత్రణ అవసరం. విద్యా ర్థులు చదువులో రాణించి, మంచి సంస్థల్లో చేర తారు. అవసరానికి డబ్బు అందకపోవడం వల్ల కొత్త పనులు వాయిదా పడవచ్చు. శుభకార్య ప్రయత్నాలు అను కూలిస్తాయి. ప్రయాణాల వల్ల అలసట ఏర్పడుతంది. వివాదాలకు దూరంగా ఉండాలి. వ్యాపారులకు భాగస్వాములతో సత్సంబంధాలు ఏర్పడతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. పనులపై మనసు నిలుపుతారు. ఆత్మీయులతో పనులు నెరవేరుతాయి. కొత్త పరిచ యాలతో పనులు నెరవేరుతాయి.

## వృశ్చికం



రుణబాధలు తొలగిపోతాయి. పనుల్లో జాప్యం. కొత్త వస్తువులు కొంటారు. అందరి సహకారం లభిస్తుంది. నిర్మాణ కార్యక్రమాలపై మనసు నిలుపుతారు. శుభ కార్యాలకు అనుకూలం. కోర్టు కేసులలో అనుకూల ఫలితాలు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ముందుకు సాగుతాయి. అంద రితో స్నేహంగా ఉంటారు. వివాదాలలోకి వెళ్లకుండా పను లను పూర్తి చేయడంపై మనసు నిలుపుతారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. ఇంట్లోవారితో చర్చించి, సమయానుకూల నిర్ణ యాలు తీసుకుంటారు. పారిశ్రామికవేత్తలకు, వ్యవసాయదారులకు, రాజకీయ నాయకులకు వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది.

## ధనుస్సు




ఆదాయం స్థిరంగా ఉంటూ, క్రమేణా పెరుగుతుంది. పనులు సకాలంలో పూర్తవుతాయి. ఉత్సాహంగా ఉంటారు. రావలసిన సొమ్ము పాక్షికంగా అందుతుంది. అనుకోని ఖర్చులు ముందుకు వస్తాయి. వివాదాల వల్ల కొన్ని పనుల్లో ఆటంకాలు ఎదురవుతాయి. భూముల వ్యవహారంలో జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు కలిసి వస్తాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తోటి ఉద్యోగులతో మన స్పర్ధలు రావచ్చు. సంయమనం అవసరం. అధికారులతో స్నేహంగా ఉంటారు. విద్యార్థులకు అనుకూలం. పెద్దలతో చర్చించి, నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులకు భాగస్వాములతో మంచి అవగాహన ఏర్పడుతుంది. కోర్టు కేసులలో అనుకూల ఫలితాలు వస్తాయి.

## మకరం



శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. అనవసరమైన ఆలోచనలను పక్కన పెట్టి, కార్య నిర్వహణపై మనసు నిలుపుతారు. వివాదాలకు దూరంగా ఉంటూ, సంయమనంతో పనులు నెరవేర్చుకుంటారు. ఉద్యోగులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. ఆదాయంలో అస్థిరత మూలంగా కొన్ని పనులలో జాప్యం జరగవచ్చు. విద్యార్థులకు అనుకూలం. పెద్దల సహకారం లభిస్తుంది. పెట్టుబడులకు ప్రతిఫలాలు అందుతాయి. విందులు, వినోదాలపై మనసు నిలుపుతారు. విహారయాత్రలు, తీర్థయాత్రలు చేపడతారు. ఆత్మీయులతో కొన్ని పనులు నెరవేరినా, మనస్పర్ధలు రావచ్చు. జాగ్రత్త మంచిది.

## కుంభం



ఉత్సాహంతో పనులు చేస్తారు. పనిభారంతో అలసట పెరుగుతుంది. ఇంట్లో సంతృప్తికరమైన వాతావరణం ఉంటుంది. కొత్త వ్యక్తుల పరిచయాలతో ఖర్చులు పెరుగుతాయి. కుటుంబంతో సంతృప్తిగా ఉంటారు. అనుకోని ఖర్చులు ముందుకొస్తాయి. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. పలుకుబడితో కొన్ని పనులు నెరవేరుతాయి. వ్యాపారం లాభసాటిగా ఉంటుంది. పెద్దల సహకారం లభిస్తుంది. భక్తి పెరుగుతుంది. ఆదాయాన్ని పెంపొందించుకునే ఆలోచన చేస్తారు. కోర్టు కేసులలో అనుకూల ఫలితాలు ఉంటాయి. వ్యాపార విస్తరణ వాయిదా పడుతుంది. కొత్త పనులను ప్రారంభించడానికి ఆర్థిక వనరుల కొరత ఉంటుంది. ఓపికతో పనులు పూర్తి చేసుకోవడం అవసరం.


## మీనం



గృహ నిర్మాణాది కార్యక్రమాలు చేపడతారు. తొందరపాటు నిర్ణయాలతో పనులలో జాప్యం ఉండవచ్చు. భక్తి పెరుగుతుంది. ఇంట్లో అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపార విస్తరణపై మనసు నిలుపుతారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. చదువులో రాణిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. కోర్టు కేసులలో అనుకూల ఫలితాలు ఉంటాయి. రాజకీయ, ప్రభుత్వ పనులలో ఫలితాలు అనుకూలంగా ఉంటాయి. వివాదాలలోకి వెళ్లకుండా సంయమనంతో పనులు పూర్తి చేస్తారు. రోజువారీ కార్యకలాపాలు లాభసాటిగా ఉంటాయి. విశ్వాసంతో పనులు చేస్తారు. శుభకార్యాల కారణంగా ఖర్చులు పెరగవచ్చు.

# మెత్తబడిపోతున్నా.. తండ్రిని కాగలనా?

సెక్సాలజీ



**వివాహమై నాలుగేండ్లు దాటింది. నాకు 34 సంవత్సరాలు. ఆమెకు 30. ఇప్పటికీ ఇద్దరం శృంగారంలో పూర్తి స్థాయిలో పాల్గొనలేక పోతున్నాం. అంగప్రవేశం అయిన వెంటనే మెత్తబడుతున్నది. ఇలా అయితే పిల్లలు పుడతారా? అసలు ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?**

**- ఆర్.వి.,** వరంగల్

మీ అసలు సమస్య అంగస్తంభన లోపం. ఒకవేళ అంగప్రవేశం తర్వాత అంగం మెత్తబడి వీర్యస్ఖలనం అయితే.. వీర్యకణాలు బాగుంటే కచ్చితంగా పిల్లలు పుడతారు. మీరు అంగస్తంభన సమస్యను పరిష్కరించుకోవాలి. ఈ సమస్యకు శారీరక కారణాలను రక్త పరీక్షల ద్వారా, డాప్లర్ పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. ఒకవేళ మీది మానసిక కారణాల వల్ల వచ్చిన సమస్య అయితే సెక్సాలజిస్టును కలవాలి. మీది 'పెనెట్రేషన్ ఫోబియా' కావచ్చు. ఒకసారి వీర్య పరీక్ష చేయించుకోండి. మీ భార్య కూడా మీతోపాటు పెల్విస్ స్కానింగ్ చేయించుకోవాలి.

* * *

**నాకు పెండ్లయి ఆరు నెలలు అవుతున్నది. నా భర్త ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. రోజూ రాత్రి 11 గంటలకు ఇంటికి వస్తారు. నా భర్తతో సెక్స్ చేస్తుండగా ఒక విషయం గమనించాను. తనకు హస్తప్రయోగం అలవాటుంది. రోజూ కనీసం 6 సార్లు చేస్తారు. తనకు బీర్జాలు ఒకటి కిందికి, మరొకటి పైకి ఉన్నాయి. నాకెందుకో భయంగా ఉంది. రోజూ ఉదయం జాగింగ్, జిమ్‌కు వెళ్తారు. బీర్జాల్లో నొప్పి ఉందని కొన్ని రోజులు మందులు కూడా వాడారు. ఆయన పోలీస్ జాబ్ కోసం ప్రిపేర్ అవుతున్నారు. అయితే, ముందుముందు తనకు ప్రాబ్లమ్ కాదు కదా? ఈ సమస్యకు మీరే పరిష్కారం చూపాలి.**

**- ఎ.ఎమ్.,** హైదరాబాద్

మీవారి గురించి అనవసరంగా ఆందోళన పడుతున్నారు. వివాహం తర్వాత కూడా ఆయన హస్తప్రయోగం అలవాటు మానలేకపోవడం మంచిది కాదు. భార్య నెలసరిలో ఉండగా చేసుకోవచ్చు. కానీ, తను ఉండగా కూడా ఆ రకంగా చేసుకొంటే.. భార్య ఆత్మవిశ్వాసం దెబ్బతినడమే కాదు, అవమానంగా భావిస్తారు కూడా. ఇక బీర్జాల్లో ఒకటి కిందికి, ఒకటి పైకి ఉండటం మామూలే. ఇక నొప్పికి సంబంధించి ఏవో మాత్రలు సొంతంగా వాడటం మంచిది కాదు. స్క్రోటల్ కలర్ డాప్లర్.. అంటే బీర్జాల స్కానింగ్ తీస్తే నొప్పికి కారణాలు తెలుసుకోవచ్చు. మీవారిని పోలీస్ డిపార్ట్‌మెంట్ పరీక్షలకు ముందే.. ఒకసారి యూరాలజిస్ట్‌ను కలవమని చెప్పండి.

**డా. భారతి** (ఎమ్మెస్)
మారిటల్ కౌన్సిలర్, సైకోథెరపిస్ట్,
జయా హాస్పిటల్
బీ.ఎన్. రెడ్డి నగర్ క్రాస్‌రోడ్, హైదరాబాద్
bharathid506@gmail.com, 7989227504

# వాస్తు

సుద్దాల సుధాకర్ తేజ
suddalavasthu@gmail.com
Cell: 7993467678



■ **మన కష్టాలకు ఇతరులు కారణమా? లేదంటే, మన ఇల్లు కారణం అవుతుందా?**
**- ఎం. వాణి,** మేడ్చల్

చాలామంది తమకు ఎదురయ్యే సమస్యలన్నిటినీ ఎదుటివారి మీదికి నెట్టేస్తూ ఉంటారు. లేదంటే, తమకు అదృష్టం లేదని సర్దుకుంటారు. కానీ, తమ ప్రారబ్దాలు, స్వయంకృతాపరాధాలతోనే ఆపదలు, సమస్యలు వస్తున్నాయని ఆలోచించరు. 'మన పనులే మనకు సంకెళ్లు' అనేది అర్థం చేసుకోవాలి. ఇల్లు కారణం ఎప్పుడు అవుతుందంటే.. ఇంటిని ఇష్టాయిష్టాలతో కట్టుకుంటారు. ఏ పనికైనా.. 'ఇది చేయదగినదా?' కాదా? అని ఆలోచించరు. అవసరం, ఇష్టం అనేవి వ్యక్తి కష్టాలకు ప్రధాన భూమికలు అవుతాయి. ఈ ఇల్లు నచ్చింది, ఈచోట మంచి 'వ్యూ' ఉందని (ఆ అందమైన నైరుతి లోయ పాతాళంలోకి తీసు కెళ్తుంది అని చెప్పినా వినరు) వెంటనే కొనేస్తారు. మనసే చెడ్డ ఇంటిని కొనిపి స్తుంది. చెడు పనులు మళ్లీమళ్లీ చేయిస్తుంది.







■ **నైరుతి గోడ గుండ్రంగా కట్టొచ్చా? నైరుతి హద్దుమీద ఇల్లు ఉన్నది. పక్కన మురికి కాలువ ఉంది. ఇలా ఉంటే మంచిదేనా?**
**- బి.సరిత,** సంగారెడ్డి

ఇంటి పరిసరాలు ఎప్పుడూ బాగుం డాలి. ముఖ్యంగా మురికి కాలువలు, చెత్త కుప్పలు, పెంట కుప్పలు, మురుగు నీటి నిలువలు ఉండకుండా చూసి కట్టుకోవాలి. మీ గృహానికి హద్దు ఉందని, దానికి దక్షిణం కాలువ ఉందని అంటున్నారు. అది చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రధానంగా ఇంటి సభ్యులకు అనారోగ్యాలు, ఆపరేషన్లు, కీళ్ల సమస్యలు అధికంగా ఉంటాయి. మీరు అవకాశం చూసుకొని ఇల్లు మారడం మంచిది. కాలువను ఆనుకొని ఉన్న మహల్ కన్నా దూరంగా ఉండే గుడిసె చాలా గొప్పది. ఇకపోతే నైరుతి గోడ గుండ్రంగా కట్టకూడదు. కోణంతోనే ఉండాలి. కొన్ని చౌరస్తాల్లో మూలలు గుండ్రంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. మున్సిపల్ వారు కూడా అలా సూచనలు చేస్తుంటారు. అలాంటప్పుడు లోపలిభాగం మూలమట్టానికి కట్టుకొని, బయటివైపు 'గుండ్రంగా' చేసుకోవచ్చు.

■ **మా ఊరి చుట్టూ కోటగోడ ఉంది. అలాంటి ఊరిలో ఉండకూడదని అంటున్నారు. నిజమా?**
**- ఎ. యశోద,** కొడంగల్

ఆ అభిప్రాయం పూర్తిగా తప్పు. వాస్తు సమ్మతమూ కాదు. ఆనాటి పాలకులు వివిధ కారణాలతో తమ ప్రాంతం లేదా గ్రామం చుట్టూ ప్రాకారాలు కట్టేవారు. దీనివల్ల దోపిడి ముఠాల నుంచీ, శత్రు రాజ్యాల నుంచీ రక్షణ లభించేది. శాంతిభద్రతల సమస్య కూడా ఉండేది కాదు. ఇదీ ఆనాటి పాలనా దక్షత. అలాంటి ప్రాంతాలలో ఇప్పుడు ప్రజలు ఇండ్లు కడుతున్నారు. ఊళ్లకు గోడలు, బురుజులు ఉండటం చాలా సాధారణం. అలాగని ఆ పల్లెల్లో, ప్రాంతాల్లో ఇండ్లు కట్టొద్దనడం 'తెలియని తనం'. మీరు మీ ఇంటి స్థలాన్ని ఎంచుకొని మంచి కాంపౌం డుతో శాస్త్రబద్ధంగా కట్టుకోండి. మనం ఉంటున్న ఊరికి ప్రాకారం ఇంకా చెదిరి పోకుండా ఉందంటే మంచిదే కదా! శుభం కలుగుతుంది.





■ **వాయవ్యం ఎంత ఎత్తు ఉండొచ్చు? మాకు ఉత్తరం, పడమర రోడ్లు ఉన్నాయి. ఫలితాలు ఎలా ఉంటాయి? దయచేసి చెప్పండి.**
**- ఎం. కోమలి,** చాడ


ఈ బ్లాకు ఆగ్నేయం బ్లాకు కన్నా ఫలితాలలో ముందు ఉంటుంది. దానికి ఉన్న వీధులలో ఉత్తరం, ఈశాన్యం పెరిగి, విశాలమైన వీధి అయితే చాలా మంచిది. ఈ బ్లాకు ఫలితాలు స్త్రీలమీద, ఇంటిలోని మూడవ సంతానం మీద ఉంటాయి. చివరి సంతానంపైనా ఉండవచ్చు. ఈ బ్లాకులోని ఆయా దిక్కుల మూలలు పెరగడం, తరగడం మీద ముఖ్యంగా 'శత్రు - మిత్ర' ఫలితాలు ఉంటాయి. వాయవ్యం పెరిగితే తగాదాలు, కోర్టు వ్యవహారాలు నడుస్తూ ఉంటాయి. వాయవ్యం ఎత్తు అనేది నైరుతి, ఆగ్నేయ భాగం కన్నా పల్లంగా ఉండాలి. ఈశాన్యం కన్నా ఎత్తుగా ఉండాలి.

**మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా**

'బతుకమ్మ', నమస్తే తెలంగాణ దినపత్రిక,
ఇంటి.నం: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం.
రోడ్ నం: 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034.


హెల్త్ బిట్స్

# క్యాన్సర్‌కు మందు



**ప్రపంచ** ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఏటా కోటి మంది క్యాన్సర్‌తో చనిపోతున్నారు. ఆ మహమ్మారి వల్ల శారీరకంగా కలిగే ఇబ్బందులు, చికిత్సకు అయ్యే ఖర్చు, ఆత్మీయుల మనోవ్యథ.. లెక్కలకు అందనివి. ఇలాంటి పరిస్థితుల్లో క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ఓ అరుదైన చికిత్సకు శ్రీకారం చుట్టింది. RAS అనే జన్యువులో మార్పుల వల్ల ఎన్నో రకాల క్యాన్సర్లు వస్తున్నాయనీ, క్యాన్సర్ మరణాల్లో నాలుగో వంతు దానివల్లే సంభవిస్తున్నాయనీ గమనించింది. ఈ జన్యువును అరికట్టేందుకు ఇప్పటికే cobimetinib అనే మందు అందుబాటులో ఉంది. అయితే ఈ ఔషధం క్యాన్సర్ కణాలతోపాటు, ఇతర ఆరోగ్యవంతమైన కణాలను కూడా ప్రభావితం చేస్తుంది. వేగంగా మార్పు చెందే చర్మం లాంటి కణజాలాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఇందుకు విరుగుడుగా ఓ ఉపాయాన్ని కనుగొన్నారు పరిశోధకులు. RAS కణాలలో 'ఫెర్రస్ ఐరన్' అనే పోషకం చాలా ఎక్కువగా ఉన్నట్టు తెలుసుకున్నారు. ఐరన్‌ను గమనించే జీవ సెన్సర్లు cobimetinibకు జోడించడం వల్ల.. ఎలాంటి కణాల మీద దాడిచేయాలో దానికి నిర్దేశించే ప్రయత్నం చేశారు. ఈ పరిశోధన విజయవంతం కావడంతో... TRX-cobimetinib అనే సరికొత్త ఔషధం విపణిలోకి రానుంది.

# బాల్యంలో గాయం... ఊబకాయం?




**చిన్నప్పుడు** మనం ఎదుర్కొన్న మానసిక బాధలే ఊబకాయానికి దారితీస్తాయా? అవి ఏకంగా మన జన్యువులను దెబ్బతీస్తాయా?.. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా అవుననే అంటున్నారు పరిశోధకులు. అధ్యయనం కోసం వాళ్లు 16 వేల మందిని ఎంచుకున్నారు. వీళ్లందరినీ 'పద్దెనిమిది ఏండ్ల లోపు మీరు తీవ్రమైన మానసిక బాధను అనుభవించారా?' అని అడిగారు. తల్లిదండ్రులతో సత్సంబంధాలు లేకపోవడం, తట్టుకోలేని ఆకలి, లైంగిక వేధింపులు... తదితర చేదు అనుభవాల గురించి తెలుసుకున్నారు. ఆశ్చర్యంగా బాల్యంలో మానసికంగా గాయపడినవారే, భవిష్యత్తులో ఊబకాయంతో బాధపడుతున్నట్టు తేలింది. అంతేకాదు! స్కిజోఫ్రేనియా లాంటి తీవ్రమైన సమస్యలకు దారితీసేంతగా వారి జన్యువులు ప్రభావితం అయ్యాయని బయటపడింది. లేత వయసులో ఎదురయ్యే బాధలు... ఊహించని పరిణామాలకు దారితీస్తాయని ఈ పరిశోధనతో తేలిపోయింది. కాబట్టి పిల్లల పెంపకం విషయంలో మరింత సున్నితంగా ఉండాలనీ, మానసిక సమస్యలను పరీక్షించే సమయంలో వారి బాల్యం గురించి కూడా తెలుసుకోవాలని చెబుతున్నారు.



# వీడియో గేమ్‌తో పక్షవాతానికి చికిత్స

**బ్రెయిన్** స్ట్రోక్ వచ్చిన తర్వాత శరీరం మీద పట్టు సాధించడం అంత తేలిక కాదు. ముఖ్యంగా కాళ్లు, చేతులు మునుపటి స్థితికి చేరుకోవడం అసాధ్యంగా తోస్తుంది. ఆ కాస్త మార్పు కోసం కూడా శ్రమ కలిగించే వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. ఫిజియోథెరపీ కోసం గంటలకొద్దీ సమయాన్నీ, డబ్బును ఖర్చుపెట్టాలి. ఇందుకు విరుగుడుగా మిసోరి-కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధకులు ఓ ఉపాయాన్ని కనిపెట్టారు. 'రికవరీ ర్యాపిడ్స్' అనే ఆటను రూపొందించారు. ఇందులో భాగంగా ఆటగాడు తాను ఒక పడవను నడుపుతున్నట్టు అనుభూతి చెందుతాడు. తెడ్లు వేయడం, స్టీరింగ్ తిప్పడం, అడ్డుగావచ్చే ఆకులను చేతితో తప్పించడం.. వగైరా చర్యలను ఊహించుకుంటూ... తదనుగుణంగా కదలాలి. ఆట ముందుకు కదిలే కొద్దీ మరిన్ని సవాళ్లు ఎదురవుతాయి. సరదాగాను, కాలక్షేపంగాను అనిపించే ఈ ఆటవల్ల అవయవాలలో అనూహ్యమైన చైతన్యాన్ని గమనించారు. ఓవైపు ఈ ఆట ఆడుతూనే.. వైద్యుడి పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే మంచి ఫలితాలే ఉంటాయి.




# ఒత్తిడిని తగ్గించే యంత్రం

**ఒత్తిడి...** ఇప్పటి జీవితంలో అనివార్యంగా మారిపోయింది. ఆ అలజడి మన ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. చిన్న వయసులోనే అనేక రుగ్మతలను పరిచయం చేస్తున్నది. దీనికి మందులు వాడినా, ఎన్నో కొన్ని దుష్ఫలితాలు ఖాయం. పోనీ చికిత్స తీసుకుందామంటే అందరికీ అందుబాటులో ఉండే విషయం కాదు. అందుకే పరిశోధకులు ఓ కొత్త యంత్రాన్ని కనుగొన్నారు. ఒక చిన్న దిండులో అమర్చిన ఈ యంత్రాన్ని మన గుండెకు అదుముకుని ఉంచితే... అది మన శ్వాస వేగం నిదానించేలా తగిన సూచనలిస్తుంది. ఈ యంత్రం ఎంతవరకు పనిచేస్తుందన్నది తెలుసుకునేందుకు 129 మంది విద్యార్థుల మీద ప్రయోగించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడితో ఉంటారు కాబట్టి... ఈ దిండు వాళ్ల ఆందోళనను ఏ స్థాయిలో తగ్గిస్తుందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఊహించినట్టుగానే ఈ పరికరం సానుకూల ఫలితాలను అందించింది.

# పుస్తక సమీక్ష

## హాస్యరస ప్రధానం అష్టాదశ కథల సంకలనం




**అర్జునుడికి** గీతోపదేశం చేస్తూ 'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితాః' అన్నాడు శ్రీకృష్ణ పరమాత్మ 15వ అధ్యాయం పురుషోత్తమప్రాప్తి యోగంలో. శరీరంలో జఠరాగ్ని రూపంలో పరమాత్ముడు మనం తినే నాలుగు రకాలైన అన్నాలను జీర్ణం చేస్తున్నాడని అర్థం. అలాంటి గంభీరమైన భగవద్గీతను సరదాగా దోసకాయకు అన్వయిస్తూ నేతి సూర్యనారాయణ శర్మ రాసిన కథ 'శ్రీదోసగీత'. 'కూరలన్నిట్లో శ్రేష్ఠమైనది ఏది?' అని అర్జునుడు అడిగిన ప్రశ్నకు సూక్ష్మంలో మోక్షంలా కృష్ణుడి చేత చేయించిన ఉపదేశమే దోసగీత. ఉపదేశంలో దోసకు కర్కటి, చర్మటికా, ఉర్వారుకం అన్న మారుపేర్ల గురించి రచయిత వివరించిన మూడు కథలు పాఠకుల ముఖాలకు నవ్వులు పులుముతాయి. 'శ్రీదోసగీత'ను వైవిధ్యంతో కూడిన తన 18 కథల సంపుటికి శీర్షికగా ఎంచుకోవడంతోనే పాఠకులను హాస్యరసంలో ఓలలాడించాలన్న రచయిత లక్ష్యం వెల్లడవుతుంది. పాండవుల అజ్ఞాతవాసం నేపథ్యంలో భీముడు సృష్టించిన వంటకమే 'పాఠోళీ' అని నిరూపిస్తూ, పాఠోళీ గురించి అధ్యయనం చేయడానికి సాక్షాత్తూ భీముడే ఆగ్రా సమీపంలో 'పాఠోళీ' అనే గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడనే ఇతివృత్తంతో సరసంగా సాగించిన కథ 'భారతంలో పాఠోళి'. వంటలను సంప్రదాయబద్ధంగా చేసే హోటల్ బాబాయ్ జీవితాన్ని వివరిస్తూ హాస్య ప్రధానంగా సాగిన కథ 'తెలుగు ఫలహారం', ముక్కును వస్తువుగా తీసుకొని హాస్యాన్ని పండించిన కథ 'ముక్కు పురాణం', గోళ్ల నేపథ్యంలో సాగిన 'గోటి పురాణం', ఆవకాయ పచ్చళ్ల మహత్యాన్ని మనసుకు హత్తుకునేలా చెప్పిన 'మామిళ్ల తోటకాడ మాటేస్తే', 'అల్లం అంటే నాకు తెలియదా? బెల్లంలా పుల్లగా ఉంటుంది' అంటూ మొదలై అల్లసాని వారి అల్లిక జిగిబిగిలా సాగిన 'అల్లిక జిగిబిగి' ఇలా శ్రీదోసగీతలో ఉన్న– 'రాజనంది' మినహా 17 కథలు పాఠకులకు తాము అప్పుడెప్పుడో మరిచిపోయిన నవ్వులను మళ్లీ తిరిగి తెచ్చిస్తాయి. తెలుగు ఫలహారం, మిస్టర్ శ్రీమతి కథలు హాస్యంగా సాగుతూనే పాత్రల జీవితంలో విషాదాన్ని చిత్రిస్తాయి. మొత్తానికి 162 పేజీల 'శ్రీదోసగీత' హాసం, మందహాసం, దరహాసం, చిరునవ్వు, విరగబడే నవ్వు, కడుపు చెక్కలయ్యే నవ్వు.. ఇలా నవ్వుల్లో ఎన్ని ఉన్నాయో అన్నిటినీ మనకు పరిచయం చేస్తుంది.

**శ్రీదోసగీత**

**రచన:** నేతి సూర్యనారాయణ శర్మ
**పేజీలు:** 162; **వెల:** రూ. 150/-
**ప్రతులకు:** **ఫోన్:** 99517 48340, 91218 68065


## బుక్ షెల్ఫ్

### అవ్వ (కథలు)



**రచన:** డా. పెరుక రాజు
**పేజీలు:** 108
**వెల:** రూ. 100
**ప్రచురణ:** మై గిఫ్ట్
**ప్రతులకు:** ప్రముఖ పుస్తక దుకాణాలు
**ఫోన్:** 78100 32847

### రుద్రరాగాలు (కవితా సంపుటి)



**రచన:** డా. పి. భాస్కరయోగి
**పేజీలు:** 145
**వెల:** రూ. 150
**ప్రచురణ:** విజ్ఞాన సేవా ప్రచురణలు
**ప్రతులకు:** నవోదయ, ఇతర ప్రముఖ పుస్తక దుకాణాలు

### పూలు పుప్పొడులు (కవితా సంపుటి)



**రచన:** సోలా జానకీదేవి
**పేజీలు:** 96
**వెల:** రూ. 100
**ప్రతులకు:**
ఫోన్: 92931 49792

### చంపకాలోచనమ్ (ఖండకావ్యము)



**రచన:** పాణ్యం దత్తశర్మ
**పేజీలు:** 84
**వెల:** రూ. 99
**ప్రతులకు:** నవోదయ, ఇతర ప్రముఖ పుస్తక దుకాణాలు
**ఫోన్:** 95502 14912

## శివమయం జగతి

### శివలీలలు



రచన : కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య,
**పేజీలు** : 208 **వెల:** రూ. 200,
ప్రతులకు : 94914 11090

**శివలీలలు** అనంతం. శివరూపాలు అనేకం. సాధారణంగా మనం శివుణ్ని లింగమూర్తిగానే కొలుస్తాం. కానీ ఆలయాలకు వెళ్లినప్పుడు శిల్పాలుగా, ఉత్సవమూర్తులుగా అనేక రూపాలు కనిపిస్తుంటాయి. ఆ శిల్పాల వెనుక పురాణ నేపథ్యాలు ఉంటాయి. అర్ధనారీశ్వరుడు, శరభమూర్తి, ఏకపాదమూర్తి, సోమస్కందమూర్తి వంటి శివరూపాల వెనుక ఎన్నో లీలా విశేషాలున్నాయి. అటువంటి శివరూపాలలో అర్చనకు వీలుగా ఆగమ శాస్త్రాలు అతిముఖ్యమైన ఇరవై అయిదు రూపాలను చెప్పాయి. వాటిని పరమేశ్వరుని పంచకృత్యాలు అంటే సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహ రూపాలుగా విభజించి చక్కని కథలను జతచేర్చి సంకలనం చేశారు సత్యబ్రహ్మాచార్య. ఆగమ, వాస్తుశాస్త్రాలపై ఇప్పటికే అనేక పుస్తకాలను వెలువరించిన అనుభవం ఉన్నవారు బ్రహ్మాచార్య. ఈ శివలీలలు పుస్తకంలో ప్రతి రూపానికి ధ్యానశ్లోకాన్ని, శిల్పాన్ని, కథకు అనువైన చిత్రాన్ని కూడా పొందుపరిచారు. తెలుగుతోపాటు ఇంగ్లిషులో కూడా ఆయా రూపాల వివరణను క్లుప్తంగా అందించారు. ఈ శివరూపాలు భక్తులను పరవశింప చేస్తుంది.

# అల్లరి

ALLARI



తెలుగు
కథ



# ఉంగురం

**సదువు, రీతి రివాజు లేని ఒక జడ్డి మనిషి ఉంటుండె. ఆని అదృట్టమేందోగని వానికి ఇగురమున్న మంచి పిల్లతోని లగ్గమైంది. ఆమె మొగున్ని మస్తుగ సగవెట్టాలని మాలెస్కనే తిప్పలువడ్డది. కానీ, ఏడి గొంగడి ఆన్నే అన్నట్టు.. ఆడు మారలేదు.**

ఒకపారి కార్తీక మాసంలో హరికతలు జెప్పేతందుకు ఆ ఊరికి హరిదాసచ్చిండు. ఊరి నడిమిట్లున్న అనుమంతుని గుల్లె రామయాణ కత జెప్పవట్టిండు. ఊరోల్లందరు పోయి తెల్లారెదాంక కూసోని, కతిని దండం బెట్టుకొని వచ్చెటోల్లు. ఆడికి పంపుతె నాలుగు మంచి ముచ్చట్లిని బుద్ధి దెచ్చుకుంటడని కత కాడికి తోలిచ్చింది ఆ పిల్ల. ఇట్టం లేకున్నా పెండ్లాం బాధకు గొణుక్కుంటనే పోయిండు జడ్డి మనిషి. తిని కూసునుడే తప్ప ఏనాడు పనిపాట జేయనోడు కతెట్ల ఇంటడు? గుడికాడికి పోయి ఆకర్ల కూసున్నడు. జెల్దిన్నే నిద్రచ్చింది. ఆన్నే అరుగు మీద పండుకొని గుర్రుకొట్టిండు. తెల్లారెటప్పుడు ఒక కాండ అయిపే యింది. మంగళం పాడి మనిషికింత పసాదం పెట్టిండ్లు. ఎవలో పండుకున్న ఈని నోట్లె ఇంత పసాదం ఏశిండ్రు. తెలివచ్చినంక ఇంటి దారి వట్టిండు జడ్డిమనిషి. మొగడు రాత్రంత కత ఇని అచ్చినందుకు మస్తు సంతోషపడ్డదామె. 'కత ఎట్లుంది?' అని అడిగింది. 'మస్తు కమ్మగుంది' అన్నడాడు. ఎంతో మురిషిందామె. మర్నాడు గూడ మొగున్ని హరికతకు తోలింది. నిన్నటి తీర్గనే పోయి గుల్లె గోడకు ఒరిగిండు. ఎమ్మ గురుకవెట్టిండు. మంది బాగుండుడుతోని పిలగాండ్లకు హరిదాసు కనిపియ్యలేదు. ఇద్దరు పిలగాండ్లు గోడకు ఒరిగున్న జడ్డిగాని భుజాలమీద ఎక్కి కూసుని తెల్లారదాంక కతిన్నరు. తెలివచ్చి లేసి సూసెటాళ్లకు అందరు ఇండ్లల్లకు పోయిండ్రు. మనోనికి పెయ్యంత నొప్పులు తేలినయి. ఈడ్సుకుంట ఇంటికొంగనే.. 'ఇయ్యాల ఎట్లుంది కత?' అని అడిగింది పెండ్లాం. దానికాడు 'అబ్బో.. ఇయ్యాల్ల మస్తు బరువుగుంది' అన్నడు. 'మరి రామా యణమంటే మాటలా! ఆ కతనే గసోంటిది' అని చెప్పి, మొగునికి రామాయణం మెల్ల మెల్లగ నచ్చుతదని మురిషింది.

మూడోరోజు ఎప్పటి తీర్గనే ఆఖరున కూసున్నడు. జెల్దిన్నే కండ్లు మూతలు వడ్డయి. నోరుదెరిశి గురకవెట్టి నిద్రవోయిండు. తెల్లారంగ ఒక ఊరు కుక్క పోతపోతవచ్చి కాలెత్తి పోశింది. కొంచెంసేపటికి ఇంటికి పోయిండు. పెండ్లాన్ని సూడసుడుతోనే.. 'నేను ఇగ కతకు వోను' అని తెగేసి చెప్పిండు. 'ఏమైంది.. కత మంచిగ లేదా?' అడిగిందామె. 'ఏ నీయ్య.. ఇయ్యాల్ల ఉప్పుప్పు గుంది. అస్సలు మంచిగలేదు!' అని అగ్గిమీద గుగ్గిలమైండు. అను మానమచ్చిన పెండ్లాం.. 'అసలు గుల్లెకోయి ఏంజేత్తున్నవ్.. ఏమిన్నవ్.. ఏడ కూసున్నవ్' అని అడిగింది. జరిగిన ముచ్చట్లన్నీ జెప్పిండాడు. గిట్లయితే నడవదని, నాల్గోనాడు మొగన్ని తోల్కోని ఆమెనే గుడికోయింది. జల్దినవోయి ముందు లైన్ల జాగాపింది. మొగున్ని కూడా ముందులైన్లనే కూసోవెట్టుకుంది. నిద్రత్తున్నా.. పెండ్లాం భయానికి తమాయించుకొని కత ఇన్నడు. ఇనంగినంగ మంచిగనిపిచ్చింది. ఆని మొద్దు నిద్ర మాయమైంది. హరికతల అనుమంతుడు సముద్రం మీదికెల్లి ఎగిరి లంకకుపోయే కత జెపుతున్నడు కతకుడు. కతల అనుమంతునికి రాముడిచ్చిన ఉంగురం జారి సముద్రంల వడ్డది. 'పాపం.. అనుమంతునికేం తోస్తలేదు.. సీతమ్మకు రాముని గుర్తు జెప్పెటందుకు తెచ్చిన నిషాని గదొక్కటే. ఏం జెయ్యాలె.. ఎట్ల జెయ్యాలెనని అను మంతుడు తాయిమాయి అయితుండు. ఎట్లనన్న సము ద్రంల దుంకి లెంకులాడుకరావలె అని అనుమంతుడు సోచాయిస్తున్నడు..' అని కతకుడు చెప్పంగనే.. ఈ జడ్డి మనిషి లేచిండు. 'అనుమా..! నువ్ పరేషాన్ కావద్దు. నేను లెంకులాడుకత్త. గా ఉంగురం తెచ్చి నీకు ఇస్తా' అని చెప్పి, ఎగిరి గుడెను కున్న గుండంల దుంకిండు. లెంకి ఉంగురం తెచ్చిండు. అది జూసిన పొరుగూరోల్లు ఈ మనిషెవడో గొప్పోడని దండేశి దండం పెట్టిండ్రు.

...✍ పత్తిపాక మోహన్




## నవ్వుకుందాం

**బంటి:** చింటూ ఒకవేళ కంప్యూటర్‌కు ఆకలేస్తే ఏం తింటుందంటావ్?
**చింటు:** చిప్స్ తింటుందేమో రా..!

**టీచర్:** ఈ భూమి మీద ఎక్కువ సమస్యలు ఉండేది ఎవరికి?
**స్టూడెంట్:** లెక్కల పుస్తకానికి టీచర్!

## తెలుసుకుందాం

- భూమి మీద ఎక్కువ దేశాలలో ప్రవహించే నది.. డాన్యూబ్. (10 దేశాలు)
- ప్రపంచంలో అతిపొడవైన పర్వత శ్రేణి.. ఆండీస్. (దక్షిణ అమెరికా)
- భూమి మీద అతిలోతైన ప్రాంతం.. మేరియానా ట్రెంచ్. (పసిఫిక్ మహా సముద్రంలో ఉంది)



# ప ద కే ళి క

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | ★ | 4 | | 5 | ★ | 6 |
| | ★ | 7 | | 8 | | ★ | 9 | 10 | |
| 11 | 12 | ★ | 13 | | ★ | 14 | ★ | 15 | |
| ★ | 16 | | ★ | 17 | 18 | | ★ | | ★ |
| 19 | | ★ | 20 | ★ | | ★ | 21 | | 22 |
| | ★ | 23 | | 24 | ★ | 25 | | ★ | |
| 26 | 27 | | ★ | | ★ | 28 | | 29 | ★ |
| 30 | | ★ | ★ | 31 | 32 | | ★ | 33 | 34 |
| ★ | 35 | | 36 | ★ | 37 | | ★ | 38 | |
| 39 | | ★ | 40 | | ★ | 41 | | ★ | |

## అడ్డం

1. ప్రస్తుత తెలుగు సంవత్సరం (4)
4. దాండియాలా కర్రలు తాటిస్తూ ఆడే ఆట (3)
7. క్రమం; వరస (4)
9. చారల గాడిద (3)
11. దుర్గంధం (2)
13. దీనికి తగ్గ బొంత.. అని సామెత (2)
15. ఇది ముట్టించడమంటే కడ తేర్చడం (2)
16. ఎవరి కోసమూ ఆగనిది (2)
17. దుగ్ధ; కీర్తి కాంక్ష (3)
19. – – పల్లమెరుగు, నిజం దేవుడెరుగు! (2)
21. ఆకు రాలే రుతువు (3)
23. ఇది ఏ కాలం? (3)
25. ఋరద గుంట (2)
26. రెమ్మ (3)
28. పడవ నడిపేవాడు (3)
30. – – కర్మ క్రియ (2)
31. అయ్యప్ప భక్తులు దర్శించుకునే జ్యోతి (3)
33. వెను తిరిగిన అందియ (2)
35. మనసు (3)
37. అట్నుంచి వేసిన సున్నం (2)
38. ఆభరణం (2)
39. దేవతా నైవేద్యం (2)
40. ఒప్పు కాని అపరాధం (2)
41. దొడ్డిదారినొచ్చిన మార్జాలం (2)

## నిలువు

1. కుక్క (3)
2. కరుణ; దయ (2)
3. గుర్రం (3)
4. దంష్ట్ర; మొనదేలిన మీసం (2)
5. వెండి నాణెం బిళ్ల (2)
6. వాడుకలో పంకం (3)
8. గౌరవార్థం మెడలో వేసే బిళ్ల (3)
10. ఒక తిథి (4)
12. వదంతి (3)
14. పాండవమాతల్లో ఒకరు (2)
18. తలాడించే 'బసవన్న' (2)
19. మంచు (4)
20. తాత్కాలిక విడిది (2)
21. డేరా (3)
22. మనోవ్యథ (2)
23. షికార్ (2)
24. కిందనుండి చేసిన విన్నపం (3)
25. రంగులు మార్చే తొండ ! (5)
27. సమాచారం (4)
29. పిల్లలు ఇసుకలో కట్టే గూళ్లు (3)
32. అబద్ధం (2)
34. రోదసి (3)
36. తాత్కాలిక మార్కెట్ (2)

### గత సంచిక సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ★ | సా 1 | ★ | జూ 2 | కా | లు 3 | ★ | నె 4 | గ | డు 5 |
| అ 6 | మె | జా 7 | న్ | ★ | మే 8 | ఖ 9 | ల | ★ | మ్మా |
| ప 10 | త | తి | ★ | ధూ 11 | ★ | ని 12 | వు | రు 13 | ★ |
| వా | ★ | ★ | ★ | పం 14 | క 15 | జం | ★ | షి 16 | దో 17 |
| దు 18 | రా 19 | శ 20 | ★ | ★ | డ | ★ | దొం 21 | ★ | మ |
| ★ | వ 22 | ని | త 23 | ★ | ది 24 | వం | గ | త 25 | ★ |
| తా 26 | ణా | ★ | వం 27 | శ 28 | ★ | ★ | ★ | ని 29 | శ 30 |
| ము 31 | సు | గు 32 | ★ | మీ 33 | సం 34 | ★ | ఆ 35 | వి | రి |
| ★ | రు 36 | హ | డు | ★ | గ 37 | డ | ప | ★ | బ |
| వే 38 | డు | ★ | ★ | హో 39 | మం | ★ | ద 40 | రి | ★ |

**పక్షులకు కొంత ధాన్యం, పశువులకు కొంత గ్రాసం.. మనిషికి కొంత సాయం.. ఇదే నిజమైన జీవితం.**

### సినిమా పజిల్

| | | | | |
|---|---|---|---|---|
| ◆ | 1 | 2 | | ◆ |
| 3 | ◆ | | ◆ | 4 |
| 5 | | ◆ | 6 | |
| | ◆ | 7 | ◆ | |
| ◆ | 8 | | | ◆ |

| | | | | |
|---|---|---|---|---|
| ◆ | జ 1 | ము 2 | న | ◆ |
| స 3 | ◆ | త్తు | ◆ | వై 4 |
| ము 5 | రా | ◆ | కృ 6 | ష్ణ |
| ద్రం | ◆ | ఇం 7 | ◆ | వ్ |
| ◆ | ఇం 8 | ద్ర | జ | ◆ |

నిర్వహణ : విశ్వజ

## అడ్డం

1. 'వెన్నెల్లో గోదారి అందం' పాట ఈ చిత్రంలోనిదే (3)
5. బంగారంలాంటి హాస్య నటి (2)
6. యద్దనపూడి నవలతో విజయనిర్మల చిత్రం (2)
8. 'గోరంతదీపం' వెలిగించిన నటి (3)

## నిలువు

2. 'ఝుమ్మంది నాదం' తార (2)
3. 'సర్కారు వారి పాట' పాడబోతున్న బాబు! (3)
4. చిరంజీవి తొలినాళ్లలో వేసిన రాళ్లు (3)
7. 'అంతా భ్రాంతి యేనా' గాయని (2)

# చిట్టి కథ


- జెన్




## నటన

'డైరెక్టర్‌గారు
సొంత కూతురిలా చూసుకున్నారు.
హీరో దేవుడిలాంటి మనిషి'
.. తొలి సినిమా అయినా
కెమెరా ముందు తడబడలేదు.
ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నటించడమే
నరకంలా అనిపించింది ఆ నటికి.

## కలలోకి..





'గుడ్ నైట్'
'గుడ్ నైట్.
త్వరగా పడుకో.
పది నిమిషాల్లో వచ్చేస్తా..'
అతను మాటిచ్చాడు.
ఆమె తృప్తిగా నిద్రలోకి
జారుకుంది.
అతను అమెరికాలో.
ఆమె హైదరాబాద్‌లో.
సూపర్‌సానిక్ విమానం కంటే
కలల వేగమే ఎక్కువ!



## గిఫ్ట్ ఐడియా

'ఈ రోజు నా భార్య బర్త్ డే.
తనను సంతోషపెట్టే
ఐడియా చెప్పు'
ఆమెను దగ్గరికి
తీసుకుంటూ అడిగాడు.
విదిలించుకుంటూ చెప్పింది..
'మనం విడిపోదాం'


## మరో ప్రపంచం



'చూడవే..నిన్నే చూస్తున్నాడు'
ఆడవాళ్లు ఆమెను
వేళాకోళం చేస్తున్నారు.
'రేయ్! నీ అడుగుల చప్పుడు
వినిపిస్తే చాలు. ఆమె
తలతిప్పి చూస్తుంది'
పురుషులంతా అతణ్ని
ఆటపట్టిస్తున్నారు.
రెండూ అబద్ధాలే.
అతని చూపు మందగించింది.
ఆమెకు మహా చెవుడు!
అదో వృద్ధాశ్రమం.
ముసలితనం..
రెండో బాల్యమే కాదు,
మరో కౌమారమూ!

## దేవుడు

ఓ భక్తుడు..
రాయీరాయీ పేర్చాడు. గుడి కట్టాడు.
విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. మరుక్షణమే..
వేదపండితులు వచ్చారు.
వీఐపీల రద్దీ పెరిగింది.
ఆ ఉక్కపోత తట్టుకోలేక
నిశ్శబ్దంగా నిష్క్రమించాడు భక్తుడు.
అతని చిటికెన వేలు పట్టుకుని
దేవుడు కూడా!




homeocare.in
హోమియోకేర్®
ఇంటర్‌నేషనల్
వరల్డ్-క్లాస్ హోమియోపతి
HOMEOCARE INTERNATIONAL
35TH ANNIVERSARY CELEBRATIONS
మా 35వ వార్షికోత్సవ కానుక
చికిత్సలో
సగం ఖర్చు మీది*
మిగితా సగం మా
బహుమానం
Offer valid upto April 30th only
*Conditions apply
స్పెషాలిటీ చికిత్సలు
• స్పాండిలోసిస్ • డిస్క్ సమస్యలు • సయాటికా • కీళ్ళనొప్పులు • రుమటాయిడ్ ఆర్థరైటిస్ • గౌటి ఆర్థరైటిస్ • డయాబెటిస్ • థైరాయిడ్
• సంతానలేమి • PCOD • పైల్స్ • ఫిస్టుల • సైనసైటిస్ • ఫైబ్రాయిడ్ యుటిరస్ • చర్మ సమస్యలు • ఆస్తమా • టాన్సిలైటిస్
• గ్యాస్ట్రిక్ & అసిడిటి సమస్యలు • ఎక్జిమా • సన్ అలర్జీ • హార్మోన్ సమస్యలు • సోరియాసిస్ • కిడ్నీలో రాళ్ళు • డర్మటైటిస్
ఉచిత కన్సల్టేషన్ 955 000 1199
టోల్ ఫ్రీ 1800 108 1212
• హైదరాబాద్: (అబిడ్స్ | బేగంపేట్ | కూకట్‌పల్లి | దిల్‌సుఖ్‌నగర్ | జూబ్లీహిల్స్ | మెహదీపట్నం | మియాపూర్)
• హనుమకొండ • కరీంనగర్ • నిజామాబాద్ • మహబూబ్‌నగర్ • ఖమ్మం • విజయవాడ • విశాఖపట్నం • తిరుపతి
• కాకినాడ • రాజమండ్రి • గుంటూరు • ఒంగోలు • నెల్లూరు • కర్నూలు • కర్ణాటక • తమిళనాడు • పుదుచ్చేరి